www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 22-12-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 286
శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: విదియ ఉ.10.52 తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ తె.5.32 తదుపరి శ్రవణం, వర్జ్యం: మ.12.14-1.58, దుర్ముహూర్తం: మ.12.35-1.19, మ.2.47-3.31, అమృతఘడియలు: రా.10.37-12.20, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.44, సూర్యాస్తమయం: 5.42 | గుంటూరు సిటీ
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కలెక్టర్ గారి అబ్బాయ్..



40 లక్షల మందికి పోలియో చుక్కలు

లక్ష్యంలో 74% మందికి పూర్తి

పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం బాపట్లలో తన కుమారుడికి పోలియో చుక్కలు వేయించుకుంటున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

10

ప్రస్తుతం ఉన్న సర్పంచ్‌ల పదవీకాలం మరో మూడు నెలల్లో ముగియనుంది. మార్చిలో అందరూ మాజీలు కాబోతున్నారు. సర్పంచ్‌లలో అత్యధిక శాతం వైసీపీకి చెందినవారే. కూటమి బలంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ గెలవలేమన్న విషయం వారికీ తెలుసు. దీంతో పదవిలో ఉండగానే అందినకాడికి దోచేద్దాం అన్నట్టుగా చెలరేగిపోతున్నారు. ఈ విషయం కూటమి ప్రభుత్వం దృష్టికి రావడంతో అప్రమత్తమైంది. నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేస్తే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ కమిషనరేట్ హెచ్చరించింది.



ఖజానా ఖాళీ చేద్దాం!

పంచాయతీల్లో వైసీపీ సర్పంచ్‌ల దందా

- మార్చిలో ముగియనున్న పదవీకాలం
- పదవిలో ఉండగానే సర్దేయాలని యత్నం
- 15వ ఆర్థిక సంఘం నిధులు ఎడాపెడా ఖర్చు
- చిన్నచిన్న పనులకూ పెద్దఎత్తున బిల్లులు డ్రా
- కొనుగోళ్లు చేయకున్నా దొంగబిల్లులు
- పనులు చేయకుండానే ఎంబుక్ రికార్డు
- సర్పంచ్‌లకు సహకరిస్తున్న అధికారులు
- పసిగట్టిన పంచాయతీరాజ్ కమిషనరేట్
- వ్యయంలో తేడాలుంటే వేటేనని హెచ్చరికలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మొన్నటి దాకా చేసిన పనులకు బిల్లులు రాలేదంటూ గగ్గోలు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందినవారే నిధుల కోసం రోడ్డెక్కారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు బకాయిలు చెల్లించడం, నిధులు విడుదల చేయడంతో ఇప్పుడు వారు 'సొంత లాభం' చూసుకుంటున్నారు. దీపం ఉండగానే ఇల్లు సర్దేద్దామన్న రీతిలో పంచాయతీ నిధులు కుమ్మేస్తున్నారు. గత వైసీపీ ఏలుబడిలో గెలిచిన సర్పంచ్‌ల వరస ఇదీ. రాష్ట్రవ్యాప్తంగా చాలా పంచాయతీల్లో ఇదే పరిస్థితి. గత వైసీపీ హయామంతా కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వమే దారి మళ్లించింది. పంచాయతీలను నామమాత్రం చేసేసింది. గ్రామాల్లో సర్పంచ్‌లు చిన్న పని చేయాలన్నా నిధులు లేని దుస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాలకు మళ్లీ మహర్దశ తీసుకువచ్చింది. ఇటీవల పంచాయతీరాజ్ శాఖలో భారీగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించారు. అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించి

మిగతా 11వ పేజీలో...



రైలు టికెట్ల ధరలు పెంపు!

- కిలో మీటరుకు 1-2 పైసలు చొప్పున పెంచిన రైల్వే శాఖ
- ఈనెల 26 నుంచే అమలు
- 600 కోట్ల అదనపు ఆదాయం
- 215 కి.మీ.లోపు ప్రయాణానికి ఎలాంటి పెంపూ లేదు

న్యూఢిల్లీ, డిసెంబరు 21: రైలు ప్రయాణికుల చార్జీలు పెంచుతూ.. భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రైలు స్థాయిని బట్టి కిలో మీటరుకు 1 నుంచి రెండు పైసల చొప్పున పెంచుతున్నట్టు తెలిపింది. ఈ పెంపు ఈ నెల 26 నుంచి అమల్లోకి రానుంది. తద్వారా రైల్వేకు రూ.600 కోట్ల మేరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని వివరించింది. 215 కిలోమీటర్ల దూరాన్ని మించి ప్రయాణించే వారికే ఈపెంపు వర్తిస్తుందని రైల్వే శాఖ తెలిపింది. ఆర్డినరీ రైళ్లలో 215 కిలో మీటర్లు దాటి ప్రయాణించే వారికి.. కిలోమీటరుకు 1 పైసా చొప్పున, మెయిల్/ఎక్స్‌ప్రెస్, నాన్ ఏసీ, ఏసీ వంటి రైళ్లలో ప్రయాణించేవారికి కిలో మీటరుకు 2 పైసల చొప్పున టికెట్ ధరలు పెరగనున్నాయి. నాన్‌ఏసీ రైళ్లలో 500 కి.మీ. దూరం ప్రయాణించేవారు.. రూ.10 అదనంగా

మిగతా 2వ పేజీలో...

లక్ష మంది టీచర్లపై టెట్ ఎఫెక్ట్



- టెట్ లేని ఉపాధ్యాయులు 1,27,802
- ఐదేళ్లలోపు రిటైరయ్యేవారు 23,207
- వీరికి టెట్ నుంచి మినహాయింపు
- పదోన్నతి కావాలంటే రాయాల్సిందే
- తప్పనిసరిగా రాయాల్సిన వారు 1,04,595
- ప్రస్తుతం రాసినవారు 30,938
- మిగిలిన 73,657 మంది పరిస్థితి ఏంటి?
- మినహాయింపు కోసం ప్రభుత్వం ప్రయత్నాలు
- సడలింపు లభించకపోతే పరిస్థితి ఏంటి?
- వివరాలు కేంద్రానికి పంపిన విద్యా శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) అందరికీ తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్రంలో లక్ష మందికి పైగా టీచర్లపై ప్రభావం చూపుతోంది. వీరిలో దాదాపు 31 వేలమంది ప్రస్తుతం టెట్ రాశారు. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారిని మినహాయిస్తే మరో 74 వేలమంది పరిస్థితి ఏంటి? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ఇన్ సర్వీసు టీచర్లకు మినహాయింపు లభిస్తుందా? ఒకవేళ మినహాయింపు లభించకపోతే వారి పరిస్థితి ఏంటి? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇన్ సర్వీస్ టీచర్ల టెట్ వివరాలను పంపాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర వివరాలను కేంద్రానికి పంపింది. రాష్ట్రంలో 1.51 లక్షల మంది టీచర్లు ఉన్నారు. వారిలో 1,27,802 మంది 2012కు ముందు డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందారు. 2011లో దేశవ్యాప్తంగా టెట్ అమల్లోకి వచ్చింది. ఏపీలో మాత్రం 2012లో మొదటిసారి టెట్ నిర్వహించారు. అంటే.. 1.27 లక్షల మంది టీచర్లు ఇప్పుడు టెట్ అర్హత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. వారిలో 23,207 మందికి సర్వీసు ఐదేళ్లలోపే ఉంది. వారికి టెట్ నుంచి సుప్రీంకోర్టు మినహాయింపునిచ్చింది. అయితే వారు పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో

మిగతా 11వ పేజీలో...



2

ప్రయోగ వేదికపై ఎల్వీఎం3-ఎం6 రాకెట్

బాహుబలి లోడింగ్!

- 24న భారీ వాణిజ్య ప్రయోగానికి ఇస్రో రెడీ
- ఎల్వీఎం-3 రాకెట్‌తో తొలిసారిగా భారీ ప్రయోగం
- 6,100 కిలోల బ్లూబర్డ్ ఉపగ్రహం నింగిలోకి

కోడికి రాజ యోగం!

'కోట్లాట'కు ముందు మహారాజ పోషణ

తెల్లవారుజామునే నిద్రలేవడం.. చన్నీళ్లలో స్విమ్మింగ్ చేసేసి కాసేపు వ్యాయామం చేయడం.. అనంతరం టిఫిన్ సెషన్‌లో జీడిపప్పు, బాదం పప్పులు, ఉడికబెట్టిన గుడ్లు లాగించేయడం.. కాసేపటికి కేర్ టేకర్ వచ్చి ఇచ్చే విటమిన్లు, పౌష్టికాహారం (చోళ్లు, గంట్లు) తిన్నాక తోటలో చెట్ల కింద హాయిగా విశ్రాంతి తీసుకోవడం.. మళ్లీ మధ్యాహ్నం లంచ్..! ఆ తర్వాత మూడు గంటల నుంచి వ్యాయామం. సాయంత్రం మళ్లీ కాసేపు స్విమ్మింగ్.. రాత్రికి డిన్నర్‌లో జీడిపప్పు, బాదంపప్పు, గుడ్లు తినేసి.. నిద్రలోకి జారుకోవడం..! ఈ డైలీ మెనూ చదువుతుంటే.. రాజభోగం గుర్తొస్తుంది కదూ..! కానీ.. అదేం కాదు. సంక్రాంతి పందేలకు సిద్ధమయ్యే కోళ్లకు ఇచ్చే ప్రత్యేక శిక్షణ, వాటికి పెట్టే ఆహార పద్ధతులివి!



ప్రత్యేక ఆహారం అందిస్తున్న దృశ్యం

- బాదం, జీడిపప్పు, కైమా వంటి ఖరీదైన ఆహారం
- బలం పుంజుకునేందుకు మద్యం కూడా..
- ఒళ్లు నొప్పులు తగ్గేందుకు ఆయిల్ కాపడం
- స్విమ్మింగ్, వ్యాయామంతో రాటుదేలుతున్న పందెం కోళ్లు
- సంక్రాంతి బరిలోకి దిగేందుకు జాతి పుంజులు సిద్ధం

(జంగారెడ్డిగూడెం రూరల్ - ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పందేలకు కోళ్లను సిద్ధం చేయాలంటే వేలాది రూపాయలు ఖర్చుచేసి ఏడాదిపాటు వాటిని పోషించాలి. వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ బలమైన పౌష్టికాహారం అందించాలి. అప్పుడే జాతిరత్నాల్లాంటి పందెం కోళ్లు తయారవుతాయి. వీటి కోసం ప్రత్యేక రూమ్‌లు ఏర్పాటుచేయాలి. ఫ్యాన్లు

మిగతా 11వ పేజీలో...



ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతంలో ప్రత్యేకంగా పెంచుతున్న పందెం కోడిపుంజులు

విధేయతకు పట్టం


టీడీపీ పార్లమెంటరీ సారథులు ఖరారు



- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం
- సామాజిక సమీకరణలతో పదవుల కూర్పు
- 8 మంది బీసీలు, నలుగురు ఎస్సీలకు చోటు
- 11 మంది ఓసీలు.. ఎస్టీ, మైనారిటీలకు చెరొకటి
- ఐదుగురు మహిళలకు బాధ్యతలు
- నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీకి చాన్సు
- ఆరుగురు నామినేటెడ్ చైర్మన్లకు కూడా..
- శ్రేణుల సూచనలతో ఐదుగురి మార్పు

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత చంద్రబాబు పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఖరారు చేశారు. వారి జాబితాను పార్టీ నాయకత్వం ఆదివారం విడుదల చేసింది. ఇందులో విధేయతకు, సీనియారిటీకి ప్రాధాన్యమిచ్చారు. సామాజిక సమీకరణలతో పదవుల కూర్పు జరిగింది. మొత్తం 25 పార్లమెంటు స్థానాలకుగాను 14 స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను అధ్యక్షులుగా నియమించారు. మిగిలిన 11 స్థానాలను ఓసీలకు కేటాయించారు. పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా సుదీర్ఘ కసరత్తు తర్వాత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను చంద్రబాబు నియమించారు. అధ్యక్షులుగా నియమితులైన వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. పార్టీకి అంకితభావంతో

మిగతా 11వ పేజీలో...



బీజేపీ కళ్లద్దాలతో సంఘ్‌ను చూడొద్దు

- ఆరెస్సెస్‌కు రాజకీయ అజెండా లేదు
- హిందూ సమాజ రక్షణే సంఘ్ ధ్యేయం
- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టీకరణ

కోల్‌కతా, డిసెంబరు 21: బీజేపీ కళ్లద్దాలతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను చూడడం అతిపెద్ద తప్పని ఆ సంస్థ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ చెప్పారు. బీజేపీతో ఆరెస్సెస్‌ను పోల్చడం, రాజకీయ కోణంలో చూడడంతో అపార్థాలు తలెత్తుతున్నాయన్నారు. ఆరెస్సెస్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని, హిందూ సమాజాన్ని సంరక్షించడంతో పాటు అభివృద్ధికి పాటుపడడమే లక్ష్యమని భాగవత్ స్పష్టం చేశారు. హిందువులు జాగృతమయ్యారని, భారత్ త్వరలోనే విశ్వగురు స్థానానికి తిరిగి

మిగతా 2వ పేజీలో...



కెరీర్లు.. కుటుంబాలపై పిడుగు!

- ముదిరిన హెచ్-1బీ వీసా సంక్షోభం
- వేల మంది భారతీయులపై ప్రభావం
- ఇంటర్వ్యూ తేదీల వాయిదాతో తిప్పలు

2

దేవుడికీ దొరకరు!

కొందరు ఈవోలు గుడికి వారానికోసారి వచ్చినా గొప్పే

ఆలయాల్లో పారిశుధ్యం సరిగ్గా ఉండడం లేదు. భక్తుల్లో సంతృప్త స్థాయి పెరగడం లేదు.. దర్శనాలు కూడా చాలా ఆలస్యమవుతున్నాయని మొత్తుకుంటున్నారు. సీఎం చంద్రబాబు కూడా దేవదాయ శాఖపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయినా ఆ శాఖ అధికారుల్లో మార్పు లేదు. ముఖ్యంగా ఆలయాల కార్యనిర్వహణాధికారుల (ఈవోలు) తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. కొన్ని ప్రధాన ఆలయాల ఈవోలు మినహా.. మెజారిటీ అధికారులు గుళ్లలో కనిపించడమే లేదు.



- వారిని దర్శించాలంటే సొంతూరు వెళ్లాల్సిందే
- ఆలయాల్లో విధుల కంటే.. రాబడిపైనే దృష్టి
- రియల్ ఎస్టేట్, సొంత వ్యాపారాలతో బిజీ
- హుండీ లెక్కింపు, బోర్డు మీటింగులు ఉంటేనే రాక
- గుళ్లను గాలికొదిలేసినా పట్టించుకోని శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో దాదాపు 70 శాతం మంది ఈవోలు రోజూ ఆలయాలకు వెళ్లడం లేదు. చివరకు భగవంతుడికి కూడా వారు దొరకడం లేదు. కొందరు నెలకోసారి ఆలయాలను సందర్శిస్తారు. మరికొంత మంది వారానికో, మూడ్రోజులకో మొక్కుబడిగా వెళ్లి దేవుడికి కనబడి వెళ్తుంటారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ క్యాడర్ ఆలయాల్లో చాలా మంది ఈవోలు ఆలయాల్లో విధుల కంటే రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో నిమగ్నమై ఉన్నారు. కోనసీమ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఈవోకు రియల్ ఎస్టేట్ కింగ్‌గా పేరుంది. దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో కీలకమైన అధికారి, మరో అసిస్టెంట్ కమిషనర్ కలిసి విశాఖపట్నం వేదికగా ఏకంగా

మిగతా 11వ పేజీలో...

ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహం



- రైతులకు మరిన్ని రాయితీలు
- సాగు పెంపే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- 100% రాయితీతో మొక్కలు సరఫరా
- నీటి పారుదల, సస్య రక్షణ చర్యలకూ సాయం

3



10

గుడ్డు కొత్త రికార్డు

- అనపర్తి, తణుకుల్లో హోల్‌సేల్ ధర రూ.7.15
- శ్రీకాకుళం, విజయనగరంలో 7.06, విశాఖలో 7.02
- చిత్తూరు ధర 6.93, బెజవాడలో 6.90

బీజేపీపై కార్పొరేట్ల విరాళాల వర్షం

2

- 2024-25లో రూ.3,112 కోట్లు
- మొత్తం విరాళాల్లో బీజేపీకే 82%
- కాంగ్రెస్, ఇతర పార్టీలకు కలిపి 18%
- వైసీపీకి 98 కోట్లు, టీడీపీకి 44 కోట్లు, బీఆర్ఎస్‌కు రూ.10 కోట్లు




6

బిగ్‌బాస్-9 విజేతగా కల్యాణ్ పడాల

బీజేపీ కళ్లద్దాలతో సంఘ్‌ను చూడొద్దు

(మొదటిపేజీ తరువాయి)



చేరుకుంటుందని, ఇదే సంఘ్ లక్ష్యమని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకల సందర్భంగా కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సంఘ్‌కు శత్రువుల్లేరని, అయితే ఆర్‌ఎస్‌ఎస్ విస్తరిస్తున్న కొద్దీ కొందరు స్వార్థపరుల దుకాణాలు మూతపడుతున్నాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. సంఘ్‌పై అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే ఆ అభిప్రాయాలు వాస్తవాల ఆధారంగా ఏర్పరచుకుంటే బాగుంటుందని చెప్పారు. సంఘ్‌పై జరిగే దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు కోల్‌కతాతో పాటు ముంబై, ఢిల్లీ, బెంగళూరులో కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. స్థానిక ఉత్పత్తులనే కొనాలని భాగవత్ పిలుపునిచ్చారు. ఇతర దేశాల భాషల కన్నా మాతృభాషలో మాట్లాడటానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

బంగ్లా అక్రమ వలసదారులు అసోంలో స్థిరపడడానికి కాంగ్రెస్ సాయం: మోదీ

గువాహటి, డిసెంబరు 21: బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులు అసోంలో స్థిరపడేందుకు సాయం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశద్రోహ చర్యలకు పాల్పడుతోందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవడమే ఆ పార్టీ లక్ష్యమని, స్థానిక ప్రజల గురించి ఏ మాత్రం పట్టించుకోదని విమర్శించారు. రెండ్రోజుల అసోం పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. దిబ్రూగఢ్ జిల్లా నమ్‌రూప్‌లో రూ.10,601 కోట్లతో నిర్మించతలపెట్టిన ఎరువుల కర్మాగారానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కాగా, 'పరీక్షా పే చర్చ'లో భాగంగా ఆదివారం బ్రహ్మపుత్ర నదిలో విహార నౌకలో ప్రయాణిస్తూ 25 మంది విద్యార్థులతో మోదీ మాట్లాడారు.

ఉత్తరాఖండ్ స్కూళ్లలో విధిగా గీతా పారాయణం

డెహ్రాడూన్, డిసెంబరు 21: ఉత్తరాఖండ్‌లోని అన్ని పాఠశాలల్లో భగవద్గీత శ్లోకాల పఠనాన్ని తప్పనిసరి చేసినట్లు సీఎం పుష్కర్‌సింగ్ ధామీ ప్రకటించారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతి, నైతిక విలువలు,జీవన తత్వాన్ని బోధించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు.

మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో మహాయుతి విజయం

ముంబై, డిసెంబరు 21: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి సత్తా చాటింది. 288 మున్సిపల్ కౌన్సిళ్లు, నగర పరిషత్ పంచాయతీ సీట్లకు గాను 207 సీట్లలో నెగ్గింది. బీజేపీ సొంతంగా 117 చోట్ల విజయదుందుభి మోగించింది. బీజేపీ గుర్తుపై 48 శాతం కౌన్సిలర్లు విజయం సాధించారని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. మహాయుతి కూటమిలో శివసేన-53, ఎన్సీపీ-37 చోట్ల గెలిచాయి. విపక్ష మహావికాస్ అఘాడీ 44 స్థానాలకు పరిమితమైంది. కాంగ్రెస్-28, ఎన్సీపీ(శరద్ పవార్)-7, శివసేన(యూబీటీ)-9 స్థానాల్లో గెలుపొందాయి.

'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర

న్యూఢిల్లీ, డిసెంబరు 21: అణురంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు బిల్లుకు శనివారం రాష్ట్రపతి ఆమోదం తెలిపారని కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది.

బీజేపీపై కార్పొరేట్ల విరాళాల వర్షం

న్యూఢిల్లీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికల బాండ్ల రద్దు తర్వాత తొలి ఆర్థిక సంవత్సరం 2024-25లో రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థల నుంచి భారీగా విరాళాలు అందాయి. వివిధ పారిశ్రామిక సంస్థలు నిధులిచ్చే తొమ్మిది ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి ఆయా పార్టీలు మొత్తంగా రూ.3,811 కోట్లు అందుకోగా.. కేంద్రంలో అధికార పార్టీగా ఉన్న బీజేపీయే.. సింహభాగం రూ.3,112.34 కోట్లు (82%) దక్కించుకుంది. కేంద్ర ఎన్నికల సంఘానికి(ఈసీ) వివిధ ట్రస్టులు సమర్పించిన నివేదికల ప్రకారం.. మొత్తం విరాళాల్లో ప్రతిపక్ష కాంగ్రెస్‌కు కేవలం రూ.299 కోట్లు(8%) వెళ్లగా.. ఇతర పార్టీలన్నీ కలిపి రూ.400 కోట్లు (10%) పొందాయి. వీటిలో టీఎంసీకి రూ.102 కోట్లు, వైసీపీకి రూ.98 కోట్లు, టీడీపీకి రూ.44 కోట్లు, బీజేడీకి 15 కోట్లు, బీఆర్‌ఎస్, డీఎంకేలకు చెరో రూ.10 కోట్లు విరాళంగా లభించాయి. 2024-25లో ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్టు ఒక్కటే బీజేపీకి రూ.2,180కోట్లు విరాళాలు అందించి.. అతిపెద్ద దాతగా నిలిచింది.

గాదె ఇన్నయ్య అరెస్ట్

- జఫర్‌గఢ్ ఆశ్రమంలో అదుపులోకి తీసుకున్న ఎన్‌ఐఏ



ఇన్నయ్యను తీసుకెళుతున్న పోలీసులు

జఫర్‌గఢ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రేగడితండా పరిధిలోని మా ఇల్లు ప్రజాదరణ ఆశ్రమ నిర్వాహకుడు, మాజీ మావోయిస్టు నాయకుడు గాదె ఇన్నయ్యను ఎన్‌ఐఏ పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబరులో ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన భూపాలపల్లి జిల్లాకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కట్టా రామచంద్రారెడ్డి అంత్యక్రియల్లో ఇన్నారెడ్డి పాల్గొన్నారు. అక్కడ ఓ ఛానల్‌తో మాట్లాడిన ఆయన.. మావోయిస్టులకు, వారి ఉద్యమానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేశారని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పోలీసులు ఉపా చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఇన్నయ్య ఆశ్రమానికి వచ్చిన పోలీసులు ఆయా అంశాలకు సంబంధించి సుమారు గంటకు పైగా ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. మధ్యాహ్నం ఆయనను హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం 14రోజులు రిమాండ్ విధించింది. కాగా, జఫర్‌గడ్ మండలం సాగరంనకు చెందిన ఇన్నయ్య గతంలో మావోయిస్టు ఉద్యమ నేతగా పని చేశారు. జన జీవనంలోకి వచ్చాక ఇన్నయ్య-పుష్పారాణి దంపతులు 2006లో సాగరం క్రాస్ వద్ద మా ఇల్లు ప్రజాదరణ పేరుతో ఆశ్రమం స్థాపించారు. అనాథలు, నిరుపేద పిల్లల ఉన్నతికి కృషి చేస్తున్నారు. కాగా, గాదె ఇన్నయ్యను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ డిమాండ్ చేసింది.

రైలు టికెట్ల ధరల పెంపు!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాల్సి ఉంటుంది. ఇక, సబర్బన్, నెలవారీ సీజన్ టికెట్లు తీసుకునే వారికి ఈ పెంపు వర్తించదు. కాగా.. ఈ ఏడాదిలో టికెట్ ధరలు పెంచడం ఇది రెండోసారి. ఈ ఏడాది జూలైలో పెంచిన టికెట్ ధరలతో శాఖకు రూ.700 కోట్లకుపైగా అదనపు ఆదాయం చేకూరింది.



244 అదనపు రైళ్లు

క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 8 జోన్లలో 244 అదనపు రైళ్లను నడపనున్నట్టు రైల్వే శాఖ తెలిపింది. ప్రయాణికుల అవసరాలు, రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. అవసరాన్ని బట్టి మరిన్ని రైళ్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్టు వివరించింది. ఈ జాబితాలో ఢిల్లీ, హౌరా, లఖ్‌నవు సహా సుదూర ప్రాంతాల స్టేషన్లు కూడా ఉన్నాయి. 2014-25 మధ్య కాలంలో 2 లక్షల వ్యాగన్లను సమకూర్చుకున్నట్టు శాఖ వివరించింది. అదేవిధంగా 10 వేలకుపైగా లోకోమోటివ్‌లను పెంచినట్టు తెలిపింది.

సిబ్బంది ఏరీ?: డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్(డీఎఫ్‌సీ) ఏర్పాటుకు కేంద్రం ఆగమేఘాలపై చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈవ్యవహారంపై ఆక్షేపణ వ్యక్తం చేసింది. తగిన సిబ్బంది లేకుండా.. డీఎఫ్‌సీ ప్రయోగం ఎందుకని ప్రశ్నించింది. నిపుణులైన సిబ్బంది డీఎఫ్‌సీకి అవసరమని పేర్కొంది. కానీ, ప్రస్తుతం సిబ్బంది లేరని.. ఇది ప్రధాన సవాలుగా మారుతుందని అభిప్రాయపడింది. డీఎఫ్‌సీ కింద హైకెపాసిటీ ట్రాక్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మరింత సమర్థవంతంగా, వేగంగా రైళ్లను నడపాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే.. లక్ష్యం బాగున్నా సిబ్బంది లేకపోవడాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘం తప్పుబట్టింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ కూడా అంగీకరించడం గమనార్హం. లోకో పైలట్లు 1,42,814 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 1,07,928 మంది మాత్రమే ఉన్నారు. గూడ్స్ ట్రైన్ మేనేజర్లు 22,082 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 12,345 మంది మాత్రమే ఉన్నారు. అదేవిధంగా స్టేషన్ మాస్టర్లు 2,06,495 మంది ఉండాల్సి ఉండగా.. 1,59,219 మంది మాత్రమే ఉన్నారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని స్థాయీ సంఘం తన నివేదికలో స్పష్టం చేసింది.

విభాగాల వారీగా పెంపు ఇలా..

- సబర్బన్, నెలవారీ సీజన్ టికెట్లకు ఎలాంటి పెంపూ లేదు. ఆర్డినరీ క్లాస్‌లో 215 కి.మీ. వరకు ఎలాంటి పెంపూ ఉండదు.
- 215 కి.మీ. మించితే మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్‌ఏసీ తరగతుల వారికి పైసా చొప్పున పెంపు. ఏసీ క్లాస్‌కు కి.మీ.కు 2 పైసలు చొప్పున పెంపు.
- నాన్ ఏసీ 500 కి.మీ. దూరానికి రూ.10 చొప్పున అదనం.

చంద్రబాబు కుట్రతోనే పాలమూరు డీపీఆర్ వెనక్కి

- వైజాగ్‌లో స్టార్‌హోటళ్ల వంటమనుషులతో ఆయన ఎంవోయూలు
- ఇక కాంగ్రెస్ భరతం పడతా: కేసీఆర్



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు కుట్ర కారణంగానే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపిందని బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేతల సంయుక్త సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బీజేపీ మొదటి నుంచీ తెలంగాణకు శని. కేంద్ర సర్కారుకు ఎంపీలు అవసరం కాబట్టి చంద్రబాబు మాటలు విని పాలమూరు డీపీఆర్‌ను వాపస్ పంపింది. దీనిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు నిలదీయడంలేదు' అని ప్రశ్నించారు. 'ఇప్పటివరకు ఓ లెక్క.. రేపటి నుంచి మరో లెక్క. నేనే వస్తున్నా.. తోలు తీస్తా. ప్రజలతో కలిసి కాంగ్రెస్ భరతం పడతా' అని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత సేపూ రియల్ ఎస్టేట్ దందా తప్ప.. ప్రజా సంక్షేమం పట్టడంలేదన్నారు. అన్ని రంగాలను కుదేలు చేస్తున్న సర్వభ్రష్ట కాంగ్రెస్ సర్కారుపై పోరాటం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రానికి వచ్చే నీళ్లను కూడా కాపాడలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేవలం 40 టీఎంసీలు చాలునంటూ కేంద్రానికి ఎలా లేఖ రాస్తారని ప్రశ్నించారు. గోదావరి జలాల దోపిడీ జరుగుతుంటే.. ఎవరి ప్రయోజనాల కోసం చప్పుడు చేయకుండా ఉన్నారని నిలదీశారు. ఇక తానే స్వయంగా రంగంలోకి దిగుతానన్నారు. '50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో, 20 ఏళ్ల టీడీపీ పాలనలో పాలమూరు జిల్లాను కోలుకోలేని దెబ్బకొట్టారు. నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే.. తెలంగాణకు పెనుశాపంగా మారింది. ఉమ్మడి పాలమూరు జిల్లా చాలా నిరాదరణకు గురైంది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక.. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెరమీదకు తెచ్చాం. అన్ని అనుమతులూ సాధించి ప్రక్రియ మొదలుపెట్టేలోపు ప్రభుత్వం మారింది. బాబు కుట్రతో దీని డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపింది. దీనిపై పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం.' అని ప్రకటించారు. ఎంవోయూలకు ఆద్యుడు చంద్రబాబేనన్నారు. తొలుత వైజాగ్‌లో ఇటువంటి సమ్మిట్‌లు పెట్టి.. ఎంవోయూలు చేసుకున్నారని.. అయితే అవి చేసుకున్నవారు వైజాగ్‌లో వంటమనుషులని ఎద్దేవాచేశారు. ఏపీ ఎంవోయూల్లో రూ.10 వేల కోట్లు కూడా రాలేదన్నారు.

దుబాయ్‌లో ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకావిష్కరణ



దుబాయ్‌లో నిర్వహించిన తెలుగువారి ఆత్మీయ సమావేశంలో ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీ జనార్దన్, ప్రవాసాంధ్రులు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, విక్రమ్ పూల రూపొందించిన ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకంతోపాటు దాని ఆడియోను దుబాయ్‌లో నిర్వహించిన తెలుగువారి ఆత్మీయ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీ జనార్ధన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ అపూర్వమైన వ్యక్తిత్వాన్ని స్మరిస్తూ 1984 నాటి కీలక రాజకీయ పరిణామాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల, ప్రవాసాంధ్ర వ్యాపారవేత్తలు పీవీ రమణమూర్తి, నల్లూరి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కెరీర్లు.. కుటుంబాలపై పిడుగు!

- ముదిరిన హెచ్-1బీ వీసా సంక్షోభం
- వేల మంది భారతీయులపై ప్రభావం
- ఇంటర్వ్యూ తేదీల వాయిదాతో తిప్పలు



న్యూఢిల్లీ, డిసెంబరు 21: అమెరికా వీసా సంక్షోభం నానాటికీ ముదురుతోంది. ముందస్తుగా షెడ్యూల్ చేసిన హెచ్-1బీ ఇంటర్వ్యూలను అగ్రరాజ్యం అకస్మాత్తుగా వాయిదా వేయడంతో వేలాది మంది భారతీయ నిపుణుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నెల 15 నుంచి జరగాల్సిన ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది చివరకు, మరికొన్నింటిని ఏకంగా 2027 సంవత్సరానికి బదిలీ చేస్తున్నట్లు దరఖాస్తుదారులకు సమాచారం అందడంతో వారంతా నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్క్ వీసాలను పునరుద్ధరించుకోవడానికి స్లాట్లను బుక్ చేసుకొని అమెరికా నుంచి భారత్‌కు వచ్చినవారు ఇక్కడే చిక్కుకుపోయారు. తమ కుటుంబాలను అమెరికాలో వదిలి వచ్చిన వీరంతా ఇప్పుడు ప్రయాణాలు రద్దు కావడంతో పాటు ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయో తెలియక కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే వీసా అపాయింట్‌మెంట్లు తీసుకున్నవారు గతంలో కేటాయించిన తేదీల్లో కాన్సులేట్లకు రావొద్దని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం సూచించింది. "వీసా అపాయింట్‌మెంట్ రీషెడ్యూల్ అయిందని ఈ-మెయిల్ వస్తే.. తదుపరి తేదీపై సహాయం చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొంది. పాత తేదీల ప్రకారం ఇంటర్వ్యూలకు వచ్చినవారిని కాన్సులేట్‌లోకి అనుమతించబోమని 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఇంటర్వ్యూల నిర్వహణలో జరుగుతున్న జాప్యం చాలామంది కెరీర్లను దెబ్బతీస్తోందని, ఇది ఎన్నో కుటుంబాలను విడదీసిందని ఇమిగ్రేషన్ న్యాయవాదులు పేర్కొంటున్నారు. మరోవైపు,రాయబార కార్యాలయాల్లో వీసా స్టాంపింగ్ అపాయింట్‌మెంట్ కోసం 12నెలల వరకూ జాప్యం చోటు చేసుకుంటున్నందున అంతర్జాతీయ ప్రయాణాలు మానుకోవాలని హెచ్-1బీ, హెచ్-4, ఎఫ్, జే వీసాలపై ఉన్న సిబ్బందికి గూగుల్, యాపిల్ కంపెనీలు సూచించాయి.

దక్షిణాఫ్రికాలో పబ్‌పై కాల్పులు

- 9 మంది మృతి.. 10 మందికి గాయాలు

జోహెన్నెస్‌బర్గ్, డిసెంబరు 21: దక్షిణాఫ్రికాలోని ఓ పబ్‌పై ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని సాయుధుల బృందం జరిపిన కాల్పుల్లో తొమ్మిది మంది మరణించగా, పది మందికి గాయాలయ్యాయి. మృతుల్లో క్యాబ్ సర్వీసు కారు డ్రైవర్ కూడా ఉన్నారు. ఈ ఘటన రాజధాని జోహెన్నెస్‌బర్గ్‌కు పశ్చిమాన 46 కి.మీ దూరంలోని బెక్‌స్ట్రాల్ పట్టణంలోని పబ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. గత 3 వారాల్లో దక్షిణాఫ్రికాలో జరిగిన రెండో ఘటన ఇది. సుమారు 12 మంది సాయుధులు ఒక మినీ బస్సు, ఒక కారులో వచ్చి విచక్షణారహితంగా జరిపి పారిపోయారు. రోడ్లపై వెళుతున్న పాదచారులపైనా సాయుధులు కాల్పులు జరిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం తీవ్ర గాలింపు చేపట్టారు.

బస్తర్‌లో ఆఖరి యుద్ధానికి సిద్ధం!

- ఆపరేషన్లు ముమ్మరం చేసిన భద్రతా బలగాలు
- మావోయిస్టు కీలక నేతలు పాపారావు, దేవాలపై దృష్టి



బీజాపూర్ (ఛత్తీస్‌గఢ్), డిసెంబరు 21: వచ్చే ఏడాది మార్చి 31 నాటికి వామపక్ష తీవ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఓవైపు మావోయిస్టు కీలక నేతల ఎన్‌కౌంటర్లతో పాటు మరోవైపు సరెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. గత నెలలో మావోయిస్టు టాప్ కమాండర్ హిడ్మాను ఎన్‌కౌంటర్ చేసిన భద్రతా బలగాలు.. ఇప్పుడు పాపారావు అలియాస్ మోంగు, బర్సా దేవా అనే మరో ఇద్దరు కీలక నేతలపై దృష్టి సారించాయి. వీరిద్దరూ నిషేధిత సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీలో సభ్యులు కానప్పటికీ.. వారిలోతైన స్థానిక సంబంధాలు, ఛత్తీస్‌గఢ్ దక్షిణ బస్తర్ (ఇక్కడ ఇప్పటికీ సుమారు 150 మంది సాయుధ క్యాడర్ ఉన్నట్లు అంచనా)లోని విశాలమైన ప్రాంతాలపై ఉన్న పట్టు.. వారిద్దరినీ భద్రతా బలగాల మోస్ట్ వాంటెట్ జాబితాలో చేర్చాయి. 48 ఏళ్ల బర్సా దేవా మావోయిస్టు పార్టీ కీలకమైన గెరిల్లా బెటాలియన్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన సుక్మా జిల్లాలోని హిడ్మా స్వగ్రామం పూవర్తికి చెందిన వ్యక్తే కావడం గమనార్హం. 57 ఏళ్ల పాపారావు సుక్మా జిల్లాలోని కిష్టారానికి చెందిన గిరిజనుడు. వీరిద్దరూ మావోయిస్టుల ప్రధాన కేంద్రమైన దక్షిణ బస్తర్‌కు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. బర్సా దేవా నేతృత్వంలోని 'ది పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)' బెటాలియన్ ఒక్కటే ఇంకా క్రియాశీలంగా ఉందని బస్తర్ ఐజీ పీ సుందర్‌రాజ్ వెల్లడించారు. భద్రతా బలగాలు ఇప్పుడు పాపారావు, దేవాలను గుర్తించేందుకు ఆపరేషన్లను ముమ్మరం చేశాయి.

యుద్ధభూమి బస్తర్..!

2025లో డిసెంబరు 9 వరకు బస్తర్‌లో 96 ఎన్‌కౌంటర్ల ఘటనలు జరిగాయి. వీటిల్లో 252మంది మావోయిస్టులు మరణించగా.. 23మంది భద్రతా సిబ్బంది చనిపోయారు. బస్తర్ రీజియన్ ఏళ్లుగా ఎంతటి యుద్ధభూమిగా కొనసాగిందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. భద్రతా బలగాల ఎన్‌కౌంటర్లలో చనిపోయిన వారిలో సీపీఐ(మావోయిస్టు) చీఫ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు మరో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు కూడా ఉన్నారు. కాగా, ఇదే సమయంలో పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో ఈ ఏడాదిలో మావోయిస్టులు 46 మంది పౌరులను చంపేశారు. దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2014లో 126 మావోయిస్టు ప్రభావిత జిల్లాలు ఉండగా.. ఈ ఏడాదికి ఆ సంఖ్య 11కు పడిపోయింది.

లోకం తీరు

బిగుతు దుస్తులు, బిగిసిన జీన్స్‌తో ఆఫీసులకు రావొద్దు: కర్ణాటక ప్రభుత్వం



బాహుబలి లోడింగ్..!

- 24న భారీ వాణిజ్య ప్రయోగానికి ఇస్రో రెడీ

న్యూఢిల్లీ, డిసెంబరు 21: భారత్‌కు చెందిన అత్యంత శక్తిమంతమైన రాకెట్, ఇస్రో 'బాహుబలి' ఎల్వీఎం-3 (లాంచ్ వెహికల్ మార్క్3) తన ఎనిమిదో ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈనెల 24న బాహుబలి రాకెట్ ద్వారా తొలిసారిగా అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించనుంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ సంస్థతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఎల్వీఎం-3 ఎం6 మిషన్ ద్వారా ఈ నెల 24వ తేదీన 6,100 కిలోల బరువున్న బ్లూబర్డ్ బ్లాక్-2 అనే కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని తక్కువ భూ కక్ష్యలోకి పంపనుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం ఈ ప్రయోగానికి వేదిక కానుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే.. ఇస్రో ఇప్పటివరకూ చేపట్టిన అత్యంత లాభదాయకమైన వాణిజ్య ఒప్పందం ఇదే కావొచ్చు.! అలాగే ఇది ఎల్వీఎం3 రాకెట్ ద్వారా ఇస్రో చేపడుతున్న ఎనిమిదో ప్రయోగం కాగా, మూడో వాణిజ్య మిషన్.

ఎల్వీఎం3 రిహార్సల్ విజయవంతం

సూళ్లూరుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట నుంచి ఇస్రో ఈనెల 24న ప్రయోగించతలపెట్టిన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహ రిహార్సల్స్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. బ్లూబర్డ్ బ్లాక్-2 ప్రయోగ సన్నాహాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున వేదికపై ఉన్న రాకెట్‌ను మొబైల్ సర్వీసు టవర్ నుంచి వెనక్కి తీసుకొచ్చి మళ్లీ ముందుకు తీసుకెళ్లే ప్రక్రియ చేపట్టారు. మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్‌ఆర్) సోమవారం నిర్వహించనున్నారు. ఇస్రో చైర్మన్ నారాయణన్ కూడా సోమవారం షార్‌కు చేరుకుని ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. కాగా, వచ్చే ఏడాది షార్ నుంచి చేపట్టే ప్రయోగాలకు సంబంధించిన రాకెట్ పరికరాలు తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి ప్రత్యేక వాహనంలో ఇక్కడకు చేరాయి.

'ఉపాధి'కి మరింత గ్యారంటీ

- జీ రామ్ జీ పథకం ద్వారా పని దినాల పెంపు
- ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పథకం
- వీబీ- జీ రామ్ జీ పథకంపై వివరణ ఇచ్చిన కేంద్రం
- బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం.. చట్టంగా అవతరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 21: దేశంలో కోట్లాది మంది గ్రామీణ పేదలు, కూలీలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) పేరును కేంద్ర ప్రభుత్వం మార్చటంతోపాటు అందులో కొన్ని మార్పులు కూడా చేయటంపై పార్లమెంటులో ఇటీవల ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. ఈ పథకాన్ని మోదీ సర్కారు 'వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)'గా మార్చింది. దీనినే సంక్షిప్తంగా 'వీబీ- జీ రామ్ జీ'గా పిలుస్తున్నారు. ఈ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం ఆమోదముద్ర వేయటంతో చట్టంగా మారింది. కేంద్రం ఈ పథకం అసలు ఉద్దేశాన్ని చంపేసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ఆధునిక గ్రామీణ అవసరాలకు తగినట్లుగా పథకంలో మార్పులు చేశామని మోదీ సర్కారు చెబుతోంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కంటే ఇది ఉత్తమమైనదని వాదిస్తోంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కంటే జీ రామ్ జీ ఎందుకు ఉత్తమమైదో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక నోట్‌ను విడుదల చేసింది. అందులోని వివరాలు ఇవీ....

1.వీబీ- జీ రామ్ జీ బిల్ -2025 అంటే ఏమిటి?

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ చట్టంలో సంస్కరణలు చేస్తూ తీసుకొచ్చిందే వీబీ- జీ రామ్ జీ బిల్-2025. వికసిత్ భారత్-2047 మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఆధునిక కార్యక్షేత్రాన్ని నిర్మించటమే దీని లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయటానికి సిద్ధంగా ఉన్న కూలీలకు ఈ చట్టం సంవత్సరంలో 125 రోజులు ఉపాధికి హామీ ఇస్తుంది.

2. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏతో పోల్చితే వీబీ- జీ రామ్ ఏ విధంగా మెరుగైనది?

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ద్వారా ఒక వ్యక్తికి సంవత్సరంలో 100 రోజులు ఉపాధికి హామీ లభించగా, వీబీ- జీ రామ్ జీ 125 రోజుల ఉపాధికి హామీ ఇచ్చింది. పాత పథకం మాదిరిగా కాకుండా ఈ కొత్త పథకం బలమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. ప్రధానంగా ప్రజలకు నీటి భద్రత, గ్రామీణ ప్రధాన మౌలిక వసతులు, జీవనోపాధి మౌలిక వసతులు, వాతావరణ పరిస్థితులను స్థిరీకరించే (వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్ప్రభావాలను నిరోధించటం) పనులు అనే 4 అంశాలపై దృష్టి పెట్టింది.



3. కొత్త పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఏ విధంగా ప్రయోజనం కలిగిస్తుంది?

ఈ పథకం చెరువులు, కుంటల వంటి నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుంది. మిషన్ అమృత్ సరోవర్ ద్వారా దేశవ్యాప్తంగా 68,000 పైచిలుకు నీటి వనరుల పునరుద్ధరణ ద్వారా వ్యవసాయానికి నీటి వసతితోపాటు భూగర్భ జల మట్టం పెంచేందుకు వీలు కల్పిస్తుంది. పక్కా రోడ్లు, గ్రామాల అనుసంధానం, అత్యవసరమైన సేవల కల్పన ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిస్తుంది. ఉపాధికి హామీ ఇవ్వటం ద్వారా కరువు కారణంగా ఏర్పడే ప్రజల వలసలను నిరోధిస్తుంది. డిజిటల్ హాజరు, కూలీలకు నేరుగా వేతనాల చెల్లింపు, డాటా ఆధారిత ప్రణాళికల ద్వారా జవాబుదారీతనాన్ని పెంచుతుంది.

4. కొత్త పథకం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు ఏమిటి?

పంటలు వేసే, కోసే కాలాల్లో రైతులకు కూలీల కొరత రాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు 60 రోజుల పాటు పనులును నిలిపివేసే అవకాశం ఈ పథకం కల్పిస్తుంది. తద్వారా కూలీ రేట్ల కృత్రిమ పెంపును నిరోధించవచ్చు. ఆహార ధాన్యాల ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించవచ్చు. చెరువులు, కుంటల వంటి నీటి వసతులను పునరుద్ధరించటం, కొత్తవి ఏర్పాటు చేయటం ద్వారా ఒకటికంటే ఎక్కువ పంటలు పండించవచ్చు.

5. కూలీలకు ఈ పథకం ద్వారా లాభమేంటి?

కూలీలకు ఏటా 125 రోజులు ఉపాధికి హామీ ఇవ్వటం ద్వారా వారి ఆదాయాన్ని 25 శాతం పెంచుతుంది. నిర్ణీత సమయంలో కూలీలకు ఉపాధి కల్పించలేకపోతే రాష్ట్రాలు నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుంది.

6. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకాన్ని మార్చాల్సిన అవసరం ఏమిటి?

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకాన్ని 2005 నాటి భారత గ్రామీణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు. ఆ తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. నేడు గ్రామాల్లో బలమైన సామాజిక భద్రతా వ్యవస్థ ఉంది. కనెక్టివిటీ పెరిగింది. డిజిటల్ సేవలు పెరిగాయి. గ్రామాణ జీవనోపాధి అవకాశాలు విస్తృతమయ్యాయి. అందువల్ల ప్రస్తుత గ్రామీణ పరిస్థితులకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకం పనికిరాదు.

7. కొత్త చట్టంలో పారదర్శకత, సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలు ఏమున్నాయి?

మోసాలను గుర్తించేందుకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ. పథకంపై పర్యవేక్షణకు కేంద్ర, రాష్ట్రాల సంయుక్త స్టీరింగ్ కమిటీ. పథకంపై గ్రామ పంచాయతీ పర్యవేక్షణ అధికారాలను విస్తృతం చేయటం. జీపీఎస్, మొబైల్ ఆధారిత పర్యవేక్షణ.

8. రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతుందా?

పథకం అమలులో కేంద్ర, రాష్ట్రాలు వ్యయాన్ని 60:40 శాతం భరించాలి. ఈశాన్య రాష్ట్రాలు, హిమాయల పర్వత ప్రాంత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇది 90:10 నిష్పత్తిలో ఉంటుంది.

జగన్ బొమ్మతోనే ఓపీ పుస్తకాలు!

» తీరు మారని వైద్యశాఖ



వైద్యశాఖ ఉపయోగిస్తున్న ఓపీ పుస్తకాలు

పెనమలూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మారినా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల మాత్రం పాత వాసన పోలేదు. కృష్ణాజిల్లా పెనమలూరు పీహెచ్‌సీలో రోగులకు ఓపీ పుస్తకాలను పాతవే కొనసాగించడంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి జగన్, వైఎస్సార్ ఫొటోలున్న పుస్తకాలనే ఇస్తున్నారు. వైసీపీ నాయకుల ఫొటోలు ఎక్కడా లేకుండా చూడాలని కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరగా పదేపదే చెబుతున్నా వైద్యాధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వైకుంఠద్వార దర్శనాల్లో తొలి మూడు రోజుల్లో..

మూడు ప్రాంతాల నుంచి స్లాటెడ్ భక్తులకు అనుమతి

తిరుమల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే తొలి మూడు రోజులు సంబంధించి మూడు ప్రాంతాల నుంచి భక్తులను అనుమతించేలా టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. భక్తుల మధ్య తోపులాటలు, గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా ప్రశాంతమైన వాతావరణంలో దర్శనం చేయించేలా సిద్ధమవుతోంది. ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనాలు పదిరోజుల పాటు జరుగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 30వ తేదీ ఏకాదశి, 31 ద్వాదశి, జనవరి 1వ తేదీలకు సంబంధించి 1.76 లక్షల మందికి ఈ-డిప్ విధానంలో ముందస్తుగానే స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లను కేటాయించింది. తొలి రోజు ఐదు గంటలు వీఐపీ బ్రేక్ దర్శనాలకు మినహాయించి మిగిలిన సమయం మొత్తాన్ని స్లాటెడ్ దర్శన టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనం చేయించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రోజుకు 14 స్లాట్లలో టోకెన్లు జారీ చేయగా, వీరికి ప్రవేశ మార్గాలను మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఉదయం స్లాట్ల వారిని కృష్ణతేజ సర్కిల్ నుంచి, మధ్యాహ్నం స్లాట్ల వారిని ఏటీజీహెచ్ నుంచి, రాత్రి స్లాట్ల వారిని శిలాతోరణం సర్కిల్ నుంచి దర్శనానికి అనుమతించనున్నారు. ఈ మూడురోజుల పాటు టోకెన్ లేని భక్తులకు ఎలాంటి దర్శనాలు ఉండవని టీటీడీ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇక, జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు ఎలాంటి టోకెన్లు, టికెట్లు లేకపోయినప్పటికీ వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 నుంచి అనుమతించి దర్శనాలు చేయిస్తామని టీటీడీ ప్రకటించింది. వచ్చేనెల 2, 3 తేదీల్లో రద్దీ అధికంగా ఉండే అవకాశముందని భావిస్తున్న అధికారులు దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



తిరుమల ఆలయం ఎదుట జస్టిస్ జయసూర్య, జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

తిరుమల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్ జయసూర్య, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాకేష్ మోహన్ పాండే, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్ధార్థ వర్మ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

తెలుగు సాహిత్యంలో అరసం ప్రస్థానం సజీవనది

» అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ



కర్నూలు కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రస్థానం ఒక సజీవ నదిలాంటిదని సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం కర్నూలు లోని ఎస్టీయూ భవన్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ, అరసం జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో '90 ఏళ్ల తెలుగు అభ్యుదయ సాహిత్యం' అనే అంశంపై సాహిత్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో అభ్యుదయ సాహిత్యం గురజాడ అప్పారావుతో ఆరంభమైందని గుర్తు చేశారు. దేవులపల్లి సారధ్యంలోని భావకవిత్వం కొత్తపుంతలు ఏలిందని, తిరిగి శ్రీశ్రీ 1933లో రాసిన జయభేరి కవిత్వంతో తెలుగునాట తిరిగి అభ్యుదయ సాహిత్యం పుంజుకుందన్నారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడు వల్లూరు శివప్రసాద్, సాహితీవేత్తలు డాక్టర్ ఎం.హరికిషన్, కలం ప్రహ్లాద, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

» ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ (గాంధీనగర్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇస్తున్న చాలీచాలని వేతనాలు, తీవ్ర పని భారం తదితర సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ కోరారు. ప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్జీవోహోంలో ఆదివారం జరిగిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మల్లిక స్పైన్ సెంటర్‌కు మూడు జాతీయ అవార్డులు

» జాతీయస్థాయిలో సత్తా చాటిన డాక్టర్ నరేష్‌బాబు



గువాహటిలో హెచ్‌కేటీ రజా గోల్డ్ మెడల్ అవార్డును అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్ చీఫ్ స్పైన్ సర్జన్ డాక్టర్ జె నరేష్‌బాబు, ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ 70వ వార్షిక జాతీయ సదస్సులో మూడు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు గెలుచుకున్నారు. ఎముకలు, కీళ్ల వైద్య రంగంలో చేసిన విశిష్ట పరిశోధనలకు హెచ్‌కేటీ రజా గోల్డ్ మెడల్-2024, ఎస్‌బీ మండల్ గోల్డ్ మెడల్-2025, ఐవోఏ గోల్డెన్ జూబ్లీ ఓరేషన్ అవార్డు-2025లు కైవసం చేసుకున్నారు. వెన్ను నొప్పితో బాధపడే వారిలో ఎవరికి ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ సరైనదని అనే అంశంపై చేసిన విశిష్ట పరిశోధనకు గాను ఆయనకు హెచ్‌కేటీ రజా గోల్డ్ మెడల్-2024 లభించింది. గువాహటిలోని సరుసజాయ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఐవోఏ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఇన్ఫెక్షన్, రేషనల్ ఆర్థోపెడిక్ విభాగంలో రోబాటిక్ జీవన శైలి కార్యకలాపాలు లంబార్ డిస్క్ ఆరోగ్యం, నడుము నొప్పిపై ఎలా ప్రభావం చూపుతాయో విశ్లేషించిన పరిశోధనకుగాను ఎస్‌బీ మండల్ గోల్డ్ మెడల్-2025 వరించింది. ఈ అవార్డును 2026లో అహ్మదాబాద్‌లో జరిగే వార్షిక సదస్సులో ప్రదానం చేయనున్నారు. సర్వైకల్ స్పాండిలైటిస్, ఉద్యోగం వచ్చే నరాలపై ఒత్తిడి గురించి జరిపిన పరిశోధనకుగాను ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్‌లో అత్యున్నత గౌరవంగా భావించే గోల్డెన్ జూబ్లీ ఓరేషన్ అవార్డు-2025ను గెలుచుకున్నారు.

ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహం

రైతులకు మరిన్ని రాయితీలు

» సాగు పెంపే కూటమి ప్రభుత్వ లక్ష్యం
» అంతర పంటలతో అదనపు ఆదాయం
» వందశాతం రాయితీతో మొక్కలు సరఫరా
» నీటి పారుదల, సస్య రక్షణ చర్యలకూ సాయం
» రైతులు వినియోగించుకోవాలి ఉద్యానశాఖ డైరెక్టర్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



కోవిడ్ తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో పామాయిల్‌కు డిమాండ్ పెరిగింది. దేశంలో జరుగుతున్న ఆయిల్‌పామ్ సాగులో దాదాపు 50 శాతం వరకు మన రాష్ట్రంలోనే జరుగుతోంది. దేశంలో ఐదు లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ పండిస్తుంటే.. రాష్ట్రంలో దాదాపు రెండున్నర లక్షల హెక్టార్లలో సాగులో ఉంది. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించడానికి ఉద్యాన శాఖ ద్వారా కూటమి ప్రభుత్వం రైతులకు మరిన్ని రాయితీలు అందిస్తోంది. ఈ ఏడాది అదనంగా 50 లక్షల హెక్టార్లను ఆయిల్‌పామ్ సాగులోకి తేవాలన్న లక్ష్యంలో 38,661 హెక్టార్ల భూమిని గుర్తించారు. ఇందులో ఇప్పటికే 21,127 మంది రైతులు 20,797 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును విస్తరించారు. రాష్ట్రవాటాతో కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రైతులకు ప్రభుత్వం వంద శాతం రాయితీతో ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేస్తోంది. ఇండోనేషియా, చైనా, మలేషియా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆయిల్ పామ్ మొలకలను ఏడాదిన్నర పాటు నర్సరీల్లో పెంచి ఇస్తున్నారు. హెక్టారుకు దిగుమతి రకం మొలకలకు రూ.29వేలు, స్వదేశీ మొలకలకు రూ.20వేలు ప్రభుత్వం రాయితీ భరిస్తున్నది. ఆయిల్‌పామ్ తోటలకు నీటి పారుదల సౌకర్యాల కోసం బోర్‌వెల్‌కు రూ.25వేలు, మోటారుకు రూ.10వేలు అందిస్తోంది. పంట కోత కార్యకలాపాల సమయంలో విద్యుత్ సమస్యను అధిగమించేందుకు రూ.2,500 రాయితీతో ఇన్సులేటెడ్ పాలిమర్ గ్రిప్ హార్వెస్టింగ్ పోల్స్‌ను, లోతట్టు పొలాల్లో ఎలుకల నుంచి పంటను రక్షించడానికి వైర్ మెష్ కంపోనెంట్‌కు హెక్టారుకు రూ.20వేలు అందిస్తోంది. రాష్ట్రంలోని 24 జిల్లాలు, 373 మండలాల్లో 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. దీని ద్వారా హెక్టారుకు 19.81 టన్నుల తాజా పండ్ల గెలలు ఉత్పత్తి అవుతున్నాయి. ఆయిల్‌పామ్ తోటల్లో 77,516 హెక్టార్లలో పసుపు, అల్లం, మొక్కజొన్న, మిర్చి, వివిధ రకాల కూరగాయలు అంతర పంటలుగా పండిస్తున్నారు. వీటితో పాటు అరటి, కోకో, జాజి, మిరియాలు, అరికెలు తదితరాలు మరో లక్ష హెక్టార్లలో అంతర పంటలుగా పండించే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు. దీనిపై ఇప్పటికే చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలివ్వడంతో ఈ దిశగా రైతుల్ని ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలో 24 కంపెనీలు ఆయిల్ పామ్ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నాయి. గంటకు 721 టన్నుల సామర్థ్యం గల 15 ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 ఆయిల్‌పామ్ నర్సరీలను నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లా పెదవేగిలో ఏపీ ఆయిల్‌ఫెడ్ నిర్వహణలోని ఆయిల్‌పామ్ మిల్లులో 2024-25 (చమురు సంవత్సరం)లో తాజా పండ్ల గెలలు టన్నుకు సగటు ధర రూ.19,540 లభించింది. గత నవంబరులో గరిష్ఠంగా రూ.20,240 పలికింది. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. రాయితీ పథకాలను వినియోగించుకుని, ఆయిల్‌పామ్ తోటల పెంపకంతోపాటు అంతరపంటలను సాగు చేసుకుని, అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. అవకాశం ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

కేంద్రాన్ని శాసించాల్సిన చంద్రబాబు

దేహీ అంటున్నారు!

» రేవంత్‌తో కూర్చుని మాట్లాడితే ప్రాజెక్టుల సమస్య పరిష్కారం
» సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంపీల మీద ఆధారపడిన కేంద్ర ప్రభుత్వాన్ని శాసించాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు...నిధుల కోసం కేంద్రాన్ని దేహీ అంటున్నారని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ ఎద్దేవా చేశారు. నెల్లూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలోని అలిపిరి వద్ద బిచ్చమెత్తుకునే వారు అడుక్కున్నట్టు రాష్ట్రానికి కావాల్సిన నిధుల కోసం ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల వద్ద చంద్రబాబు అడుక్కుంటున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రాన్ని శాసించే అధికారం ఉన్నా దాన్ని వినియోగించుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం పోలవరంతోపాటు పలు ప్రాజెక్టులు వ్యతిరేకిస్తోందని, అక్కడ ముఖ్యమంత్రిగా చంద్రబాబు శిష్యుడు రేవంతిరెడ్డి ఉన్నారని, సానుకూలంగా కూర్చుని మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, అణురంగాన్ని ప్రైవేట్‌పరం చేసేలా పార్లమెంట్‌లో బిల్లు పెడుతోందని విమర్శించారు. అణురంగాన్ని ప్రైవేట్‌పరమైతే చాలా ప్రమాదం చోటుచేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేంద్రం పారిశ్రామిక వేత్తలకు రూ.25 లక్షల కోట్లు కట్టబెట్టిందన్నారు. ఎన్నికల కమిషన్ చేతిలో ఉందని దేశంలో జరిగిన ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. బీజేపీ ఎంపీ కంగనా 2014లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, ప్రధాని మోదీనే దేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చినట్లుగా వారి వ్యవహారశైలి ఉందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ ఈ నెల 22వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్టు తెలిపారు.


రేపటి నుంచి విశాఖలో

పెసా మహోత్సవ్

న్యూఢిల్లీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెసా చట్టం-1996 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 23, 24 తేదీల్లో విశాఖపట్నంలో 'పెసా మహోత్సవ్' నిర్వహించనున్నట్టు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మహోత్సవాన్ని ఏపీ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభిస్తారని తెలిపారు. వేడుకలో పది రాష్ట్రాలకు చెందిన పంచాయతీ ప్రతినిధులు, క్రీడాకారులు, సాంస్కృతిక కళాకారులు, ఇతర రంగాలకు చెందిన దాదాపు రెండు వేలమంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

30మంది సీపీఎం నాయకులను పొట్టన పెట్టుకున్నారు.. ఏం సాధించారు?

» మావోయిస్టులకు బీవీ రాఘవులు సూటి ప్రశ్న



చింతూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం నిరంతరం పోరాడిన 30 మంది సీపీఎం నాయకులను పొట్టనపెట్టుకుని చివరకు సాధించిందేమిటని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మావోయిస్టులను సూటిగా ప్రశ్నించారు. మీ తుపాకులతో సీపీఎం నాయకులను హత్య చేస్తే... పోలీసులు వారి తుపాకులతో మిమ్మల్ని హత్య చేశారని వ్యాఖ్యానించారు. పార్టీకి పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగినా మావోయిస్టులపై జరుగుతున్న కగార్ దాడులను ఖండించింది తాము మాత్రమే అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో ఆదివారం జరిగిన సీపీఎం అమరవీరుల 40వ సంస్మరణ సభకు రాఘవులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మావోయిస్టుల వైఖరిని 50ఏళ్ల క్రితమే సీపీఎం నిరసించిందన్నారు. తుపాకీతో ఏనాటికీ రాజ్యాధికారం రాదని, ప్రజా పోరాటాల ద్వారానే సిద్ధిస్తుందన్న విషయం ఇప్పటికిగానీ మావోయిస్టుల బుర్రకు ఎక్కలేదన్నారు. ఇందుకు నిదర్శనమే నేటి మావోయిస్టుల లొంగుబాట్లు అని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.

అడిగొప్పులలో జంట హత్యలు

» అన్నదమ్ములను తరిమి చంపిన ప్రత్యర్థులు



ప్రత్యర్థుల చేతిలో హతమయిన కొత్త శ్రీరాంమూర్తి

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు ప్రాంతం జంట హత్యలతో మరోసారి ఉలిక్కిపడింది. దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో ఆదివారం రాత్రి సుమారు పదకొండు గంటల సమయంలో అన్నదమ్ములైన కొత్త శ్రీరాంమూర్తి (44), ఆయన సోదరుడు హనుమంతు (35)లను దారుణంగా నరికి చంపారు. ముందుగా అడిగొప్పలలోని ఇంటిలో ఉన్న శ్రీరాంమూర్తిని హతమార్చిన దుండగులు ఆ తరువాత గ్రామ సమీపంలోని శ్రీ నీలంపాటి లక్ష్మీఅమ్మవారి ఆలయం వద్ద ఉన్న ఆయన సోదరుడు హనుమంతును కత్తులతో నరికి చంపారు. హతులు ఇరువురు టీడీపీ కార్యకర్తలు కాగా వారిని ఎవరు చంపారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గ్రామంలో టీడీపీలో చురుకుగా ఉండే వేగంటి నరేష్‌కు వీరిరువురు అనుచరులుగా ఉండేవారని పోలీసులు అనుకుంటున్నారు. అయితే నరేష్ వర్గీయులే ఈ హత్యలకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సుమారు రెండు వారాల క్రితం నరేష్ అత్తపై శ్రీరాంమూర్తి దాడిచేసి తల పగలగొట్టాడు. ఆ సమయంలో నరేష్ శ్రీరాంమూర్తిపై గొడవపడకుండా అత్తను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. తన అత్తపై దాడి చేయడాన్ని జీర్ణించుకోలేక ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. హతుల్లో ఒకరైన హనుమంతు శ్రీ నీలంపాటి లక్ష్మీఅమ్మవారి ఆలయ చైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో అడిగొప్పల పల్నాడు ప్రాంతంలోని అతిపెద్ద ఫ్యాక్షన్ గ్రామంగా ఉండేది.

ఇన్‌స్టా పరిచయం.. ప్రేమ పేరుతో దుర్మార్గం!

» మాయ మాటలతో బాలికకు యువకుడికి వల
» విజయవాడ నుంచి తీసుకెళ్లి సత్తెనపల్లిలో అత్యాచారం
» స్నేహితురాలికి పంపిన మెసేజ్‌తో గుర్తించిన పోలీసులు
» ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరు అరెస్టు




ప్రధాన నిందితుడు రాహుల్

విజయవాడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఒకరినొకరు ఫాలో చేసుకున్నారు. తర్వాత హాయ్.. హాలో అంటూ చాటింగ్ చేసుకున్నారు. ఇదే అదనుగా భావించిన యువకుడు ప్రేమ పేరుతో వల వేశాడు. గుడ్డిగా నమ్మిన బాధితురాలు.. చివరకు అత్యాచారానికి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని వాంబే కాలనీకి చెందిన బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమె కుటుంబం ఇటీవల గుంటూరు జిల్లా మంగళగిరికి వలస పోయింది. కుమార్తె విద్య మధ్యలో ఉండడంతో ఆమెను పెద్దమ్మ ఇంట్లో ఉంచారు. బాలికకు కొన్ని నెలల క్రితం పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన చిలుకూరు రాహుల్ అనే వ్యక్తితో ఇన్‌స్టాలో పరిచయమైంది. రాహుల్ ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితుడు ఆనంద్ కుమార్ సిరిగిడి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు టీఎస్09 ఈటీ 1722 నంబరు గల ఫార్చ్యూనర్ కారును సెల్ఫ్ డ్రైవింగ్ కోసం అద్దెకు తీసుకున్నాడు. సత్తెనపల్లి వచ్చిన తర్వాత కారు నంబరును మార్చేశాడు. టీఎస్09 ఈటీపై ఏకేఎస్ (ఆనంద్‌కుమార్ సిరిగిడి) అని స్టిక్కర్ అతికించాడు. ఈనెల 18న రాహుల్, ఆనంద్‌తోపాటు పాత గుంటూరుకు చెందిన ప్రదీప్, భరత్, బాబీ అనే ముగ్గురు యువకులు కారులో విజయవాడ వెళ్లారు. ప్రదీప్ ఇంజనీరింగ్, భరత్ బీఫార్మసీ చదువుతున్నారు. ఈ ఐదుగురు కలిసి విజయవాడలో వారధి వద్దకు వచ్చారు. కాలేజీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్న బాలికను రాహుల్ వారధి వద్దకు రప్పించాడు. బాధితురాలు తమ ఇంటి వద్ద ఉండే ఇద్దరు స్నేహితురాళ్లతో షాపింగ్‌కు వెళ్దామని చెప్పి బయటకు వచ్చింది. వారు స్కూటర్‌పై బయలుదేరిన తర్వాత తనను వారధి వద్ద వదిలిపెట్టమని చెప్పింది. ఆమెను వారు అక్కడ దింపి వెళ్లిపోయారు. తర్వాత రాహుల్ కారులో ఆమెను ఎక్కించుకుని సత్తెనపల్లి తీసుకెళ్లాడు. అక్కడ లాడ్జిలో రెండు గదులను అద్దెకు తీసుకొని, ఒక దానిలో బాలికను పెట్టి, మరో గదిని స్నేహితులకు ఇచ్చాడు. రాహుల్ గదిలో బాలికపై అత్యాచారం చేయగా.. ఆ గది వద్దకు ఎవరూ రాకుండా స్నేహితులు కాపలా కాశారు. చీకటి పడినా బాలిక తిరిగి రాకపోవడంతో పెద్దమ్మ, పెదనాన్న నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక కోసం గాలింపు చేపట్టారు. ఆమె శనివారం రాత్రి సత్తెనపల్లిలో ఉన్నట్టు స్నేహితురాలికి ఓ సందేశం పంపింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి బాలికను గుర్తించారు. రాహుల్‌తోపాటు ప్రదీప్, భరత్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఆనంద్, బాబీ కోసం గాలిస్తున్నారు.

మాదకద్రవ్యాల నుంచి యువతను రక్షించాలి

» చదువుతోపాటు వృత్తి నైపుణ్య శిక్షణతో అభివృద్ధి
» ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు
» ఒంగోలులో ముగిసిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం నుంచి యువతను రక్షించేందుకు ఏబీవీపీ నడుం బిగించాలని ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. మాదక ద్రవ్యాల వినియోగం పెరగడం వల్ల యువత నిర్వీర్యమవుతోందని, అందరూ 'సే నో టు డ్రగ్స్' నినాదానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఏబీవీపీ పోరాటం చేయాలని సూచించారు. జాతీయ నూతన విద్యా విధానంతో అనేక మార్పులు వచ్చాయని, విద్యార్థులు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని అన్ని రంగాల్లో అవకాశాలను పెంచుకోవాలని హరిబాబు పేర్కొన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. వికసిత్ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని హరిబాబు కోరారు. గతంలో రక్షణ సామగ్రిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొనేవారమని, ఇప్పుడు మన దేశమే సొంతంగా తయారు చేసుకొనే స్థాయికి చేరుకున్నదన్నారు. విదేశీ మాదకద్రవ్యం తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అనేక ప్రతికూల పరిస్థితుల్లో రాష్ట్రంలో ఏబీవీపీని బలోపేతం చేసేందుకు జనమంచి గౌరీశంకర్ చేసిన కృషి ఎనలేనిదని ఆయన కొనియాడారు. ఏబీవీపీ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏటా ప్రదానం చేసే జనమంచి గౌరీశంకర్ యువపురస్కారాన్ని మదనపల్లికి చెందిన వెల్ విషర్స్ ట్రస్టు కార్యనిర్వాహకులు గిరీష్ నల్లగుట్లకు హరిబాబు అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నూజిళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపి, పీవీ శివారెడ్డి, మీడియా ఇన్‌చార్జి రావులపల్లి నాగేంద్రయాదవ్ పాల్గొన్నారు.

13 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్

» గుంటూరు జిల్లా మంగళగిరిలో దారుణం
» నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు.. నిందితుల్లో ఇద్దరు తండ్రీకొడుకులు



నిందితులను రోడ్డుపై నడిపిస్తున్న పోలీసులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): 13 ఏళ్ల బాలికపై నలుగురు పలుమార్లు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ అమానవీయ ఘటనలోని నలుగురు నిందితుల్లో తండ్రీకొడుకులు ఉండడం గమనార్హం. నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ మీడియాకు తెలిపిన వివరాలు... ఈ నెల 18న రాత్రి పది గంటల సమయంలో బాధితురాలు తన స్నేహితులతో కలిసి ఉంది. ఈ సమయంలో అక్కడే మాటు వేసిన ముగ్గురు నిందితులు.. ఆమెకు మాయమాటలు చెప్పి, తమతో పాటు ఆటోలో ఎక్కించుకొని వెళ్లారు. ఆ తర్వాత నిందితులు తాడేపల్లి కేఎల్ రావు కాలనీకి చెందిన షేక్ ఖాదర్ బాషా (50), విజయవాడలోని ప్రకాష్ నగర్‌కు చెందిన షేక్ సలీమ్ (42), షేక్ రబ్బానీ (39) బాలికను మంగళగిరి బైపాస్ వెంబడి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత సలీమ్ బాలికను మంగళగిరి లక్ష్మీనసింహస్వామి కాలనీ చివరకు తీసుకువెళ్లి మరోసారి అత్యాచారం చేశాడు. అనంతరం ఖాదర్ బాషా, అతని కుమారుడు కమల్ సాహెబ్ (25) బాలికను తాడేపల్లి కేఎల్ రావు కాలనీకి తీసుకువెళ్లి మళ్లీ రేప్ చేశారు. తర్వాత రబ్బానీ బాలికను ఆటోలో ఎక్కించుకొని తీసుకువెళుతుండగా.. బాలిక కేకలు వేయడంతో స్థానికులు అడ్డుకుని ఆమెను విడిపించారు. సదరు బాలిక ఇంటికి చేరుకొని, తల్లికి జరిగిన విషయం చెప్పింది. అనంతరం బాధితురాలి తల్లి మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డీఎస్పీ మురళీకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ కే.వీరాస్వామి ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం నలుగురు నిందితులను మంగళగిరి డాన్‌బోస్కో వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించినట్టు చెప్పారు. నిందితులను ఆదివారం సాయంత్రం కోర్టులో హాజరుపర్చారు. వారిని మంగళగిరి పోలీసుస్టేషన్ నుంచి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకువెళ్లారు.

శేషాచల అడవులకు జీవనాడిగా

దివ్య ఔషధ వనం

» 4.25 కోట్లతో ఏర్పాటు చేసేందుకు టీటీడీ ప్రణాళిక

తిరుమల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవులకు జీవనాడిగా దివ్య ఔషధ వనం ఏర్పాటు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. భారతీయ సంప్రదాయ వైద్యానికి ప్రాణం పోసే ఔషధ మొక్కల సంరక్షణ లక్ష్యంగా తిరుమలలో టీటీడీ రూ.4.25 కోట్లతో ఈ వనం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ...అంతరించిపోతున్న ఔషధ మొక్కలకు నిలయంగా ఉన్న శేషాచల అడవులకు జీవనాడిగా ఈ వనాన్ని ఏర్పాటు చేసేందుకు ఇటీవల ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. ఔషధ మొక్కలను సంరక్షిస్తూ, ప్రజలకు పరిచయం చేయడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. ఈ ఔషధ వనం భక్తులు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందులో 13 రకాల ప్రత్యేక థీమ్ ఆధారిత విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. దేహ చికిత్స వనం, సుగంధ వనం, పవిత్ర వనం, ప్రసాద వనం, పూజా ద్రవ్య వనం, జీవరాశి వనం, కల్పవృక్ష ధామం, ఔషధ కుండ్, మూలికా వనం, ఋతు వనం, విశిష్ట వృక్ష వనం వంటి విభాగాలు ఉండనున్నాయి. ఇవి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడమే కాకుండా, ఔషధ విజ్ఞానం, ప్రకృతిపై అవగాహన పెంచనున్నాయి.

3.90 ఎకరాల్లో ఏర్పాటు

తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్‌కు దిగువ, ఎగువ ఘాట్‌రోడ్లకు మధ్యలో ఉన్న 3.90 ఎకరాలలో దివ్య ఔషధ వనం అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జనవరిలో పనులు ప్రారంభించనున్నారు. 2026 చివరి నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

వ్యాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించాలి

» అఖిల భారత స్టేట్ పెన్షనర్ల సమాఖ్య డిమాండ్

విజయవాడ(గాంధీనగర్), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆమోదించిన 'వ్యాలిడేషన్' చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత స్టేట్ పెన్షనర్ల సమాఖ్య చైర్మన్ పీకే వర్మ, ప్రధానకార్యదర్శి డి.సుధాకర్ డిమాండ్ చేశారు. సమాఖ్య కోర్ కమిటీ సమావేశాన్ని ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలిడేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం దొంగ చాటుగా ఆమోదించుకుందని విమర్శించారు. దీనివల్ల 2026 జనవరి తర్వాత పదవీ విరమణ చేయబోతున్నవారు వేతన సవరణ కమిషన్ సిఫారసుల ప్రయోజనాన్ని పొందే అవకాశం లేదన్నారు. ఈ చట్టాన్ని ఉపసంహరించకపోతే దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ చట్టం దుష్పరిణామాలను ఉద్యోగులు, పెన్షనర్లకు వివరించేందుకు త్వరలో 'జన జాగరణ' ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభిస్తామన్నారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో త్వరలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటువంటి చీకటి ఉత్తర్వుల ద్వారా భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. దీన్ని తిప్పి కొట్టేందుకు కేంద్ర, రాష్ట్రస్థాయిలో ఐక్య ఉద్యమాలు చేసేందుకు అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

కరుణై కరిగే పంక్తులు

మోహన్ రుషి కవితల్లో కవిత్వం బ్లెండెడ్ ఫిల్టర్ కాఫీలో చికోరిలా మహా ఎక్కువంటే ఇరవై శాతానికి మించదు. మిగతాదంతా మానవత్వమే. కాదంటే మనిషితత్వమే. ఆర్కే లక్ష్మణ్ 'కామన్‌మ్యాన్' కార్టూన్ సిరీస్‌లో ఒక కార్టూన్‌లో– 'పాలిస్టర్ ఎనభై శాతం, కాటన్ ఇరవై శాతం' అని రాసి ఉన్న ఒక షర్ట్ హోర్డింగ్ యాడ్ ముందు గోచీ పెట్టుకున్న కామన్‌మ్యాన్ నిల్చుని దానివైపు చూస్తుంటాడు. చూసీ చూసీ తనలో తాను– 'పది శాతం కాటన్, తొంభై శాతం షై సెల్ఫ్' అనుకుని నవ్వుకుంటాడు. మోహన్ రుషి 'జీరో డిగ్రీ' కవిత్వ సంపుటిలోని కవిత్వమూ అంతే. కవిత్వమంతా కరుణా, దయలే.



కవిత్వంలోని అమ్మదనంతో మన హృదయాల్ని ద్రవింపచేస్తాడు మోహన్ రుషి. ఈ పుస్తకాన్ని తన మాతృమూర్తికి అంకితమిస్తూ: "లోకం మెచ్చని నా బతుకుని లోకంగా చేసుకున్న అమ్మ రాజమల్లమ్మకు," అనేసి ఆమెను మానవజాతికే ప్రతినిధిగా నిలిపేసాడు. పుస్తకంలో మొదటి కవిత 'పాతయంత్రం'లో అమ్మల కడగండ్లకు కళ్ళు చెమర్చి, "అమ్మ ముఖం మీది ముడుతలు తనుపడ్డ కష్టాలకు ప్రతీకలు/ పాదాల పగుళ్లు రొటీన్ బతుకు మీది రోతకు ఆనవాళ్లు/ ఆ బట్టలన్నీ మా వీపులకేసి ఉతికినా మాకా శిక్ష చాలదు," అంటూ తన అపరాధ భావనను వెల్లడిస్తాడు. 'లెక్కలేదు పత్రంలేదు' అనే మరో కవితలో– "గోస ముందు బుట్టిందో, అమ్మ ముందు బుట్టిందో/ ఏ సెన్సెస్‌లల్ల పత్తాలేదు" అని అమ్మల గోస నివేదిస్తాడు. 'లేనివాళ్ల కోసం ఉండేవాళ్ళు' అనే కవితలో మనల్ని కనిపెంచిన అమ్మల పట్ల మన అలక్ష్యం, take it for granted attitudeలను గుర్తు చేస్తాడు: "నువ్వే ప్రపంచంగా, నీ కడుపులో ఇంత సల్ల నింపడమే లక్ష్యంగా/ అవిశ్రాంతంగా. అమ్మగా"... "అమ్మలుకాక మరెవరైనా నీకోసం నిద్రలో ఉలిక్కి పడి లేస్తారా?" అని మనల్ని నిలేసి, "రాత్రంతా కురుస్తున్న వాన. జీవితమంతా తడుస్తున్న అమ్మ./ ఇవి రెండు మాత్రమే నిజాలు" అని ముగిస్తాడు కవి. అమ్మల్ని వృద్ధాశ్రమాల్లో వదిలేసే పుత్రరత్నాలతో ఈ కవితను, 'అమ్మల కన్నీళ్లు అబద్ధం కాదు' అనే కవితను రెండో ఎక్కంలా పైనుంచి కిందకు, కిందనుంచి పైకి రోజుకు పదిసార్లయినా చదివిస్తే గుణం మారుతుందేమోనని చిన్న ఆశ.

మోహన్ రుషి ఎప్పుడో ఊరు విడిచి హైదరాబాద్ వచ్చేసినప్పటికీ, రాణివాసం కోసం పట్నవాసంపోయిన మల్లీశ్వరి తన బావనూ ఊరునూ మరవనట్లే, అతని మనసు మిర్యాలగూడ జ్ఞాపకాల ముసురును వీడలేదు. అందుకే ఎప్పుడు ఊరెళ్ళివచ్చినా– "ఎందుకో తెల్వదు/ వూరికెల్లి పట్నమొచ్చిన కానించి/ దేనిమీద నెనరు లేకుండయ్యింది" అని నాస్టాల్జియా 'శెర' కవితలో బందీ అవుతాడు.

'ఎందుకో తెలీదు' కవితలో ఆధునిక కృత్రిమ జీవనాన్ని ప్రదర్శించలేక, హిపోక్రసీని నటించలేక తన అంతర్మథనాన్ని– "ప్రేమ లేదని కాదు కానీ,/ తేపకోసారి తేమను నిరూపించడం నావల్ల కాదు" అని చేతులెత్తేస్తాడు. 'గో... మై ఫ్రెండ్..!' అనే కవితలో– "సెల్‌ఫోన్లో ఉన్న నెంబర్లన్నీ మనవి కానట్టే.../ ఫీడైన నెంబర్లు చాలానే ఉంటాయి కానీ/ ఫీలయ్యే మనుషులు లేకపోవడమే అసలు విషాదం" అనే వాక్యాలు చదవగానే నా మిత్రుడొకరు "కోటి జనాభా దాటిన ఈ మహానగరంలో అర్ధరాత్రైనా అపరాత్రైనా ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఫోన్ చేసుకోగల ఇద్దరు మిత్రులైనా ఉన్నారా?" అని తరచుగా అనే మాట గుర్తొచ్చి, మనందరం ఒంటరి సమూహాలమేనా అన్న ప్రశ్న వేధించింది. "రంగు, రుచి, వాసన లేని స్నేహం/ ఇరవయ్యొకటవ శతాబ్దపు జీవితసత్యం" అంటూ ఈ కవిత ముగుస్తుంది.

'బతికిన మనుషులు!' అనే కవితలో దంపతుల మధ్య వైవిధ్యాన్ని 'మిస్సమ్మ' సినిమాలో "మనము మనదను మాటే... అననీయదు తాననదోయ్" పాటలో చెప్పిన తీరుగా– "ఒకరినొకరు బాగా అర్థం చేసుకొని/ అప్పట్నుంచీ వాళ్ళు/ కలిసిమెలిసి జీవించలేదు" అని వారి అనైక్యతా రాగాన్ని ముక్తాయిస్తాడు. ఈ కవిత చదువుతుంటే ఆచార్య రజనీష్ "Wife and husband are intimate enemies" అన్నది కాలజ్ఞానం తోనే అని నమ్మవలసిందే.



మోహన్ రుషి 'జీరో డిగ్రీ' కవితలన్నీ మసిబారిన మన హృదయ లాంతరు చిమ్నీని ముగ్గేసి తోమేసి మసకను, మాయను తుడిచేసి, మన చర్మ చక్షువుల్ని పదునెక్కిస్తాయి.

'మేడ్ ఇన్ మిర్యాలగూడ' కవితలో కపట ప్రేమల్ని మిర్యాలు నూరినట్లు నూరి పారేస్తాడు. ఇది చదివి incarnations of hypocrisy వంటి జీవులు కొందరైనా దాన్ని వొదిలించుకుని re-incarnate అయితే బాగుండు– "జేబుల్నిండా రాళ్లు నింపుకుని/ పూల గురించి మాట్లాడలేను" అని నగర జీవన రంగస్థలం మీదకు కసిగా రాళ్లు విసిరి, "నిజం చెప్తున్నా.../ రెండుగా ఉండలేకే ఇప్పటికీ ఇలా రేయిలో మిగిలిపోయాను" అని తన అశక్తతను, సహజత్వాన్ని చాటుతాడు.

'వాళ్ళు బంగారం, మనం ఇనుము' కవితలో స్త్రీ పక్షపాతిగా అక్కాచెల్లెళ్ల ఆప్యాయతకు, అనురాగానికి పూర్తిగా ఫిదా ఐపోయి– "బతుకు మీద భరోసా నిచ్చే శరణార్థి శిబిరాలయ్యేందుకూ.../ అమ్మల తర్వాత అమ్మలై/ మనల్ని పిల్లల్లా కాచుకోవడానికే అవతరిస్తారనుకుంటాను" అని కవి వారికి మొక్కేస్తాడు.

AI యుగంలో మనుషుల్ని ఆవహించి గడ్డకట్టించేసిన కృత్రిమ హృదయాల్ని కాస్తయినా వెచ్చబెట్టి కరిగించాలన్న కవి తపన టైటిల్ కవిత 'జీరో డిగ్రీ'లో కన బడుతుంది. కొంత ఆశావాదంతో– "మనుషుల్లో ఒరిజినాలిటీ కోసం వెదికాడు". అది ఎక్కడా తగలకపోవడంతో– "ఉహూ... లాభం లేదు. అనుకరణ/ ఆకాశం నుండి అవని దాకా కమ్మేసింది" అంటూ గొణుక్కున్నాడు. "లేనివి ఉన్నవిగా చూపెట్టే కొద్దీ ఉన్నాయనుకుంటున్నవి/ లేనివిగా తెల్సిపోతుంది" అని బయటకే అన్నాడు.

ఈ సంకలనం మొత్తంలో బాగా నచ్చిన కవిత 'విజేతలు వాళ్ళు!'. ఆకుకూరలు అమ్ముకునే అల్పజీవి సంస్కారం ముందు ఓడిపోయిన వ్యక్తి true confession ఈ కవితాంశం:

అల్కాపురి వీధుల్లో ఆకుకూరల్తో ఆప్యాయంగా నవ్వుతూ
ఆమె అడిగింది ఒక్కటే: "గంప కిందికి దించాలి సారూ."

బేరం సారం మొత్తం... తన గెలుపు, నా ఓటమి. అడిగిన ఒక
అదనపు కట్టనూ హాయిగా చేతుల్లో పెడ్తూ.

లెక్కల్లో తప్పిపోయిన నాకు గుర్తుచేసి మరీ చిల్లరంతా ఇస్తూ
నోరారా కోరింది ఒక్కటే: "గంప మల్ల నెత్తి మీద పెట్టాలి సారూ".

బరువు నిభాయించుకుంటూ, నాదొక కష్టంగా తలపోస్తూ, తను అన్న మాట
కొండలా మోస్తున్నా: "ఏమనుకోవద్దు సారు. పెద్దవారు".

◆ ◆ ◆

అడుగడుగునా ఫిర్యాదులతో అలమటించే జీవితం తల్లీ!...
ఒక మూలన ఒదిగి కూర్చున్న కరివేపాకు విలువ చెయ్యదు–

– అని unconditional apology చెప్పేసి, పశ్చాత్తాప హృదయంతో వాళ్ళను విజేతలుగా ప్రకటించడం కవి సున్నితత్వ ఔన్నత్యమే.

'జీరో డిగ్రీ' కవితలన్నీ సమీక్షిస్తే నోట్ కంటే ఫుట్‌నోట్ పెద్దదైనట్లు అవుతుంది. కొన్ని మోహన్ రుషి మార్క్ వాక్యాలతో ముగిస్తాను:

"గునపానికీ గుండె ఉంటుందని చూద్దం అత్యాశ"
"షేరింగ్ ఆటో గుండా ప్రయాణిస్తాం. మరో రోజులోకి."
"ముత్యమై మెరిసేదే జ్ఞాపకం"
"రాత్రులన్నీ దిగులుటకే"
"ముసుగులే ఎక్కువ లోసుగుల్ని చూపిస్తాయి"
"మొద్దుబారిన చర్మాలదే మోనోపలి"

చివరగా ఒక్కమాట– మోహన్ రుషి 'జీరో డిగ్రీ' కవితలన్నీ మసిబారిన మన హృదయ లాంతరు చిమ్నీని ముగ్గేసి తోమేసి మసకను, మాయను తుడిచేసి, మన చర్మ చక్షువుల్ని పదునెక్కిస్తాయి. మరింత మొద్దుబారి గడ్డకట్టకముందే 'జీరో డిగ్రీ' చదివితే మేలు·

■ వంగల హర్షవర్ధన్
✆ 99499 92880

సోమవారం 22 డిసెంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

ప్రథమ నవలా పురస్కారం

అంపశయ్య నవీన్ 85వ జన్మదినోత్సవ సందర్భంగా సాహిత్య కార్యక్రమం డిసెంబరు 24 ఉ.10.30గంటల నుంచి నవీన్ రెసిడెన్సీ, లక్ష్మిగణపతి రోడ్, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండలో జరుగుతుంది. ప్రథమ నవలా పురస్కారం – 2025 సంవత్సరానికి మొదటి బహుమతిని 'అమ్మ డైరి' నవలకు గాను వసంతశ్రీ, రెండవ బహుమతిని 'పడిలేచిన కెరటం' నవలకు గాను జి.వి. శ్రీనివాస్ స్వీకరిస్తారు. సభలో అంపశయ్య నవీన్‌తో పాటు, దర్భశయనం శ్రీనివాసాచార్య, బన్న అయిలయ్య, డి. స్వప్న తదితరులు పాల్గొంటారు. నవీన్ 'భిన్న ధ్రువాలు', 'బుచ్చిబాబు జీవితం –సాహిత్యం' ఆవిష్కరణ జరుగుతుంది.

డి. సతీష్

శివరాజు సుబ్బలక్ష్మి శత జయంతి సదస్సు

శివరాజు సుబ్బలక్ష్మి సాహిత్య జీవితంపై ఒక రోజు జాతీయ సదస్సు డిసెంబర్ 27 ఉ.10గంటల నుంచి రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ హైదరాబాద్‌లో జరుగుతుంది. కీలకోపన్యాసం కాత్యాయనీ విద్మహే. ఇతర వక్తలు సింగరాజు రమాదేవి, మురాడి శ్యామల, పి.జ్యోతి, వారణాసి నాగలక్ష్మి. సభలో ఏనుగు నరసింహారెడ్డి, శీలా సుభద్రాదేవి, సి. భవానీదేవి, ద్రోణంరాజు బుచ్చి వెంకట సుబ్బారావు, ఎస్. రఘు పాల్గొంటారు

సి. మృణాళిని

'రెండు ఒకట్లు' కవితా సంపుటి

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వి. పి. చందన్ రావు, కందాళై రాఘవాచార్య జంట కవులిద్దరూ రాసిన 'రెండు ఒకట్లు' కవితా సంపుటి ఆవిష్కరణ డిసెంబర్ 28 మధ్యాహ్నం 1.30 గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, నాళేశ్వరం శంకరం, అయినంపూడి శ్రీలక్ష్మి, బైస దేవదాస్, రూప్ కుమార్ డబ్బీకార్, గుడిపాటి తదితరులు పాల్గొంటారు.

కందుకూరి శ్రీరాములు

గింజల నరసింహారెడ్డిపై సదస్సు

తెలంగాణ సాహిత్య అకాడమి – ఉనికి సామాజిక, సాంస్కృతిక వేదిక, నల్లగొండ ఆధ్వర్యంలో గింజల నరసింహారెడ్డి సాహిత్యంపై ఒక రోజు సదస్సు డిసెంబరు 28 ఉదయం 9.45 ని.లకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బస్టాండ్ దగ్గర, నకిరేకల్‌లో జరుగుతుంది. నాలుగు సెషన్ల ఈ కార్యక్రమంలో బెల్లి యాదయ్య, వేముల వీరేశం, వేముల శ్రీనివాసులు, బాలాచారి నామోజు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మునాసు వెంకట్, అంబటి వెంకన్న, ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొంటారు.

బండారు శంకర్

కథా సాహితి విజ్ఞప్తి


గత 35 ఏళ్ళుగా కథా సాహితి వార్షిక కథా సంకలనాలను ప్రచురిస్తున్నది. ఇటీవల రచయితలు తమ కథలను నేరుగా కథా సంపుటాల్లోనో, సంకలనాల్లోనో ప్రచురిస్తున్నారు. అలా మొదటిసారి అచ్చయిన కథలు మా దృష్టి నుంచి తప్పిపోకుండా, ఆ రచయితలు గానీ, ప్రచురణకర్తలు గానీ కథా సాహితి దృష్టికి తేవటం, వీలైతే ఒక కాపీ పంపటం చేయాలని కోరుతున్నాం. ఫోన్: 98493 10560. అలాగే ఇకమీదట ఫేస్‌బుక్‌లో, బ్లాగుల్లో నేరుగా పోస్ట్ చేసిన కథలను కథాసాహితి సంకలనాల కోసం పరిశీలించటం సాధ్యం కాదు.

వాసిరెడ్డి నవీన్

జ్ఞానాంశాలు రాయమని వెంబడిస్తాయి

– అప్పాజోస్యుల సత్యనారాయణ

బహుముఖ ప్రజ్ఞా దురంధరుడు అనే విశేషణం అప్పాజోస్యుల సత్యనారాయణ పట్ల అక్షర సత్యం. ఆయన ప్రశస్తిగన్న కంప్యూటర్ శాస్త్రవేత్త. అమెరికాలో కాలిఫోర్నియా, విస్కాన్‌సిన్ విశ్వవిద్యాలయాల్లో, ముఖ్యంగా న్యూజెర్సీలోని స్టీవెన్స్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో ఉన్నతోద్యోగాలు నిర్వహించారు. తన రథ సారథ్యంలో నడిచే 'అజో విభో– కందాళం' సాహిత్య సంస్థ ద్వారా లక్షల వ్యయంతో భరత నాట్య శాస్త్రం, కళాపూర్ణోదయం, ఆంధ్ర పురాణం వంటి బృహద్గ్రంథాలను వ్యాఖ్యానాలతో పునర్ముద్రించారు. ప్రఖ్యాత రచయితల వివిధ గ్రంథాలను ప్రచురించారు. తెలుగు సాహిత్య కళా రంగాల్లో కృషి చేసిన వారికి సత్కారాలు చేస్తున్నారు.



'ఛందస్సుందరమైన పద్య కవితా సారస్వతం' వైపు ఆయనకు మొగ్గు మాత్రమే కాదు, అందులో కావ్య సృజనలు కూడా చేశారు. ఇటీవల తారావళి అనే అరుదైన పద్యప్రక్రియలో 'పంచవటి' అనే కావ్యం రాసారు. 'తారావళి' తెలుగువారికి అవధానం, ఉదాహరణం లాగ స్వంత ప్రక్రియ. 'పంచవటి' కావ్యంలో అంతరిక్ష ఇతివృత్తంతో తారావళి చదువుతూ నిమగ్నమైతే వింతల వింతల పాలపుంతల సమీప ప్రయాణాలు చేస్తున్నట్టు అనుభూతి చెందుతాం. ఈ పుస్తకం వచ్చిన సందర్భంగా ఆయనతో ముఖాముఖి:

మీరు పంచభూతాల్ని వస్తువులుగా స్వీకరించి తారావళి కావ్యాలు రాయడానికి నేపథ్య ప్రేరణలు ఏమిటి?

వర్తమాన సంఘటనలు (కరెంట్ ఈవెంట్స్) తాత్కాలికమైనవి. వీటికి ప్రాచీనత, ఆధునికత అనేవి వుంటాయి. సార్వజనీనమైన వస్తువులు నిత్యనవీనమైనవి. సృష్టి ప్రారంభానికి కారణభూతమైన అగ్నియే నేడు మనకు లభ్యమవుతున్నది. పంచభూతములు సార్వజనీనములు. సర్వకాలికమైన వస్తువులు. ఆ మహాతత్త్వాలను స్మరించుకునే ప్రయత్నం, ఆలోచనలే నేపథ్య ప్రేరణలు.


తెలుగులో మార్గ కవిత్వం అనువాద వస్తు స్వీకరణతో గాక, స్వతంత్ర వస్తు స్వీకరణతో ప్రారంభమై వుంటే అనంతర కాల సాహిత్య పరిస్థితులెలా ఉండేవంటారు?

స్వతంత్ర వస్తు స్వీకరణతో మార్గ కవిత్వం ప్రారంభమై వుంటే వరుసగా స్వతంత్ర వస్తు కావ్యాలు వచ్చి వుండేవని ఘంటాపథంగా చెప్పలేం. అలాగయితే కళాపూర్ణోదయం వచ్చిన తర్వాతైనా స్వతంత్ర వస్తువులతో కావ్యాలు వచ్చి వుండేవిగా. కాలమాన పరిస్థితులను బట్టి కావ్య సృజనలు జరుగుతూంటాయి.

మీ కవిత్వంలో కనపడే అంతరిక్షస్పృహ గురించి చెప్పండి?

"తనరన్నల్బది వేల కోట్ల దిననాథ ప్రజ్ఞమౌ పాలపుం
తనభో మండల వీధులందొకటియే – తా దృక్ష నక్షత్ర పుం
జనికుంజంబుల వేల కోట్లకును పెచ్చై యంతరిక్షంబు నం
దనువై యుంటయు భూనివాసులకు నిత్యాశ్చర్యమైపొల్చెడున్"

– నలభై వేల కోట్ల సూర్యులతో (నక్షత్రాలతో కూడినది ఒకే ఒక్క పాలపుంతగా అంతరిక్షంలో కనబడుతుంది. అటువంటి నక్షత్ర సమూహాలతో కూడిన పొదరిళ్ళు ఆకాశంలో వేలకోట్లకు ఎక్కువే వుంటాయి. ఈ స్థితి భూ నివాసులకు నిత్యాశ్చర్యంగా ఉంటుంది. ఈ స్పృహ అంతరిక్ష స్పృహగా దృశ్యమానంగా చెప్పడం నా ప్రయత్నం. జ్ఞానాంశాలు నన్ను విభ్రాంతుణ్ణి చేసి రాయమని వెంబడిస్తాయి. రస దృష్టితో కవిత్వాను భూతితో రాయాలనేది నా ప్రయత్నం.



నా పావక వృత్త తారావళిలో ఒక పద్య భావాన్ని గమనించండి:

"పొగను జెండాగాగల ఓ మహాగ్నీ! నీ గొప్పదైన తత్త్వాన్ని వర్ణించాలని ఊహామాత్రం చేస్తాను. నీ అద్భుత విశ్వరూపాన్ని పర్యాలోకన చేయాలని ప్రయత్నమైతే చేస్తాను. అయితే నీ సంబంధ ఊహల సమూహాలు ఎన్నెన్నో నా హృదయ సముద్రంలో వడగళ్ళ వానలా కన్పించి కురిసి అవన్నీ లీనమైపోతాయి. నిన్ను సంభావించడంలో నేను అశక్తుణ్ణే అయిపోతున్నాను."

విశిష్ట భావం, పటిష్ట నిర్మాణం రెండూ అఖండంగా ఉండేలా రాయాలని నా ప్రయత్నం.

మీ దృష్టిలో కావ్య రసానుభవం అంటే ఏమిటి?

ఆహారాది సౌఖ్యానుభూతులు ఉన్నాయి గదా! అందులో అందరికీ లభ్యం కాని అనుభూతుల్లో కావ్య రసానుభూతి ఒకటి. ఇతర అనుభూతుల వలెనే కావ్య రసానుభవం అనుభవైకవేద్యం.

పోతన, విశ్వనాథ, జాషువా కవుల కవిత్వాలపై మీ అభిభాషణలు, అంచనాలు చెబుతారా?

ఆ మహాకవులను జడ్జ్ చేయడానికి నేనెంతటివాడిని. అయినా అడిగారు కనుక చెప్పడం. మీరు పేర్కొన్న ముగ్గురు కవులూ రససిద్ధిని పొందిన కవి ప్రభువులు. విశ్వనాథ వారన్నట్లు– 'పోతన్న తెలుగుల పుణ్యపేటి'. విశ్వనాథ వారి భావయిత్రీ శక్తి అద్భుతావహమై దిగ్భ్రమ కలిగిస్తుంది. మన మనస్సుకు తెలిసిన విషయాల్ని అబ్బుర పరిచే రీతిలో చెప్పగలిగిన అభివ్యక్తీకరణ శక్తి కవి కోకిల జాషువాది.

భవిష్యకాలంలో ఏదైనా బృహత్తరమైన మహాకావ్యం రాయాలనే ప్రణాళిక ఏదైనా ఉన్నదా?

అంతటి కావ్యవస్తువులు లభించాలి. దొరికినా నిర్వహించ గలిగిన శక్తి ఉండాలి కదా! నందో రాజా భవిష్యతి!

ఇంటర్వ్యూ ■ సన్నిధానం నరసింహశర్మ
92920 55531

ఈ పుస్తకంతో నా ఐఏఎస్ హోదా వెనక్కు వెళ్ళిపోయింది

నా మొదటి పుస్తకం

విద్యాసాగర్ అంగలకుర్తి

తొలి పుస్తకం ప్రచురణ కోసం చాలా మంది సహ కవులు, రచయితలు పడే తప్పనిసరి కష్టాలు నేను పడలేదు. ఐనా నా మొదటి పుస్తకం 'భద్రాచలం మన్నెం కతలు' అన్ని దశల్లోనూ ప్రత్యేక అనుభవాన్ని మిగిల్చింది. పాలనా వ్యవస్థలో అంతర్భాగంగా ఒక ఐఏఎస్ అధికారిగా ఉన్న నేను– వ్యవస్థ వల్ల ఆదివాసీ గిరిజనులు పడుతున్న కష్టనష్టాలను రాసి పుస్తకంగా తీసుకురావడం అందరిలోనూ ఆశ్చర్యాన్నీ ఆసక్తినీ కలిగించింది.



ఈ పుస్తకం రాయడానికి అత్యంత పరోక్షంగా కారణభూతుడైనవాడు మీడియాలో ఉన్న నా మిత్రుడు. ఆయన తన ఉద్యోగ నిర్వహణలో భాగంగా మీడియా టూర్‌కు నేను పని చేస్తున్న సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, పాల్వంచకు వచ్చారు. అక్కడ చూసిన దాన్ని తన పత్రికలో ప్రచురించారు. అందులో తనకు నాపైన ఉన్న అభిమానాన్ని వ్యక్తీకరించిన తీరు నా ఉద్యోగంలో నాకు కొన్ని కష్టాలను తెచ్చిపెట్టింది. నేను అర్ధాంతరంగా బదిలీ అయ్యాను. బదిలీ బాధాకరం కాదు, అయిన విధానం చాలా బాధాకరం. అది ఓ సింహావలోకనానికి దారి తీసింది. ఒక ఐఏఎస్ అధికారికి పాలనా వ్యవస్థలో పరిమితుల కారణంగా ఎదురయ్యే సమస్యలేమిటి, ఆ సమస్యల పరిష్కారానికి ఆదివాసీ గిరిజనులే సూచించిన మార్గాలేమిటి, వాళ్ళ నుంచి తాను నేర్చుకున్నదేమిటో కృతజ్ఞతాపూర్వకంగా వారి సహజ వివేకం పట్ల ఆశ్చర్యంతో కూడిన అభిమానాన్ని నెమరు వేసుకునేలా చేసింది. అప్పటి 'ఆంధ్రప్రభ' సంపాదకులు కీశే పొత్తూరి వెంకటేశ్వరరావు గారితో నాకు వ్యక్తిగత పరిచయం ఉండేది. నా బదిలీ ఆయనకు బాధ కలిగించింది. "మీ అనుభవాలను మీరెందుకు రాయకూడదూ" అని నన్నడిగారు. సరే అన్నాను. రాసిన దాన్ని వారు ఆంధ్రప్రభలో ధారా వాహికంగా ప్రచురించారు.

ఈ ధారావాహికను అప్పటి 'ఆంధ్ర ప్రదేశ్' పత్రిక సంపాదకులు కీశే పీవీ రావుగారు శ్రద్ధతో చదివినట్టున్నారు. "సమస్యలు మోసుకొచ్చే సన్న జీవుల పట్ల మీరు ఇంత శ్రద్ధ పెట్టడం నను కదిలించింది. మీకు అభ్యంతరం లేకపోతే ఈ రచనను నేను ప్రచురిస్తాను" అని దాని కోసం 'గౌతమీ ప్రచురణలు' స్థాపించారు. పుస్తక ప్రచురణ అంతా ఆయనే చూసుకున్నారు. నేను చేసిందల్లా ఎక్కడెక్కడో ఎప్పుడెప్పుడో తీసిన ఫోటోలను ఆయనకు అందించడమే! అటువంటి ఫోటోల్లో ఒకటి కోయ తెగకు చెందిన సున్నం సిరిమప్పది. ఆయన నాకు మన పరిపాలన వల్ల సాధారణ ప్రజలకు కలిగే కష్ట నష్టాల అనుభవాన్ని కళ్ళకు కట్టినట్టు చెప్పాడు. ఒక్క చిత్రం వెయ్యి మాటలకు సమానం అంటారే, అలా నా పుస్తక సారమంతా ఆ ఒక్క చిత్రంలో ఉందనిపించి దాన్నే ముఖచిత్రంగా వేద్దామని పీవీ రావు గారన్నారు. నేను సరే అన్నాను. పుస్తకానికి ముందుమాటను పొత్తూరి వారు ఆదివాసీ గిరిజనుల పట్ల తనకున్న సహానుభూతికి సాక్ష్యంగా మలిచారు. నా చిరకాల మిత్రుడు, ఉద్యోగం లోనూ నా సహచరుడిగా ఉండి, గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారితో సహా హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఐఏఎస్ అధికారి కీశే పి. సుబ్రమణ్యం 'నామాట' పేరున పుస్తకంలో విషయాన్ని పరిచయం చేశారు.



తొలి ప్రతి చూడగానే నాకు ఆనందం కంటే ఎక్కువగా ఏడుపు వచ్చింది. నా తొలి ఉద్యోగ అనుభవాలు మిగిల్చిన నిరాశను, ఆవేదనను ఒక్క క్షణం గుర్తు చేసిన ఆ ఏడుపుతో మనసంతా తేలికై పోయింది. ప్రచురణ కర్త పీవీ రావు ఈ పుస్తకం కాబోయే ఐఏఎస్ అధికారులకూ, మారుమూల ప్రాంతాల్లో పనిచేయవలసిన వారికీ దిక్సూచిగా ఉంటుందని, కాబట్టి ఇది గిరిజన సంక్షేమ మంత్రి చేతుల మీదుగానే విడుదల కావాలని పట్టుబట్టి అప్పటి మంత్రి భీమారావు గారిని కలిసి ఒప్పించారు. పుస్తకం విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది.

'భద్రాచలం మన్నెం కతలు' పుస్తకానికి మంచి స్పందన వచ్చింది. పుస్తకం మీద తెలుగు, ఆంగ్ల దిన వార, మాస పత్రికల్లో మంచి విశ్లేషణాత్మకమైన రివ్యూలు వచ్చాయి. అప్పటి కవులూ, రచయితలు ఆ పుస్తకం మీద తమ అభిప్రాయాలను చాలా ఆసక్తితో పంచుకున్నారు. తరవాతి రోజుల్లో ఈ పుస్తకం అనేక భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఇప్పటికీ ఎందరో కవులూ రచయితలూ నన్ను సాహిత్య కార్యక్రమాలకు ఆహ్వానించడానికి కారణం వారు ఈ పుస్తకాన్ని చదివి ఉండటమే! సాహితీ లోకం నన్ను మన్నెం కతల విద్యాసాగరుగా గుర్తిస్తున్నది. నా ఐఏఎస్ హోదా వెనక్కి వెళ్ళిపోవడం నాకు సంతోషాన్ని కలిగిస్తున్నది! ■

అంతా తూచ్..చ్..చ్



మరణం
మొగ్గలేస్తుంది
పండయి రాలిపోయేవరకు
మన కంటపడదు

పైపై అందాలనే చూస్తాం
లోలోపలనుంచి మొలుచుకొచ్చే
మృత్యుకత్తులను అసలే పసిగట్టలేం

రసాలూరే మామిడిపండ్లు
చేతివేళ్ళ సందుల్లోంచి
కాలువలుగా పారుతున్నా
చెరగని మరకలుగా

దుస్తులపై ముద్రలు వేస్తున్నా
తినటం మాత్రం ఆపము

మృత్యువు
ఇష్టమైన తీపిని పంచే
మామిడి పండులాంటిదేనని
ఎంతమందిమి గ్రహిస్తాం

రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుతున్న
వ్యక్తిలోంచి లారీ దూసుకెళ్ళటం
వెనుక సీటుమీద కూర్చున్న వ్యక్తి
కళ్ళు తిరుగుతూ
వెల్లకిలా పడిపోవటం

ఎవరమైనా ఊహించగలుగుతామా

మనమంతా శూన్యంలోంచి
శూన్యంలోకే ప్రయాణం చేస్తున్నాము
ఒకటి
రెండు
మూడు అంటూ వేసే
ఒక్కొక్క అడుగు
ఎక్కే ఒక్కొక్క మెట్టు
మన లెక్కలోనివే
అంతా తూచ్..చ్..చ్

గాలి పీల్చేంతవరకే
ఈ సుందర సుకుమార దరహాసం
చిలుకెగిరిపోయాక
పగిలిపోయే పనికిరాని పాత్రలమే

ఉన్నంతసేపు
గుండెకు
గుండెకు మధ్య
ఎప్పటికీ కూలిపోని
ప్రేమవారధి కట్టుకోవటమే
మనం చేయాల్సిందల్లా!

■ తండ హరీష్ గౌడ్
✆ 89784 39551

లోపలి వేడుక

ఆకు రాలిన అడవికి
వసంతం ఓ పిట్టను ఇచ్చింది

రంగుల పిట్ట కూతకు
చెట్లు రెండు
వయసును మరిచాయి

చిట్టి రెక్కల స్పర్శకు
జంట తరువుల ఏకాకితనం
శాపవిమోచనం పొందింది

సడి లేని గూటిలో
రెండు మువ్వలు దొర్లిన సమయం
వెన్నెల పూచిన కాలం

చిట్టి పులుగు అల్లరికి
కొమ్మలు నిండా పూల పరిమళం



పాల పళ్ళు నవ్విన మేర
సీతాకోకల హల్లీసకమే


జ్ఞానం కొలువయిన పర్ణశాలలో
ఓ తేట కాంతి పొరాడుతోంది

పుస్తకాల దొంతరల నడుమ
బొట్టు బిళ్ళ దారిచేసుకుని
బొమ్మల్ని దాచేస్తోంది

తిరిగొచ్చిన అమ్మకు
ప్రాణాలు రెండు
మురిపెంగా బుగ్గన చుక్కగా
మళ్ళీ మళ్ళీ అమరిపోతున్నాయి

పొట్టి గౌను అల్లరి
కథలో ఒదుగుతుందా
కవిత్వంలో నిలుస్తుందా.

■ తెలుగు వెంకటేష్
✆ 99853 25362





నరసరావుపేట రూరల్ పోలీసుల స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న కార్లు

నేటితో కార్ల కేసు కొలిక్కి..



పోలీసులు స్వాధీనం చేసుకున్న పార్చునర్ కొత్తకారు

● ఇప్పటికి 27 కార్లు స్వాధీనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): చోర్ గ్యాంగ్ కొట్టేసిన కార్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ముతా ఇస్తున్న సమాచారం మేరకు మరో 12 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకోగా.. వీటి సంఖ్య 27కు చేరింది. ఇంకా స్వాధీనం చేసుకోవాల్సినవి ఉన్నాయని చెబుతున్నారు. గ్యాంగ్ మొత్తం 50 కార్లు విక్రయించినట్లు..ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. కార్లు కొనుగోలు చేసిన వారిపై కూడా చర్యలకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. తమ వద్ద ఉన్న కార్లు ఇచ్చేస్తాం తమపై కేసు లేకుండా వదిలేయండి అని పోలీసులను వారు కోరుతున్నట్లు తెలుస్తోంది. రికవరీ చేసిన కార్లను ఉంచేందుకు పోలీసు స్టేషన్‌లలో ఉన్న స్థలాలు సరిపోని పరిస్థితి నెలకొంది. నరసరావుపేట రూరల్ స్టేషన్‌లో 23, దిశ పోలీసు స్టేషన్ ఆవరణలో 2, చిలకలూరిపేట పోలీసు స్టేషన్ల పరిధిలో రెండు కార్లు ఉంచినట్లు సమాచారం. సోమవారం కార్ల కేసు కొలిక్కి వస్తుందన్న అభిప్రాయం పోలీసు వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

కార్లు కొన్నవారిపై చర్యలు లేనట్లేనా..

అక్రమార్గంలో గ్యాంగ్ నుంచి కార్లను అతి తక్కువకు కొనుగోలు చేసి నెలల తరబడి వాటిలో తిరిగిన వ్యక్తులు కార్లను వెనక్కు ఇవ్వాలంటే ఇబ్బంది పడుతున్నారు. కారు ఇచ్చేస్తాం తమ మీద చర్యలు లేకుండా చూడాలని వారు పోలీసులను వేడుకుంటున్నారు. కార్లు తిరిగి ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే కొందరు పోలీసు అధికారుల వద్ద కూడా గ్యాంగ్ ఇచ్చిన కార్లు పోలీసుల స్వాధీనం అయినట్లు తెలిసింది. తమ శాఖకు చెందిన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు మిన్నకుంటారన్న విమర్శలు లేకపోలేదు. గ్యాంగ్‌లోని సభ్యులు ఏపీ పోలీసు అధికారులకు కార్లు ఇచ్చిన అంశాన్ని పేర్లతో సహా వెల్లడించినట్లు తెలుస్తోంది.

కౌలు రైతు ఆత్మహత్య
ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపికలు
6
ఘనంగా వివా వీవీఐటీయూ యువజనోత్సవాలు ఆరంభం



"ఏదైనా వస్తువు కొనుగోలు చేసేటప్పుడు ఎవరైనా నాణ్యత, ధరను పరిశీలించి కొనుగోలు చేస్తాం. ధర అధికంగా చేప్తే తక్కువకు వచ్చే దగ్గర తీసుకుంటాం. కానీ మున్సిపాల్టీల్లో మాత్రం అలా జరగడంలేదు. బహిరంగ మార్కెట్‌లో తక్కువకు వీధి దీపాలు వస్తున్నా.. కాదని ఎక్కువ ధరపెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇలా తెలిసి రూ.కోట్లలో దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. భారీ వ్యత్యాసంతో కొనుగోలు చేస్తున్న వీధి దీపాలతో రూ.వందల కోట్లు మున్సిపల్ ఖజానాకు చిల్లుపడుతోంది. ఎస్ఓఆర్ కంటే బహిరంగ మార్కెట్‌లో తక్కువ రేటు ఉంటే.. టెండర్ నిబంధనలు సవరించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కానీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఈ విధంగా జరగడంలేదు. నిబంధనలకు లోబడే టెండర్లు పిలిచాం, మార్కెట్ ధరతో సంబంధం లేదు.. మా మామూళ్లు మాకొస్తే చాలన్నట్లు కాంట్రాక్టర్లకు అధికారులు బిల్లులు చెల్లిస్తూ మున్సిపల్ ఖజానాలకు తూట్లు పొడుస్తున్నారు."

దీపాల్లో.. దోపిడీ

వ్యత్యాసం.. భారీగా

- 45 వాట్ల లైటు(అన్ని ఫిట్టింగ్‌లతో కలిపి) ఎస్ఓఆర్ ప్రకారం రూ.3,619 నుంచి రూ.3,702 వరకు నిర్ణయించారు. ఈ లైటు మార్కెట్‌లో రూ.3,080 నుంచి రూ.3,220 వరకు ఉంది. రూ.482 నుంచి రూ.540 వరకు వ్యత్యాసం ఉంది.
- 90 వాట్ లైట్ ఎస్ఓఆర్ ప్రకారం రూ.7,185 ఉంటే మార్కెట్‌లో రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు ఉంది.
- 200 వాట్ లైటు ఎస్ఓఆర్ ప్రకారం రూ.14,580 ఉంటే మార్కెట్‌లో రూ.8,800 నుంచి రూ.9,200 లోపే ఉంది. రూ.5 వేల నుంచి రూ.6 వేల వ్యత్యాసం ఉంది.

తెనాలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రభుత్వ శాఖలు చీఫ్ ఇంజనీర్స్ బోర్డు నిర్ణయించిన ఎస్ఓఆర్ (షెడ్యూల్ ఆఫ్ రేట్స్) ప్రకారం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విద్యుత్తు, పారిశుధ్య పరికరాలు కొనుగోలు చేస్తారు. ఈ రేట్ల ఆధారంగానే అధికారులు టెండర్లు పిలుస్తారు. కాంట్రాక్టర్లు కొంత లాభం చూసుకుని ఢిల్లీ వంటి పెద్ద మార్కెట్లలో తక్కువ రేట్లకు ఆ వస్తువులు కొనుగోలు చేసి మున్సిపాలిటీలకు అందిస్తారు. అయితే మార్కెట్ రేటుతో సంబంధం లేకుండా టెండర్ నిర్వహిస్తూ కాంట్రాక్టర్లు దండుకుంటున్నారు. అదేమంటే... తక్కువ మొత్తాలకు కోడ్ చేసినప్పుడు మార్కెట్ రేటు పెరిగితే పెంచరుకదా అని కాంట్రాక్టర్లు తమ దోపిడీని సమర్థించుకుంటున్నారు. ఇందుకు కొందరు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నాలుగేళ్లుగా ఇదే తరహాలో ఎస్ఓఆర్ రేట్ల ఆధారంగా మార్కెట్ రేటు తక్కువ ఉన్నా కొనేసి మున్సిపల్ ఖజానాకు తూట్లు పొడుస్తున్నారు. మున్సిపాలిటీల్లో తరచుగా కొనుగోలు చేసే విద్యుత్ లైట్లను పరిశీలిస్తే రేట్లలో మాయ, దోపిడీ తీరు అర్థమవుతుంది. ప్రస్తుతం ఎల్ఈడీ లైట్లు 45, 90, 100, 200 వాట్ల బల్బులను మున్సిపాల్టీలు (మిగతా 6లో)

తెనాలిలో రూ.లక్షల్లో ఆదా

తెనాలి మున్సిపాలిటీలో విద్యుత్ దీపాలకు సంబంధించి ఎస్ఓఆర్ కంటే మార్కెట్ రేటులో రూ.4 వేల నుంచి రూ.5వేలకుపైనే వ్యత్యాసం కనిపించింది. దీంతో గతంలో పిలిచిన కాంట్రాక్టర్‌తో సంబంధం లేకుండా నేరుగా మున్సిపాలిటీనే మార్కెట్ రేటులో ఇంజనీర్ల బృందం సూచించిన కంపెనీల పరికరాలే కొనుగోలు చేసింది. దీంతో ఒక్క తెనాలి మున్సిపాలిటీలోనే రూ.లక్షల్లో ప్రజాధనం ఆదా అయ్యింది. ఒక్క మున్సిపాలిటీలో ఒక్కసారి జరిగిన కొనుగోళ్లలోనే ఇంత ఆదా అయితే, మిగిలిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఈ నాలుగేళ్లలో జరిగిన కొనుగోళ్లలో ఎన్ని వందల కోట్లు ఆదా అయ్యేవనేది ఆందోళన కలిగించే విషయం.

- ఒక్క అడుగు దూరంలో నాలుగు రైళ్లపై నిర్ణయం
- రైల్వే శాఖ మంత్రితో కూర్చుంటే క్లియర్ అయ్యే అవకాశం
- పెమ్మసాని, లావు, తెన్నేటి చొరవ తీసుకుంటే ప్రయాణికులకు మేలు



రైళ్ల ప్రతిపాదనలు.. పెండింగ్

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొన్ని సవరణల ద్వారా జిల్లా కేంద్రాలైన గుంటూరుకు దూర ప్రాంతాల రైళ్లు నాలుగు మంజూరయ్యే అవకాశం ఒక్క అడుగు దూరంలో ఉన్నది. ఆయా ప్రతిపాదనలకు వివిధ రైల్వే జోన్లు ఇప్పటికే అంగీకారం కూడా తెలిపాయి. ఇండియన్ టైంటేబుల్ కమిటీ(ఐఆర్‌టీటీసీ) కూడా ఆమోదం తెలపడంతో రైల్వేబోర్డుకు ప్రతిపాదన వెళ్లింది. రైల్వేబోర్డు ఆమోదం తెలిపితే ఆ రైళ్లు గుంటూరు నుంచి కూత పెడతాయి. ఇందుకు రాజకీయపరమైన ఒత్తిడి కేంద్ర రైల్వే శాఖపై పెరిగితే వెంటనే మంజూరయ్యే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో ఈ నాలుగు రైళ్ల ప్రతిపాదనలపై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట, బాపట్ల ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, తెన్నేటి కృష్ణప్రసాద్ చొరవ తీసుకుని రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌తో మాట్లాడితే వెంటనే అనుమతి లభించే అవకాశాలున్నాయి. వీటికి ఎలాంటి అదనపు బడ్జెట్ కూడా అవసరం లేదు. కేవలం రైళ్ల రాకపోకల పరంగా కొన్ని సవరణలు చేస్తే చాలు. అమరావతి రాజధాని శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో వివిధ ప్రాంతాల ప్రజలు గుంటూరుకి రావడానికి రైళ్ల సౌకర్యాలు మెరుగవుతాయి.

ఇవీ రైళ్లు..

నంబరు.16219 చామరాజ్‌నగర్ - తిరుపతి డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు మధ్యాహ్నం 3.30కి బయలుదేరి మైసూరు, బెంగళూరు సిటీ, కాట్పాడి వంటి ప్రధాన రైల్వేస్టేషన్లతో పాటు మార్గమధ్యలోని పలు స్టేషన్లలో స్టాపేజీ సౌకర్యంతో (మిగతా 6లో)

నిబద్ధతకే పెద్దపీట

- టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పిల్లి మాణిక్యరావు
- మరోమారు ఎస్సీ వర్గాన్ని వరించిన అధ్యక్ష పీఠం
- జిల్లా ప్రధాన కార్యదర్శిగా మళ్లీ పోతినేనికే అవకాశం

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధ్యక్ష పదవి కేటాయింపులో నిబద్ధతకే టీడీపీ అధిష్ఠానం పెద్దపీట వేసింది. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పోరాడిన పిల్లి మాణిక్యరావును నియమించింది. జిల్లా అధ్యక్ష పదవిపై కొంతకాలంగా చర్చ జరుగుతుండగా వారం క్రితం అనూహ్యంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు పేరు తెరమీదకి వచ్చింది. తాజా ప్రకటనలో ఆ పేరునే ఖరారు చేసింది. దీంతో జిల్లా అధ్యక్ష పదవి వరసగా రెండోసారి ఎస్సీ సామాజిక వర్గానికే దక్కినట్లయింది. కాగా మాణిక్యరావు కిందటేడాదే ఏపీ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్(లిడ్‌క్యాప్) ఛైర్మన్ పదవి పొందారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మంగళగిరికి చెందిన పోతినేని శ్రీనివాసరావును మరోమారు అధిష్ఠానం ఎంపిక చేసింది.

కారంచేడు ఘటనతో ప్రస్థానం

ప్రస్తుత బాపట్ల జిల్లాలోని కారంచేడులో 1973లో పిల్లి మాణిక్యరావు జన్మించారు. పదమూడో ఏట నుంచే ఉద్యమాల్లో పనిచేశారు. కారంచేడు ఘటనతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైందని చెప్పాలి. ఎమ్మార్పీఎస్‌లో గ్రామ అధ్యక్ష, విద్యార్థి, యువజన బాధ్యతలు నిర్వహించి జాతీయ అధ్యక్షుడిగా ఐదేళ్లు కొనసాగారు. 2000లో గుంటూరులో ఆదర్శ వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డారు. 2017లో టీడీపీలో చేరిన కొద్దికాలానికే రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. 2019లో అధికార ప్రతినిధి హోదాలో ఆయన చేసిన పోరాటమే ప్రస్తుతం కలిసివచ్చింది.



పిల్లి మాణిక్యరావును అభినందిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నేతలు కనపర్తి శ్రీనివాసరావు, వడ్రాణం హరిబాబు

చంద్రబాబు, లోకేశ్‌లకు కృతజ్ఞతలు

జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు పిల్లి మాణిక్యరావు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే మాధవి, మేయర్ రవీంద్ర తదితరులు

రక్షిత తాగునీటి సరఫరాకు ప్రణాళిక

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- రూ.9 కోట్లతో రెండు ప్రాంతాల్లో రిజర్వాయర్లకు శంకుస్థాపన

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర ప్రజలకు శుభ్రమైన, రక్షిత తాగునీటిని సమగ్రంగా సరఫరా చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని అంకమ్మనగర్‌లో రూ.4.50 కోట్లతో 16 వందల కిలో లీటర్ల సామర్థ్యం, ఉద్యోగనగర్‌లో రూ.4.50 కోట్లతో 1590 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఈ.ఎల్.ఎస్.ఆర్ (ఎగ్జిస్టింగ్ ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్)ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు వందేళ్ల వరకు నగరంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికతో రిజర్వాయర్ల నిర్మాణం, కృష్ణానది దగ్గర నూతన మోటార్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కరంపై ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.35 కోట్ల అంచనాతో 7 ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదన చేశామన్నారు. వచ్చేవారం బీఆర్ స్టేడియం దగ్గరలో రిజర్వాయర్ నిర్మాణానికి శంకు స్థాపన చేస్తామన్నారు. ఉండవల్లి దగ్గర నీటిని పంపింగ్ చేయడానికి రూ.3.28 కోట్లతో 600 హెచ్.పి సామర్థ్యం కలిగిన రెండు మోటార్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.370 కోట్ల అమృత్ నిధులతో కృష్ణానది నుంచి నీటిని నేరుగా గుంటూరుకి తెచ్చేందుకు పనులు మొదలుపెడతామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతి తక్కువ కాలంలో గుంటూరులో సుమారు 5 వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఏ.పి.ఐ.డి.సి ఛైర్మన్ డేగల ప్రభాకర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, కార్పొరేటర్లు అడకా పద్మావతి, ఈరంటి వరప్రసాద్, వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, ఏరువ సాంబిరెడ్డి, మాజీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ షేక్ షౌకత్, మాజీ కార్పొరేటర్లు ముత్తినేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరంభం... అదిరింది

- అట్టహాసంగా ఎంపీఎల్-4 క్రికెట్ టోర్నీ ప్రారంభం
- పోటీలను ప్రారంభించిన నారా బ్రాహ్మణి
- హాజరైన ఎంపీ సానా సతీశ్, హీరో సిద్ధార్థ్ నిఖిల్
- లోకేశ్ జన్మదినం సందర్భంగా టోర్నీ నిర్వహణ

6



ఎంపీఎల్ పోటీలను తిలకిస్తున్న బ్రాహ్మణి, ఎంపీ సానా సతీశ్, హీరో నిఖిల్, తమ్మిశెట్టి జానకి

రెండు పోలియో చుక్కలతో భరోసా

- పల్స్‌పోలియోలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు మెడికల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు పోలియో చుక్కలతో చిన్నారుల నిండు జీవితానికి అంగ వైకల్యం సంభవించకుండా భరోసా కల్పించవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పల్స్ పోలియో సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీనివాసరావుతోటలోని ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు కలెక్టర్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలియో బారిన పడిన వారి జీవితం దుర్భరంగా ఉంటుందని, వారి కుటుంబం కూడా ఆ బాధను అనుభవించాల్సి వస్తుందన్నారు. దీనిని నివారించేందుకు తల్లిదండ్రులు ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. జిల్లాలో 958 కేంద్రాలు ఏర్పాటు చేసి 2,14,981 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. పోలియో చుక్కలు వేసిన మూడు రోజులు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారని, వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులు ఉంటే వారిని గుర్తించి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు.

ఆరంభం... అదిరింది

- అట్టహాసంగా ఎంపీఎల్-4 క్రికెట్ టోర్నీ ప్రారంభం
- పోటీలను ప్రారంభించిన నారా బ్రాహ్మణి
- హాజరైన ఎంపీ సానా సతీశ్, హీరో సిద్ధార్థ్ నిఖిల్
- లోకేశ్ జన్మదినం సందర్భంగా టోర్నీ నిర్వహణ



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించిన బ్రాహ్మణి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణి

మంగళగిరి సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో క్రీడల సందడి మొదలైంది. జనవరి 23న రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి ప్రీమియర్ లీగ్ పేరిట ఏటా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటు ఆదివారం నుంచి ప్రారంభమైంది. మంగళగిరి బైపాస్ రోడ్డులోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో టోర్నీ ప్రారంభ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. నారా బ్రాహ్మణి, రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్, సినీ హీరో సిద్ధార్థ్ నిఖిల్ హాజరై స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రికెట్ పోటీలతో క్రీడా ప్రాంగణం సందడిగా మారింది. జనవరి 21 వరకు జరిగే ఈ పోటీలకు సువిశాలమైన మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. టోర్నీకి సాయి పావని కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బిజ్ 51, సోనోవిజన్, హోటల్ డి-దేవ్, తాడేపల్లి మెడ్ స్టార్ హాస్పిటల్స్, సిగ్నేచర్ డైన్, హైపర్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్, కోకాకోలా, వీ వైబ్ సంస్థలు ఈవెంట్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, బ్రాహ్మణి జన్మదినం సందర్భంగా పలువురు మహిళలు, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వేగంగా ఏపీ అభివృద్ధి

ఏపీ ఎంతో వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని, అన్ని రంగాల్లోనూ ముందుకు వెళుతుందని సినీ హీరో సిద్ధార్థ్ నిఖిల్ అన్నారు. మంత్రి లోకేశ్ అన్నా.. క్రికెటన్నా తనకు ఎంతో ఇష్టమన్నారు. 128 జట్లతో పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తుంటే ఎంతో సంతోషంగా వుందన్నారు. నారా బ్రాహ్మణికి బిజినెస్ టుడే మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు రావడం పట్ల అభినందనలు తెలియజేశారు. మన మంగళగిరి-మన లోకేశ్ నినాదంతో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ మంత్రి నారా లోకేశ్‌ను తమ సొంత వ్యక్తిగా భావిస్తున్నారని చెప్పారు.

యువతను ప్రోత్సహించేందుకే..

నియోజకవర్గంలోని యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోనే మంత్రి నారా లోకేశ్ ఎంతో ఖర్చుతో కూడిన క్రీడా ప్రాంగణాలను ఏర్పాట్లు చేసి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారని ఎంపీ సానా సతీశ్ తెలిపారు. మంత్రి లోకేశ్ క్రీడలను ప్రోత్సహించడం వల్లనే మంగళగిరి నుంచి కేపీ సాయి రాహుల్, పావని ఆంధ్ర జట్టులో ఆడుతున్నారని చెప్పారు. మంగళగిరి నుంచి ఇద్దరు ఆంధ్ర జట్టుకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. ఎంపీఎల్ తరహా టోర్నీలు అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించేలా కృషి చేస్తామన్నారు.

భారీగా బహుమతులు, ప్రోత్సాహకాలు

ఎంపీఎల్ టోర్నీలో విజేతలకు, సత్తా చాటిన క్రీడాకారులకు పెద్ద ఎత్తున బహుమతులు, ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. ప్రథమ బహుమతి కింద రూ.3 లక్షలను మంగళాద్రి డెవలపర్స్, ద్వితీయ బహుమతి కింద రూ.2 లక్షలను మంచికలపూడి వైష్ణవి, తృతీయ బహుమతి కింద రూ.లక్షను వెలగపూడి కిషోర్ సహకారంతో అందించనున్నారు. ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కింద రూ.3 వేలను జవ్వాది కిరణ్‌చంద్, టాసన్ విన్నర్‌కు సిల్వర్ కాయిన్, ఫైనల్ మ్యాచ్ టాస్ విన్నర్‌కు గోల్డ్ కాయిన్‌ను రేవతి జ్యూయలరీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎలక్ట్రిక్ బైకును వల్లభనేని బార్గవ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.25 వేలతోపాటు ఎలక్ట్రిక్ సైకిల్‌ను కాసరనేని జస్వంత్, బెస్ట్ బౌలర్‌కు రూ.25 వేలతోపాటు బైసైకిల్‌ను గుత్తా కిశోర్, బెస్ట్ ఫీల్డర్‌కు రూ.25 వేలతోపాటు బైసైకిల్‌ను తాడిబోయిన మహేష్, బెస్ట్ వికెట్ కీపర్‌కు రూ.25 వేలతోపాటు బైసైకిల్‌ను షేక్ ఇంతియాజ్ అందించనున్నారు. మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికీ నిర్వాహకులు ఉచితంగా టీ షర్టులు, ట్రాక్స్ అందిస్తున్నారు.



బ్రాహ్మణికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

పోలియోని పూర్తిస్థాయిలో నియంత్రించాం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



పోలియో చుక్కలు వేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పోలియోని ఇప్పటికే దేశంలో పూర్తిస్థాయిలో నియంత్రించగలిగామని, తిరిగి రాకుండా పోలియో చుక్కలు 0-5 వయస్సులోపు చిన్నారులకు అందిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఎన్జీవో కాలనీలో జిల్లా వైద్యారోగ్యశాఖ, నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలాతో కలిసి ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. కేవలం రెండు చుక్కలతో చిన్నారుల జీవితాన్ని సురక్షితం చేయవచ్చునని అన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాల తనిఖీ



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ బాలకోటయ్య

మంగళగిరి సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య ఆదివారం మంగళగిరిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గణపతి నగర్‌లోని బాలికల వసతి గృహం, తెనాలిరోడ్డులోని బాలుర వసతి గృహాలను సందర్శించి వసతులను పరిశీలించారు. పిల్లల సంఖ్య, మెనూ అమలు, భద్రత, చదువు తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు శరీరాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుకుంటే మంచి ఆలోచనలు వస్తాయని, తద్వారా చదువులో బాగా రాణించవచ్చని తెలిపారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నుంచి ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యను అభ్యసించాలని చెప్పారు. హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని బాలకోటయ్య విద్యార్థులకు సూచించారు.

ఘనంగా వివా వీవీఐటీయూ యువజనోత్సవాలు ఆరంభం



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న చాన్సలర్ విద్యాసాగర్ తదితరులు



ఉత్కంఠగా విద్యార్థినుల కబడ్డీ పోటీలు

పెదకాకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం నందు జాతీయస్థాయి యువజనోత్సవం వివా - వీవీఐటీయూ 2025-26 వేడుకలు ఘనంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ రాంబాబు కొడాలి. ప్రో - చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువజనోత్సవ నేపథ్యం "యానిమి ఇన్ ద స్ట్రీట్ ఆఫ్ చైనా " ప్రతిబింబించేలా వర్సిటీ ప్రాంగణం మొత్తం చైనాలోని సంస్కృతులు, పురాణాల ఆకృతులతో తీర్చిదిద్దారు. సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా మూడు విభాగాల నుంచి 94 అంశాలలో పోటీలు నిర్వహించగా వివిధ కళాశాలకు చెందిన 9,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సిద్దార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు. అమెరికన్ ప్రొఫెసర్ దండు రాజు పాల్గొన్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లడుతూ విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి యువజనోత్సవాలు ఉపయోగపడుతాయన్నారు. జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల పెరుగుదలకు క్రీడలు కళలు దోహదపడుతాయని తెలిపారు. చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న ఈ వేడుకల్లో విద్యార్థులు ఆహ్లాదకరంగా పాల్గొనాలని, వర్సిటీ ద్వారా మంచి అనుభూతులు దక్కించుకోవాలని పేర్కొన్నారు. తొలిరోజు పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ప్రో- చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

దుర్గి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ముటుకూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మిర్యాల లక్ష్మి (28) ఆదివారం తెల్లవారు జామున నరసరావుపేటకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకుంది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తూ బస్సు కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయాన్ని డ్రైవర్, కండక్టర్ గమనించలేదని తెలుస్తోంది. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం 568.80 అడుగులు ఉంది. ఇది 253.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 7,190, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,380, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సి ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 49,770 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 49,770 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కౌలు రైతు ఆత్మహత్య



వెంకటేశ్వర్లు(ఫైల్)

రెంటచింతల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చే మార్గం లేక పురుగుమందు తాగిన కౌలు రైతు ఆదివారం ఉదయం గుంటూరులోని సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెంటచింతల మండలం పశర్లపాడు గ్రామానికి చెందిన వీరేపల్లి వెంకటేశ్వర్లు(48)తన రెండెకరాల సొంత పొలం, మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిర్చిని సాగుచేస్తున్నాడు. మూడేళ్ల నుంచి నష్టాలు రావడంతో పాటు చేసిన అప్పులు అంతకంతకు పెరిగిపోయాయి. అప్పులిచ్చినోళ్ల ఒత్తిడి పెరిగి, రుణం తీర్చే మార్గం లేక ఈ నెల 20న గడ్డి మందుతాగాడు. ఇంటిలో అచేతనంగా పడి ఉన్న అతనిని తొలుత రెంటచింతల, పిడుగురాళ్లకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గుంటూరు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ.. ప్రాణాలిడిచాడు. మృతుడికి భార్య సీతమ్మ, ఇద్దరు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. గుంటూరులో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపికలు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం మహిళలు, పురుషుల నెట్‌బాల్ జట్ల ఎంపిక చేసినట్లు సంఘ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 27 నుంచి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మైలా గోపయ్య, సంఘ రాష్ట్ర మాజీ సంఘ కార్యదర్శి బి.శివరాం, పాఠశాల అభివృద్ధి దాతలు గోపికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

- పురుషుల జట్టు: సాల్మన్ రాజు, కె.మధు (బాపట్ల), కె యశ్వంత్ (మున్నంగి), డి.నాగ శివనారాయణ, పి.హేమంత్ కుమార్ (తెనాలి), కె.బాలు, ఎన్.మహేష్, డి.నాగరాజు (శేకూరు), ఎన్.వంశీకృష్ణ (వినుకొండ), జి.నందకిషోర్ (సంగం జాగర్లమూడి), కె.శశాంక్ (గుంటూరు), స్టాండ్ బై గా షేక్ రియాజ్ (తెనాలి) కె.నరేంద్ర, పి.దేవదాస్ (శేకూరు).
- మహిళల జట్టు: టి.అభిగాయులు, జి.అక్షిత, వి.రాణి, ఎం అమూల్య, సీహెచ్ చైతన్యశ్రీ, ఎం.మేఘచంద్రిక, టి.దివిజశ్రీ (శేకూరు), డి.ఏంజెల్ (వింజనంపాడు), సయ్యద్ సాహిర (తెనాలి), కె.నాగమణి (వేలూరు), పి.రేష్మ, పి.యశస్విని (సంగం జాగర్లమూడి), స్టాండ్ బైగా డి.కోటేశ్వరమ్మ, వైనందిని (తెనాలి), షేక్ చరిష్మా (గుంటూరు).

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	142, 151, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

రైళ్ల ప్రతిపాదనలు.. పెండింగ్

(5వ పేజీ తరువాయి)

మరుసటి రోజు వేకువజామున 4.05కి తిరుపతి చేరుకుంటున్నది.

18519 విశాఖపట్టణం - ముంబై(ఎల్‌టీటీ) ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం విజయవాడ నుంచి కాజీపేట మీదగా సికింద్రాబాద్ అక్కడి నుంచి ఎల్‌టీటీకి వెళుతున్నది. ఈ రైలుకు కాజీపేటలో స్టాపేజి ఉన్నా ప్రయాణికుల డిమాండ్ లేదు. ఈ నేపథ్యంలో గుంటూరు మీదగా మళ్లిస్తే గుంటూరు, నల్గొండ ప్రాంత ప్రయాణికులకు నేరుగా ఎల్‌టీటీకి డైలీ ట్రైన్ సర్వీసు అందుబాటులోకి వస్తుంది. అలానే సికింద్రాబాద్‌కు కూడా ఉదయం పూట కనెక్టివిటీ వస్తుంది.

17282 నరసపూర్ - గుంటూరు, నంబరు. 17227 గుంటూరు - డోన్ మధ్య రెండు రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రెండిటిని కలిపి ఒక రైలుగా మార్చి గుంతకల్లు మీదగా ధర్మవరం వరకు పొడిగించేందుకు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ రైల్వేబోర్డుకు ప్రతిపాదన పంపించింది. 14 బోగీలతో ఉన్న ఈ రైళ్లని 22 కోచ్‌లకు పెంచడం ద్వారా ఎక్కువమంది ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రతిపాదన కూడా రైల్వేబోర్డు వద్ద పెండింగ్‌లో ఉన్నది.

16854 విల్లుపురం - తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్నది. విల్లుపురం నుంచి కాకుండా తిరుచ్చిరాపల్లి - గుంటూరు మధ్య నడిపేందుకు దక్షిణ పశ్చిమ జోన్ అధికారులు సమ్మతించారు. దీని వలన గుంటూరు ప్రాంత ప్రయాణికులకు తిరుపతి, అరుణాచలంకు డైలీ సర్వీసు అందుబాటులోకి వస్తుంది.

దీపాల్లో.. దోపిడీ

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా కొనుగోలు చేస్తాయి. వీటిలో కంపెనీని బట్టి కొద్ది మేర ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. అయితే ఎస్ఓఆర్ రేట్లకు, మార్కెట్ రేట్లకు ఇక్కడ భారీ వ్యత్యాసమే ఉంది. ఎస్ఓఆర్ రేటు కంటే మార్కెట్‌లో ఉన్న తక్కువ రేటుతో పోల్చితే ఒక్కో లైటుపై వేలల్లో వ్యత్యాసం కనిపిస్తుంది. మున్సిపాలిటీల్లో వేలల్లో, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లలో అయితే లక్ష సంఖ్యలో వీధి దీపాలను కొనుగోలు చేస్తారు. తుపాన్లు, ఈదురు గాలుల వేళల్లో వీధి దీపాలు అవసరం అధికంగా ఉంటుంది. సగటున 50 వేలు వీధి దీపాలు కొనుగోలు చేసినా రూ.100 కోట్లపైనే ప్రజాధనం కాంట్రాక్టర్లు, కొందరు అధికారుల జేబుల్లోకి పోయినట్లే. దీపాల కొనుగోళ్లలో మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్ల పాత్రే కీలకమైనా వారు కూడా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పరిశీలించే కొనుగోలు చేస్తున్నాం

విద్యుత్, పారిశుధ్య పరికరాలను ఎస్ఓఆర్ ప్రకారం టెండర్లు పిలిచినా, మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకునే కొనుగోలు చేస్తున్నాం. అయితే ఏ మున్సిపాలిటీ ఎంత మొత్తంలో కొనుగోలు చేశారో, ఏ రేటుకు కొనుగోలు చేశారనేది పరిశీలించాల్సి ఉంది. చాలావరకు ప్రజాధనాన్ని వృథా కాకుండా కొనుగోలు చేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నాం. భారీ వ్యత్యాసంతో కొనుగోలు చేస్తే ఆయా మున్సిపాలిటీలలో తనిఖీలు చేసి, చర్యలు తీసుకుంటాం.

-సూర్యదేవర హరికృష్ణ, ఆర్‌డీ, మున్సిపల్ శాఖ

దళిత వాడలు పంచాయతీలుగా మారితేనే అభివృద్ధి

- ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్



మాట్లాడుతున్న పీవీ సునీల్ కుమార్

పొన్నూరు, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): దళిత వాడలు పంచాయతీలుగా మారినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలో శనివారం రాత్రి మాలల ఆత్మగౌరవ సభ జరిగింది. సభకు హాజరైన సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలు దళితలపై రూ.1,40,000 కోట్లు ఖర్చు చేశాయన్నారు. కానీ అభివృద్ధి మాత్రం ముందుకు అడుగు పడలేదన్నారు. దళితవాడలు పంచాయతీలుగా మారితే ఆ దళితులే సర్పంచులుగా తమ అభివృద్ధి చేసుకుంటారని తెలిపారు. దళితులందరూ ఐక్యమత్యంతో ముందకు సాగితే అభివృద్ధి, రాజ్యాధికారం దక్కుతాయని సునీల్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దళితులు అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సభ నిర్వాహకులు పొందుగల చైతన్య, అన్నవరపు కిషోర్, విద్యాసాగర్, రాజేష్, గడ్డేటి సురేంద్ర, యారమాల కిరణ్, పిల్లి సుధాకర్, తుళ్ళిమిల్లి అశోక్, కేసి చెన్నయ్య, ఎండ్రపాటి అశోక్, మధిర శేషయ్య, అరుణకుమారి, శ్వేత, తదితర దళిత సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనసును మదిస్తేనే కవిత్వం

- ప్రముఖ కవి డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు



గూండ్ల వెంకటనారాయణను గ్రంథాళ్వార్ సాహిత్య పురస్కారంతో సత్కరిస్తున్న కవులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనసును మదిస్తేనే... గుండె లోతుల్లో నుంచి కవిత్వం బయటకు వస్తుందని, అంతేగాని మంత్రాలతో అది పుట్టదని ప్రముఖ కవి, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో ఈశ్వర వరప్రసాద పరిషత్తు ఆధ్వర్యంలో జిల్లా రచయితల సంఘం సహకారంతో ఆదివారం గ్రంథాళ్వార్ లంకా సూర్యనారాయణ సాహితీ పురస్కార ప్రదాన సభ జరిగింది. తొలుత ప్రముఖ వచన కవిత్వ రచయిత గూండ్ల వెంకట నారాయణకు గ్రంథాళ్వార్ లంకా సూర్యనారాయణ సాహితీ పురస్కారాన్ని కవులు, రచయితలు అందజేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెంకట నారాయణ రాసిన ద్రవిడ మహా సముద్రం కవితా సంపుటాలు దళిత వాదానికి, అస్తిత్వ వాదాన్ని ప్రతిబింబించేలా ఉందన్నారు. ప్రతి విషయాన్ని కవితాత్మకంగా చెప్పటంలో సూటిగా స్పష్టంగా గుండె లోతుల్ని స్పృశించేలా ద్రవిడ మహా సముద్రం రచనలు సాగాయన్నారు. పురస్కార గ్రహీత గూండ్ల వెంకటనారాయణ మాట్లాడుతూ పుస్తకానికి భక్తుడైన లంకా సూర్యనారాయణ సాహితీ పురస్కారం అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. ఈశ్వర వరప్రసాద పరిషత్తు, కోఆర్డినేటర్ మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ పరిషత్తు ద్వారా సాహిత్య, కళా రంగాలలో ప్రతిభావంతులను గుర్తించి గౌరవిస్తున్నట్లు తెలిపారు. సభకు జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు కేజే రమేష్ అధ్యక్షత వహించగా, ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ఎం సుభాని, నానా, శ్రీ వశిష్ట, కందిమళ్ల శివప్రసాదు, పలువురు రచయితలు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార ముఠా గుట్టురట్టు

- 18 మంది అరెస్టు

పెదకాకాని, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని రోడ్డులోని గడ్డిపాడు సమీపంలోని ఓ హోటల్లో వ్యభిచారం గుట్టు రట్టయింది. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఆ హోటల్‌పై దాడి చేయగా వ్యభిచారం నిర్వహిస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. హోటల్‌ను కేంద్రంగా చేసుకుని సాగుతున్న ఆర్గనైజింగ్ వ్యభిచార ముఠాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఏడుగురు మహిళలను, 8 మంది విటులు, మేనేజర్, ఆర్గనైజర్‌తో కలిసి మొత్తం 18మందిని అరెస్టు చేసి.. పెదకాకాని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

యువత క్రమశిక్షణ అలవర్చుకోవాలి

- ఈగల్ ఐజీ రవికృష్ణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐజీ రవికృష్ణ, క్లబ్ ప్రతినిధులు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజసేవ పట్ల నిబద్ధత అలవర్చుకోవాలని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ స్పష్టం చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన రోటోఫెస్ట్ - 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. మత్తు పదార్థాలు యువతను నిర్వీర్యం చేస్తాయన్నారు. రోటరీ అనేది కేవలం ఒక సంస్థగానే కాకుండా.. మానవాళి ఆరోగ్యం, భవిష్యత్తు కోసం నిరంతరం సేవలు అందిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. 1972 టోల్ ఫ్రీ నంబరుకు వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా విద్యార్థులను డీ-అడిక్షన్ సెంటర్లకు పంపించి పునరావాసం కల్పిస్తున్నామని వివరించారు. గంజాయికి బానిసలైన పలువురు యువతను ఈ సందర్భంగా ఉదహరించారు. తల్లిదండ్రులందరూ.. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆర్‌టీఎన్ ప్రతినిధులు మామిడి సుబ్బారావు, నంబూరు కృష్ణమూర్తి, కనమర్లపూడి రవికిరణ్, సీఏ హరనాథ్‌బాబు, గార్లపాటి రవికిరణ్, ముప్పవరపు వెంకట సత్యనారాయణ, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఈగల్ సీఐ విక్టర్, ఎస్ఐ సునీల్‌బాబు, తల్లితండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

26న లక్ష్మీనారాయణ స్మారక పురస్కార ప్రదానం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, అన్నమయ్య కళా వేదికపై ఈ నెల 26న సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక పురస్కార ప్రదాన సభ జరుగుతుందని ప్రముఖ రచయిత, విమర్శకులు డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఈ పురస్కారాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయ ఆచార్యులు, ప్రముఖ రచయిత, విమర్శకులు డాక్టర్ సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య విస్తాలి శంకరరావు, ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు పాల్గొంటారని చెప్పారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జిల్లా ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు గుంటూరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్, ఎంఈవో జ్యోతికిరణ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పట్టుదలతో రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ శాంతి, విజిబుల్ డైరెక్టర్ పాల్గొన్నారు.

మోదుకూరివి మానవతా చిత్రాలు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మానవతా చిత్రాలు మోదుకూరి సినిమాలు అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు పేర్కొన్నారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని సరస్వతి హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మోదుకూరి జాన్సన్ సాహిత్యం గురించి మాట్లాడుతూ పింగళి బదులు జీవిత బాధల్ని తన నాటక రచనల ద్వారా ప్రతిబింబించిన మోదుకూరి.. సినీ రచయితగానూ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పింగళి భాగ్యలక్ష్మి, సంబరాజు రమని, గడల శివప్రసాద్, కుమారస్వామి, అసోది శంకర్, మన్నం వెంకట గురువు, వక్కలగడ్డ వెంకటేశ్వరరావు, పాణిరావు తదితరులున్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని వాలీబాల్ క్రీడాకారుడు వాకా అంజిరెడ్డి పేర్కొన్నారు. సంగడిగుంటలో నూతనంగా నిర్మించిన వాలీబాల్ కోర్టును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆరోగ్యంపై శ్రద్ధచూపుతూ, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మద్ది రెడ్డి జగన్మోహన్‌రెడ్డి, పోకనాటి శివారెడ్డి, జానీ తదితరులున్నారు.



కవి కుమార్ రాజాను సత్కరిస్తున్న దృశ్యం

కుమార్‌రాజాకు గోదావరి పురస్కారం

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్‌రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం కార్యదర్శి బుర్రి కుమార్ రాజాకు గోదావరి పురస్కారం లభించింది. విశ్వ సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో గోదావరి కవితా తరంగాలు కార్యక్రమంలో పాల్గొని తన కవితా గానం చేసినందుకు గాను ఈ పురస్కారం ప్రధానం చేసారు. జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొన్న మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్, విశ్వ సాహితీ రథ సారథులు రంగిసెట్టి రమేష్, మహమ్మద్ రఫీ, జంధ్యాల శరత్ బాబు , పరిమి సత్యమూర్తి, దుబ్బ భాస్కర్ రావు, తురగా సూర్యారావు, విశ్వ సాహితీ కళా వేదిక అధ్యక్షురాలు కొల్లి రమావతి తదితరుల ఆధ్వర్యంలో కుమార్ రాజా పురస్కారం అందుకున్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ భాస్కరరావు

పెన్షనర్లకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న సదుపాయాలను యూనియన్ బ్యాంక్ పెన్షనర్లకు కల్పించే విధంగా యూనియన్ పనిచేస్తుందని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎంఎం భాస్కరరావు అన్నారు. గుంటూరులోని విజయ కన్వెన్షన్ హాల్లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడేళ్లకోసారి జరిగే ఐదు రాష్ట్రాల పెన్షనర్ల 6వ సమావేశాన్ని నిర్వహించారు. వందల సంఖ్యలో ఈ సమావేశానికి రావడం సంతోషంగా ఉందని రిసెప్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేఎల్ రాజు అన్నారు. ఈ సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏవి రమణ (హైదరాబాద్), జనరల్ సెక్రటరీగా ఎ.కృష్ణారెడ్డి, కోశాధికారిగా మోహన్ కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి, జనరల్ హెడ్ శ్రీనివాసరావు (విజయనగరం), భాస్కర్ రావు, మిస్సప్ప (విశాఖపట్నం), జవహర్, శర్మ (తిరుపతి), జితేంద్ర కుమార్ (విజయనగరం) పాల్గొన్నారు.

కమ్యూనిస్టులపై బీజేపీ వ్యాఖ్యలు దురదృష్టకరం: జంగాల

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యలు దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేట సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కమ్యూనిస్టులే శాపమని అనడం అవివేకమని పేర్కొన్నారు. ఈ దేశంలో కార్మిక వర్గం హక్కులను సాధించుకున్నది కమ్యూనిస్టు ఉద్యమం వల్లేనని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి అకిటి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

గంజాయి, డ్రగ్స్ కట్టడికి పోలీసుల కార్యాచరణ

● గుంటూరులో విస్తృతంగా తనిఖీలు

● రౌడీషీటర్లు, గంజాయి కేసు నిందితులకు కౌన్సెలింగ్



పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విక్రయాలను కూకటివేళ్లతో అణిచివేసేందుకు పోలీసులు కార్యాచరణ రూపొందించారు. గుంటూరు నగరంలో ఆదివారం పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రౌడీ షీటర్లు, గంజాయి విక్రేతలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సౌత్ డీఎస్పీ భానోదయ ఆధ్వర్యంలో నల్లపాడు సీఐ వంశీధర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, డ్రగ్స్, గంజాయి కేసుల్లో నిందితులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయికి బానిసలైన పలువురు రౌడీషీటర్లకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీఎస్పీ భానోదయ హెచ్చరించారు. గంజాయి దుష్పరిణామాలు, చట్టపరంగా ఎదురయ్యే ఇబ్బందుల ఆటో కాన్వాసింగ్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. అలాగే జాతీయ రహదారితో పాటు ఇన్నర్‌రింగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సాయంత్రం పోలీసులు ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఇకనుంచి నిత్యం నాకాబందీతో వాహనాల ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని డీఎస్పీ భానోదయ తెలిపారు.

● వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్పం - మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం కార్యక్రమంలో భాగంగా.. గంజాయి కేసుల్లో నిందితులకు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ గంజాయి కార్యకలాపాల్లో పాల్గొంటే.. చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంపాలెం సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రసన్న కుమార్ ఉన్నారు. అలాగే కొత్తపేట స్టేషన్ పరిధిలో సీఐ వీరయ్య చౌదరి వాహన తనిఖీలు చేపట్టారు.

మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

● కేంద్ర మంత్రి పెమ్మసానికి చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ విజ్ఞప్తి



మంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఎక్కువ మోతాదులో మిర్చిని విదేశాలకు గుంటూరు జిల్లా ఎగుమతి చేస్తోన్నందున ఇక్కడ చిల్లీ బోర్డును ఏర్పాటు చేయాలని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఇండియా జనరల్ సెక్రటరీ తోట రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మిర్చిద్వారా ఏటా 1.3 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యం వస్తోందన్నారు. అలానే మేలిమి రకాల విత్తనాలను రైతులకు సరఫరా చేసేందుకు చిల్లీ సీడ్ జినోమ్ బ్యాంకును నెలకొల్పాలన్నారు.

తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● నగర కమిషనర్‌కు తూర్పు ఎమ్మెల్యే నసీర్ వినతి



కమిషనర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులపై గుంటూరు మునిసిపాలిటీ సహకారం అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పులి శ్రీనివాసులును ఎమ్మెల్యే నసీర్ కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తపేట పోలీస్ స్టేషన్‌ను మోడల్ పోలీస్ స్టేషన్‌గా పునర్నిర్మించేందుకు రూ.4.29 కోట్లు పరిపాలన, సాంకేతిక అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. కార్పొరేషన్‌కు చెందిన భూమిని పోలీస్ శాఖకు కేటాయించాలని కోరారు. పాల ఆసుపత్రి వద్ద మహిళల కోసం మల్టీ పర్పస్ సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాంచాలని కోరారు. పొన్నూరులో రోడ్డులో సద్భావన మండప్ నిర్మాణం ద్వారా సామాజిక సమావేశాలు, సంక్షేమ కార్యకలాపాల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఆటో నగర్‌లో నీటి కనెక్షన్ చార్జీల ధరలు తగ్గించే విషయంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ అంశాలను రాబోయే కౌన్సిల్‌లో ప్రతిపాదించి తీర్మానం చేయాలని కోరారు.



పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ కనకదుర్గ

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్ 56 డివిజన్‌లో పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ ఆయిశెట్టి కనకదుర్గ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆయిశెట్టి శ్రీనివాస్, ఎర్రగోపు నాగేశ్వరరావు, సంగీతం రవికుమార్, రవితేజ, గ్రంధి శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

● 15వ డివిజన్‌లో సంగడిగుంట, ఇందిరా ప్రియదర్శిని కాలనీలో డివిజన్ అధ్యక్షుడు సూరె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, కొమ్మినేని కోటేశ్వరరావు, కొండలు, చల్లగుండ్ల కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది రాజేశ్వరి, సుమలత, సరళ, ఉపాధ్యక్షుడు షైక్ షాజహాన్, కార్యదర్శి పుట్టగంటి వెంకటేశ్వరావు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు.



మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్‌కుమార్

పదవీ విరమణ వయసు పెంచాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సి.హెచ్.జోసఫ్ సుధీర్ బాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ఏపీ మోడల్ స్కూల్స్ ఎస్ టీయూ శాఖ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్స్ సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్‌టీయూ అధ్యక్షుడు పి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎంప్లాయీస్.. 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గుంటూరుకార్పొరేషన్, డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్, బీసీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.శ్రీనివాసులు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు మేకల సుబ్బారావు, ఎక్సైజ్ శాఖ అధికారి అరుణకుమారి, ఏఈఎస్ మారయ్య బాబు, బీసీ ఈ ఎఫ్ రాష్ట్ర వ్యవ స్థాపక అధ్యక్షుడు మేడపి ప్రసాద్, సలహా మండలి చైర్మన్ సత్యనారాయణ, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, విన్నకోట వెంకటేశ్వర్లు (కన్నా మాస్టర్), రాష్ట్ర ఆర్థిక కార్య దర్శి వరికల్లు శ్రీనివాసరరావు గుంటూరు జిల్లా అధ్యక్షులు మేకల సుబ్బారావు, ప్రధాన కార్య దర్శి ఊద అప్పలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు క ట్టెబోయిన నరసింహ రావు,రాష్ట్ర కార్యదర్శి జువ్వా జ్ఞానేశ్వర రావు, రాష్ట్ర నాయుకులు దేవ ప్రసాదరావు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కొరటిపాడు వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేశానని ట్రాక్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నసాని బాజీ తెలిపారు. ఆదివారం ఆయన అధ్యక్షతన అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని వాకింగ్ ట్రాక్‌లో నిర్వహించారు. నిధులు, ట్రాక్ అభివృద్ధిపై చర్చించారు. నూతనంగా సభ్యత్వం పొందిన వారికి గుర్తింపు కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. జనవరి 2, 3, 4 తేదీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆర్వీఆర్‌జేసీలో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్



హ్యాకథాన్ కోసం కళాశాలలో సిద్ధం చేసిన క్యాబిన్లు

గుంటూరు(విద్య),డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రైతుల సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతో ఈఎస్‌టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ ఆధారిత సంస్థల సహకారంతో రెండు రోజుల పాటు నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ 2025 నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 66 జట్లును ఎంపిక చేశామని తెలిపారు. 15 రాష్ట్రాల నుంచి విద్యార్థులు కార్యక్రమానికి హాజరుకానున్నట్లు వివరించారు. ఈ నెల 23న ముగింపు వేడుకల్లో కిసాన్ దివాస్ సందర్భంగా విజేతలకు రూ. లక్ష వరకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

కళాబంధు రామరాజుకు సత్కారం



రామరాజు దంపతులకు సత్కారం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం యువ కళావాహిని, కళా విపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో కళాబంధు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు సన్మాన సభా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్, గుమ్మడి గోపాలకృష్ణ, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య, సభాధ్యక్షుడిగా యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, రేరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని రామరాజు, లక్ష్మి శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం సినీ నాటక కళాకారుడు రచయత మీసాల లక్ష్మణ్ తెలుగు పద్యాలు ఆకట్టుకున్నాయి. పి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు, నడింపల్లి వెంకటేశ్వర రావు, వీవీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా బధిరుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బధిరుల సంఘ సభ్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం బధిరుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకుడు దండా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎ.వెంకటరెడ్డి, బి.రాజేంద్ర వ్యవహరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడిగా కె.గోపీనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జె.నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.విజయ, కోశాధికారిగా ఎస్.సుబ్బలక్ష్మి, మహిళా కార్యదర్శిగా వి సీమారాణి, కార్యవర్గ సభ్యులుగా కె. ప్రత్యూష, సయ్యద్ షరీఫ్, జి. సాయిచందులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

క్రీడలతో నాయకత్వ నైపుణ్యాలు



మాట్లాడుతున్న డీసీపీ సరిత

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఎన్టీఆర్ జిల్లా డీసీపీ సరిత అన్నారు. శనివారం స్థానిక వికాస్ నగర్‌లో భాష్యం ఒలంపస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. మన అనే భావన క్రీడా స్ఫూర్తి ద్వారా పెంపొందించబడుతుందన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఈ ఓలు శివ, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేతలు సంఘటితం కావాలి

● చేనేత సంఘాల కన్వీనర్, న్యాయవాది వైకే



సమావేశంలో పాల్గొన్న చేనేత సంఘాల ప్రతినిధులు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమ రక్షణ కోసం చేనేతలు సంఘటితం కావాలని చేనేత సంఘాల కన్వీనర్, ప్రముఖ న్యాయవాది వైకే పిలుపునిచ్చారు. ఆదివారం గుజ్జనగుండ్లలోని ప్రగడ కోటయ్య వీవర్స్ భవనంలో చేనేత ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది వై కోటేశ్వరరావు (వైకే) మాట్లాడుతూ చేనేత పరిరక్షణ కార్యచరణకు జనవరి 4న విజయవాడలో రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణ, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. బాలకృష్ణ, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనందప్రసాద్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత కాంగ్రెస్ నాయకులు రామనాథం పూర్ణచంద్రరావు, చేనేత కార్మిక సంఘాల నాయకులు కే. కోటేశ్వరరావు, మర్రిగూడ వెంకట్రావు, కట్ట శివ దుర్గారావు, గొట్టుముక్కల బాలాజీ, కన్నా మాస్టర్, బుధ్ధవరపు బాలాజీ, గోలి వెంకటేశ్వర్లు, అందె జగదీష్, ఎం. సూర్య నారాయణ, కె. రామయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

శ్వాస కోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్వాస కోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ పి.కాశీరామ్ పేర్కొన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు 50 ఏళ్లు పైబడిన వారు నిమోపోకల్ అనే వ్యాక్సిన్‌ను జీవితంలో ఒక్కసారి వేయించుకుంటే మంచిదన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాయిరామ్, వెంగళరావు, సీహెచ్ చలమారెడ్డి, షేక్ కరిముల్లా, నూరుల్ అహ్మద్ తదితరులున్నారు.

విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకుల ద్వారా ప్రజల మౌలిక అభివృద్ధికి కష్టపడిన విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. స్థానిక జేకేసీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రిటైరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. రైతులు, ప్రజల ఆర్థికాభివృద్ధికి గ్రామీణ బ్యాంకులు చేయూతనందిస్తున్నాయని, అందులో బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల పాత్ర గణనీయమైనదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుకంటున్న వికసిత్ భారత్ లక్ష్యాలకనుగుణంగా గ్రామీణ బ్యాంకులు శ్రమించి పనిచేస్తున్నాయని అభినందించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో 7,541 మంది సిబ్బందితో 351 శాఖలతో రూ.1.27 లక్షల కోట్ల వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కె.శివరామప్రసాదు అధ్యక్షత వహించగా.. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ జీఎమ్ (హెచ్ఆర్) ఎస్సార్ రఘునాథరెడ్డి, సీహెచ్ రాజారెడ్డి, జగన్నాథరావు, ప్రభాకర్ రెడ్డి, ఎ.లక్ష్మీనరసయ్య, పరమహంసరెడ్డి, 13 జిల్లాల కమిటీల నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యువత కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

● కేంద్ర మంత్రి పెమ్మసాని



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, చైర్మన్ బాబు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యువత కళల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, అప్పుడే వారిలోని సృజనాత్మకత తెలుస్తుందని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ 20వ వార్షికోత్సవం సందర్భంగా 2026 మార్చి 1న శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగనున్న ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫెస్టివల్ కరపత్రాలను బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. అకాడమీ చైరన్ కేపీ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఈ కాంపిటీషన్స్‌లో కేజీ టూ పీజీ, జూనియర్, సీనియర్ చిత్రకారులు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. కృష్ణ, సుబ్బారావు, మదుసూదనరావు తదితరులున్నారు.

ఇంటర్ విద్య ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

గుంటూరు(విద్య) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్య ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం స్థానిక మెడికల్ కళాశాల రోడ్డులోని ఎన్జీవో కల్యాణ మండపంలో ని ర్వహించారు. నూతన కార్యదర్శిగా దుర్గ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శిగా అఖిల్ బాబు, ఈసీ సభ్యులుగా విజయ్, రవీంద్ర, కార్యదర్శిగా బి.గోపికృష్ణ ట్రెజరర్‌గా డీయూ వి.రామారావు, ఆర్గనైజేషన్ సెక్రటరీగా పి.ప్రభుద్యాని, మహిళా కార్యదర్శిగా జె.హిమబిందు తదితరులు ఎంపికయ్యారు.

48వ డివిజన్‌లో 'చాయ్ విత్ జన సైనిక్స్'



చాయ్ విత్ జనసైనిక్స్‌లో బోనబోయిన, గాదె తదితరులు

గుంటూరు మెడికల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 48వ డివిజన్ పరిధిలో రెడ్డిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గర ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో చాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమం నిర్వహించారు. జనసేన డివిజన్ అధ్యక్షుడు అంబటి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత నాయకులు జనసైనికులతో కలసి డివిజన్‌లో పాదయాత్ర జరిపి పలు ప్రాంతాల్లో సమస్యలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి మైనర్ మృతి

● మాజీ ఎంపీ మోదుగుల ఇంటిలో ఘటన

గుంటూరు, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి ఇంటిలోని స్విమ్మింగ్ పూల్‌లో పడి మైనర్ స్వర్ణభారతి నగర్‌కు చెందిన పల్లెపోగు హర్షవర్ధన్(18) మృతి చెందాడు. నల్లపాడు పోలీసుల కథనం మేరకు.. స్వర్ణ భారతి నగర్‌కు చెందిన పల్లెపోగు ఏలియా, మాధవి దంపతులకు హర్షవర్ధన్ (18), అంజూర (16) సంతానం ఉన్నారు. హర్షవర్ధన్ రెడ్డిపాలెంలోని మోదుగుల వేణుగోపాల్ రెడ్డి ఇంటిలోని స్విమ్మింగ్ పూల్ క్లీనింగ్‌కు వెళ్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో మోదుగుల ఇంటి నుంచి ఓ వ్యక్తి హర్షవర్ధన్ బంధువు కొంగల చందుకు ఫోన్ చేసి.. ఉదయం 8 గంటల సమయంలో హర్షవర్ధన్ స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయాడని చెప్పాడు. తొలుత ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడినుంచి జీజీహెచ్ తీసుకువెళ్తున్నట్లు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు వెళ్లగా.. అప్పటికే హర్షవర్ధన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్విమ్మింగ్ పూల్ క్లీన్ చేసేందుకు వెళ్లిన సమయంలో పూల్ లోతుగా ఉండటం వల్ల ప్రమాదవశాత్తు కాలు జారి పడి తన కొడుకు చనిపోయినట్లు మృతుడి తల్లి మాధవి నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు విచారిస్తున్నారు. అయితే ఈత రాని మైనర్‌తో స్విమ్మింగ్ పూల్ క్లీన్ చేయించడం చర్చనీయంశంగా మారింది. ఇది చట్టరీత్యా నేరం కూడా. అలాగే హర్షవర్ధన్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దిక్సూచి



స్కిల్ గ్యాప్‌ని తగ్గించే

సీడాక్ కోర్సులు

డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ దిశగా భారతదేశం దూసుకెళుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సెమికండక్టర్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా నిర్దేశిత టెక్నాలజీలు వేగంగా పుంజుకుంటున్న రోజులు ఇవి. మిలియన్ల కొద్దీ ఉద్యోగ అవకాశాలను ఈ పరిణామాలు కల్పిస్తున్నాయి. అదే సమయంలో సరికొత్త సవాళ్ళనూ విసురుతున్నాయి. అయితే ఈ క్రమంలో ఇండస్ట్రీ కోరుకుంటున్న నైపుణ్యాలు కలిగిన యువత మాత్రం లభ్యం కావటం లేదు. ఫలితంగా అటు అవసరాలు, ఇటు నైపుణ్యం కలిగిన మానవవనరుల మధ్య అంతరం పెరుగుతోంది.

మన దేశంలో ఏటా లక్షన్నరకు మించి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు వివిధ సంస్థల నుంచి ఉత్తీర్ణులవుతున్నారు. అయితే అందులో పరిశ్రమకు అచ్చంగా ఉపయోగపడే నైపుణ్యాలు కలిగిన వారు మాత్రం తక్కువ శాతంగానే ఉంటున్నారు. దాంతో ఆ గ్రాడ్యుయేట్లు ఉద్యోగం కోసం ప్రయాసపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలాఉంటే టెక్నాలజీపరంగా అత్యున్నత ఎదుగుదల ఉన్న డొమైన్లు పలు సాంకేతిక పరిజ్ఞాన రంగాల కలయికగా మారి పటిష్టమైన కెరీర్ డ్రైవర్లుగా మారుతున్నాయి. వాటిలో ముఖ్యంగా....

అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్: నేషనల్ కంప్యూటింగ్ మిషన్ వంటివి కంప్యూటింగ్ అత్యున్నత ప్రతిభ కలిగిన వారిని డిమాండ్ చేస్తున్నాయి. దానికితోడు ఏఐ ఇంటిగ్రేషన్, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్, డేటా ఇంజనీరింగ్, ఎంటర్‌ప్రైజ్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌ను డిమాండ్ చేస్తోంది.

ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ వీఎల్ఎస్ఐ: సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్ కింద మన దేశం అందిస్తున్న ప్రోత్సాహంతో లక్షల కోట్లు పెట్టుబడులు ఈ రంగంలో జమ అవుతున్నాయి. ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ చిప్ డిజైన్, వెరిఫికేషన్, ఎస్ఓసీ డెవలప్‌మెంట్ నైపుణ్యాలు ఉన్న వ్యక్తులు దానికి అవసరమవుతారు.

సైబర్ సెక్యూరిటీ: బ్యాంకింగ్, టెలికామ్, ప్రభుత్వం, రక్షణ తదితర రంగాల్లో డిజిటల్ అడాప్షన్ పెరుగుతున్న కొద్దీ సైబర్ సెక్యూరిటీ క్లిష్టంగా మారుతోంది. అయితే మన దేశం ఇప్పుడు సరైన నైపుణ్యాలు కలిగిన సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్ కొరతను ఎదుర్కొంటోంది.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ బిగ్ డేటా అనలిటిక్స్: ఎఐ, డేటా అనలిటిక్స్ ఇప్పుడు పరిశ్రమల స్వరూపస్వభావాలనే మార్చేస్తున్నాయి. హెల్త్‌కేర్, ఫిన్‌టెక్ నుంచి తయారీ పరిశ్రమలు, ఈ-కామర్స్ వరకు అన్నింటా ఏఐ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులకు డిమాండ్ పెరుగుతోంది.

అయితే సరైన ప్రాక్టికల్ ట్రైనింగ్ కొరవడిన కారణంగా ఇండస్ట్రీ అంచనాలతో పోల్చుకుంటే 30 నుంచి 50 శాతం మేర సంబంధిత శిక్షణ పొందిన మానవవనరుల కొరత కనిపిస్తోంది. సరిగ్గా ఈ నేపథ్యంలో ప్రాక్టికల్ స్కిల్స్ పెంపుపై పరిశ్రమలు దృష్టిసారించేలా చేస్తోంది. సదరు సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యం కలిగిన మానవవనరులను రూపొందించేందుకు సీడాక్ వివిధ పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలో పని చేస్తున్న స్వతంత్రప్రతిపత్తి కలిగిన సంస్థ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీడాక్). ముందుగా పేర్కొన్న అవసరాలకు తగిన విధంగా రూపొందించిన పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ల్లో అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, వీఎల్ఎస్ఐ డిజైన్, సైబర్ సెక్యూరిటీ అండ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బిగ్ డేటా అనలిటిక్స్, ఐటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ తదితరాలు ఉన్నాయి. ఇవన్నీ 24 వారాల ప్రోగ్రామ్‌లు. లెర్నింగ్, ఎక్స్‌టెన్సివ్ ల్యాబ్ వర్క్, రియల్ వరల్డ్ ప్రాజెక్టులకుతోడు అనుభవజ్ఞులైన సైంటిస్టులు, ఇంజనీర్లు, ఇండస్ట్రీ నిపుణులతో లెక్చరర్లు కలగలిసిన కార్యక్రమంగా ఈ ప్రోగ్రామ్‌లను సీడాక్ తీర్చిదిద్దింది. 1200 గంటలకు మించి కఠినమైన ట్రైనింగ్ ఉంటుంది. దాంతో హ్యాండ్స్ అన్ ఎక్స్‌పోజర్‌కు అవకాశం ఉంటుంది. అందులో బాగంగా ఇండస్ట్రీ టూల్స్, టెక్నాలజీలు, బెస్ట్ ప్రాక్టీసెస్ అలవడతాయి. దానికి తోడు టెక్నికల్ స్కిల్స్ నేర్చుకుంటారు. ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్, ప్లేస్‌మెంట్ రెడీనెస్ సహా ప్రొఫెషనల్ కార్యకలాపాల్లోకి నేరుగా చేరే విధంగా ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులను తీర్చిదిద్దుతారు. అత్యున్నత ఎదుగుదల కలిగిన రంగాల్లో మంచి వేతనాలతో ప్రొఫెషనల్స్‌గా నిలదొక్కుకోగలుగుతారు. సంబంధిత నైపుణ్యాలను అలవర్చుకోవడం అన్నది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఇప్పుడు ఆప్షన్ ఎంత మాత్రం కాదు, అది అవసరమే అని గుర్తించాలి.

- డాక్టర్ పి.ఆర్. లక్ష్మీ ఈశ్వరి,
సైంటిస్ట్ 'జి' అండ్ సెంటర్ హెడ్,
సీడాక్, హైదరాబాద్.

సీడాక్ అందిస్తున్న వివిధ పీజీ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి వచ్చే ఏడాది జనవరి 10, 11 తేదీల్లో కామన్ అడ్మిషన్ టెస్ట్ జరుగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న సీడాక్ సెంటర్లలో ఈ టెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిసెంబర్ 29లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్స్: www.cdac.in or acts.cdac.in
Contact: +91 7382053731/32

సృజనాత్మకతకు చిరునామా

ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎన్‌టీఏ నోటిఫికేషన్

ఒక వస్తువుతో కలిగే ప్రయోజనంలో ఎలాంటి మార్పులు లేకుండా కేవలం అందాన్ని జోడించడమే ఫ్యాషన్‌కు అర్థంగా చెప్పుకోవచ్చు. మనం అనునిత్యం ధరించే దుస్తులు, పాదరక్షలు, వాచీ తదితరాలన్నింటిలో వస్తు ప్రయోజనానికి తోడు అందానికి కూడా ప్రాధాన్యం ఇస్తాం. ఆ అందం, అంతకుమించి ట్రెండ్‌ను కలగలిపి కోర్సులుగా మలచిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్). హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఉన్న నిఫ్ట్ సెంటర్లు ఫ్యాషన్ రంగంలో వివిధ కోర్సులు - యూజీ, పీజీ, పిహెచ్‌డీని అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది.



- యూజీ కోర్సుల కాలవ్యవధి నాలుగేళ్ళు. బ్యాచిలర్ ఆఫ్ డిజైనింగ్ అలాగే ఫ్యాషన్ టెక్నాలజీలో ఈ కోర్సులు ఉన్నాయి. ఫ్యాషన్ కమ్యూనికేషన్, యాక్సెసరీ డిజైన్, ఫ్యాషన్ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెదర్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, ఫ్యాషన్ ఇంటీరియర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్ లేదా తత్సమాన ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. అడ్మిషన్ ఏడాది అంటే వచ్చే ఏడాది ఆగస్టు 1 నాటికి ఈ కోర్సుల్లో చేరబోయే విద్యార్థి వయస్సు 24 సంవత్సరాలకు మించకూడదు.
- డిగ్రీ ఉత్తీర్ణులు పీజీ కోర్సులు చేసేందుకు అర్హులు. మాస్టర్స్ ఆఫ్ డిజైన్, మాస్టర్స్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, మాస్టర్స్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి.
- ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే ఏడాది జనవరి 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫిబ్రవరి 8న దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరంలో ఈ పరీక్షను నిర్వహిస్తారు.
- ఈ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన పరీక్షలో జనరల్ ఎబిలిటీ టెస్ట్ కంప్యూటర్ ఆధారిత ఎగ్జామ్. క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ పెన్ను - పేపర్ ఆధారిత పరీక్ష. కొన్ని యూజీ కోర్సులకు అదనంగా సిట్యుయేషన్ టెస్ట్ ఉంటుంది. అలాగే పీజీ కోర్సులకు పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. వివిధ టెస్టులకు వేర్వేరు వెయిటేజీలు ఉంటాయి. వాటి ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

వెబ్‌సైట్స్: http-s://exams.nta.nic.in/niftee/, www.nta.ac.in, www.nift.ac.in

అప్రెంటిస్‌షిప్

ఐఓసీఎల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) - ఈస్టర్న్ రీజియన్‌లో అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి.
ఖాళీలు: డిప్లొమా టెక్నీషియన్ 248, ట్రేడ్ అప్రెంటిస్ 127, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 107, డేటా ఎంట్రీ ఆపరేటర్ 27
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణత
ఎంపిక: రాత పరీక్ష ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరుతేదీ: జనవరి 9
వెబ్‌సైట్స్: https://www.iocl.com/apprenticeships,https://forms.cloud.microsoft/r/4846hcLHPE,

కపుర్తల రైల్ కోచ్ ఫ్యాక్టరీ

పంజాబ్‌లోని కపుర్తలలో ఉన్న రైల్ కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్)లో 550 యాక్ట్ అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి.
ట్రేడ్‌లు: ఫిట్టర్, వెల్డర్(జి అండ్ ఇ),మెషినిస్ట్, పెయింటర్(జి), కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్, మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్.
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 7
వెబ్‌సైట్: www.rcf.indianrailways.gov.in

బెల్, ఘజియాబాద్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఘజియాబాద్ యూనిట్‌లో 84 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి.
ఖాళీల వివరాలు: మెకానికల్ 24, కంప్యూటర్ సైన్స్ 20, ఎలక్ట్రానిక్స్ 30, సివిల్ 10
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత బ్రాంచ్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా(జనవరి 16, 17)
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 25
వెబ్‌సైట్: www.nats.education.gov.in

విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్

కేరళ రాష్ట్రం తిరువనంతపురంలోని ఇస్రో - విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో 90 అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి.
ఖాళీల వివరాలు- అర్హతలు: నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ 23 - డిగ్రీ ఉత్తీర్ణత, డిప్లొమా ఇన్ కమర్షియల్ ప్రాక్టీస్ 67 - డిప్లొమా ఇన్ కమర్షియల్ ప్రాక్టీస్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత
వాక్ ఇన్ ఇంటర్వ్యూ: డిసెంబర్ 29(తిరువనంతపురం జిల్లా ఏటీఎఫ్ ఏరియా, వెలిలో ఉన్న వీఎస్ఎస్‌సీ గెస్ట్ హౌస్‌లో) దరఖాస్తుకు ముందు ఎన్‌టీపీ పోర్టల్‌లో పేరు నమదు చేసుకోవాలి)
వెబ్‌సైట్: www.nats.education.gov.in



యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ - చెన్నై యూనిట్ వివిధ విభాగాల్లో 153 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి. ఏపీలో 3, తెలంగాణలో 2 కూడా ఇందులోనే కలిసి ఉన్నాయి.
అర్హత: 2021 జూలై 1 తరవాత డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు
అన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 20
వెబ్‌సైట్: www.nats.education.gov.in

చిత్రజ్యోతి

SINCE 1965



సరికొత్త క్రికెట్ లీగ్

నిర్మాత దిల్ రాజు ఆదివారం హైదరాబాద్‌లో ఓ కొత్త క్రికెట్ లీగ్‌ను ప్రారంభించారు. టాలీవుడ్ ప్రో లీగ్ (టీపీఎల్)గా పిలవబడే దీనికి ఈబీజీ (యూరోపియన్ బిజినెస్ గ్రూప్) సంస్థ యజమాని డా. ఇర్ఫాన్ ఖాన్ అధ్యక్షత వహించనున్నారు. దిల్‌రాజు గౌరవ అధ్యక్షుడు. ఏటా రెండు సీజన్లతో ఆరు జట్ల ఫ్రాంచైజీ లీగ్‌గా దీనిని నిర్వహించనున్నారు. ఇందులో సెలబ్రిటీలు కూడా ఆటగాళ్లుగా సందడి చేయనున్నారు. ప్రముఖ నిర్మాతలు లీగ్‌లోని టీమ్‌లకు యజమానులుగా ఉండనున్నారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ ఖాన్ మాట్లాడుతూ 'ఇది కేవలం క్రికెట్ టోర్నమెంట్ మాత్రమే కాదు, పరిశ్రమలో ఐక్యతను బలోపేతం చేసే వేదిక అని అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ 'క్రీడలనూ, వినోద రంగాన్ని కలిపే లీగ్ ఇది' అని చెప్పారు. మరిన్ని వివరాలు త్వరలోనే తెలియనున్నాయి. ఈ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి క్రికెటర్లు కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, రైనాతో పాటు నిర్మాత నాగవంశీ, దర్శకుడు అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు థమన్, రాశిఖన్నా తదితరులు అతిథులుగా విచ్చేశారు.

క్షేమంగానే ఉన్నా..

● ప్రమాదంపై స్పందించిన నోరా ఫతేహి

నటి నోరా ఫతేహి ముంబయిలో జరుగుతున్న సన్‌బర్న్ ఫెస్టివల్‌కు వెళుతున్న సమయంలో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రమాదంపై స్పందించి, క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు. 'తాగి కారు నడిపిన ఓ వ్యక్తి మా వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నా తల కారు విండోకు తగిలింది. వెంటనే చికిత్స తీసుకున్నా. ప్రస్తుతానికి క్షేమంగానే ఉన్నాను. తలతిరగడం, వాపు ఉన్నాయి. గాయాలు ఇంకా నయమవ్వలేదు' అని ఓ వీడియో ద్వారా పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించొద్దని కోరారు. కాగా, ఈ ప్రమాదంలో నోరాకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స తీసుకున్న తర్వాత ఆమె సన్‌బర్న్ ఫెస్టివల్ వేదికకు హాజరయ్యారు.



వారణాసి బడ్జెట్ రూ.1300 కోట్లు? స్పందించిన ప్రియాంక



మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి' షూటింగ్ శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా బడ్జెట్ రూ.1300 కోట్లు అని ప్రచారం అవుతోంది. ఇటీవల కపిల్ శర్మ టాక్ షోలో పాల్గొన్నారు ప్రియాంక చోప్రా. ఈ సందర్భంగా కపిల్ శర్మ 'మీరు జాయిన్ అయ్యాక ఈ సినిమా బడ్జెట్ మరింత పెరిగిందంట కదా' అని సరదాగా ప్రశ్నించారు. దానికి ప్రియాంక బదులిస్తూ 'అంటే సగం డబ్బు నా బ్యాంక్ ఖాతాలోకి వెళ్లిందనేది మీ ఉద్దేశమా?' అని చమత్కరించారు. అయితే 'వారణాసి' బడ్జెట్ విషయంలో ఈ ప్రచారమే నిజమైతే.. రణబీర్ కపూర్ హీరోగా నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణ' తర్వాత అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న రెండో భారతీయ ప్రాజెక్ట్‌గా ఇది నిలవనుంది. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న 'రామాయణ' బడ్జెట్ రూ.4000 కోట్లు అని తెలిసిందే. ఇటీవలె విడుదల చేసిన 'వారణాసి' గ్లింప్స్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో అభిమానులకు హింట్ ఇచ్చారు రాజమౌళి. రుద్రగా మహేశ్‌బాబు, మందాకినిగా ప్రియాంక చోప్రా, కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. 2027లో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇలాంటి చిత్రాల్నే ప్రేక్షకులు చూడాలనుకుంటున్నారు



ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో యుగంధర్ ముని తెరకెక్కించిన మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల'. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. అర్చన అయ్యర్, స్వశిక, రవి వర్మ, మధునందన్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 25న చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో నాని ఆవిష్కరించి, చిత్రబృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. ట్రైలర్ అద్భుతంగా ఉంది. ఇలాంటి జానర్ చిత్రాల్నే ప్రేక్షకులు చూడాలని కోరుకుంటున్నారు. సినిమా ఘనవిజయం సాధించాలి' అని అన్నారు. విజువల్ వండర్‌గా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని యుగంధర్ ముని అన్నారు. ఈ ట్రైలర్‌లోని సంభాషణలు, విజువల్స్, మేకింగ్, సంగీతం, పోరాట ఘట్టాలు సినిమాపై అంచనాలు పెంచేశాయి.

బొమ్మ హిట్ మొదలైంది



చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఎన్నో చిత్రాల్లో నటించిన అభినవ్ మణికంఠ హీరోగా నటిస్తున్న 'బొమ్మ హిట్' చిత్రం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో మొదలైంది. పూజా యడం ఇందులో కథానాయిక. రాజేశ్ గడ్డంను దర్శకుడిగా పరిచయం చేస్తూ గుర్రాల సుధారాణి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా అభినవ్ మణికంఠ మాట్లాడుతూ 'హీరోగా నాకు ఇది రెండో చిత్రం. 'బొమ్మ హిట్' వినోదభరితంగా ఉంటుంది. ఇందులో వినోదంతో పాటు భావోద్వేగాలు కూడా ఉంటాయి' అని చెప్పారు. దర్శకుడు రాజేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో ప్రేమకథతో పాటు తల్లితండ్రులు, కొడుకు మధ్య ఉండే అనుబంధం ఆకట్టుకుంటుంది. షూటింగ్ త్వరగా పూర్తి చేసి వచ్చే వేసవిలో విడుదల చేస్తాం' అని చెప్పారు. మంచి కథతో సినిమా తీస్తున్నామని నిర్మాత సుధారాణి తెలిపారు.



బిగ్‌బాస్ 9 విజేతగా కల్యాణ్

దాదాపు 15 వారాల పాటూ బుల్లితెర ప్రేక్షకులను అలరించిన బిగ్‌బాస్ సీజన్ 9 ముగిసింది. ఆదివారం జరిగిన ఈ గ్రాండ్ ఫినాలేలో కల్యాణ్ పడాల విన్నర్‌గా నిలిచి, ఈ ఘనత సాధించిన తొలి సామాన్యుడిగా రికార్డు సృష్టించారు. రూ.35 లక్షల ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీని వ్యాఖ్యాత నాగార్జున చేతుల మీదుగా అందుకున్నారు. షో స్పాన్సర్స్ ఆయనకు రూ.ఐదు లక్షలను బహూకరించారు. అలాగే ఓ కారును కూడా సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాకు ఇంతటి మద్దతునిచ్చి విజేతను చేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు' అని అన్నారు. సీఆర్పీఎఫ్ జవాన్ అయిన కల్యాణ్‌కు ఈ విజయం ఏమంత సునాయాసంగా దక్కలేదు. అగ్నిపరీక్షలో నెగ్గి, తొలి కామన్‌మ్యాన్‌గా ఈ షోలో అడుగుపెట్టారు. ఎన్నో కష్టాలు ఎదురైనా, తన ఆటతో ప్రేక్షకుల్ని మెప్పించి.. వారి ఓట్లు దక్కించుకుని విజేతగా నిలిచారు. తనూజ రన్నరప్‌గా నిలిచారు. డిమోన్ పవన్ మూడోస్థానంలో నిలిచారు. ఇమ్మాన్యుయేల్, సంజన గల్రానీ నాలుగు, ఐదు స్థానాల్లో మిగిలారు. ఈ కార్యక్రమానికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రం ప్రధాన పాత్రధారులు రవితేజ, డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్, నటుడు శ్రీకాంత్, 'ఛాంపియన్' హీరోహీరోయిన్ రోషన్, అనస్వర రాజన్, 'అనగనగా ఒక రాజు' కథానాయకుడు నవీన్ పొలిశెట్టి, కథానాయిక మీనాక్షీ చౌదరి ఈ కార్యక్రమానికి విచ్చేసి సందడి చేశారు. గత ఎనిమిది సీజన్‌లు అందించిన హంగామాను ఏ మాత్రం మిస్ కానివ్వకుండా సెప్టెంబర్ 7న మొదలైన ఈ బిగ్‌బాస్ సీజన్ 9 ప్రేక్షకులకు ఎంతో వినోదాన్నీ, ఉత్కంఠనూ పంచింది.



ఫెస్టివ్ మూడ్‌కు సూట్ అయ్యే పతంగ్

సురేశ్ ప్రొడక్షన్స్ అధినేత సురేశ్‌బాబు సమర్పణలో రూపుదిద్దుకున్న చిత్రం 'పతంగ్' ఈ యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామాలో ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలు. ఎస్పీ చరణ్ కీలక పాత్ర పోషించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో ఇటీవల చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ ట్రైలర్‌కు మంచి స్పందన వస్తుండడంతో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో వంశీ పూజిత్ మాట్లాడుతూ 'ట్రైలర్ బాగుందని అందరూ అంటున్నారు. ఆ పాజిటివ్ వైబ్ సినిమాలో కూడా ఉంటుంది. ఇందులో పతంగ్ పోటీల సీజీ వరల్డ్ క్లాస్ లెవల్‌లో ఉంటుంది' అన్నారు. ఈ సినిమా ఒక ఎమోషనల్ జర్నీ అని ప్రణవ్ కౌశిక్ చెప్పారు. 'డిలే అయినా ఓ మంచి క్వాలిటీ సినిమా తీశామనే నమ్మకం ఉంది. యూత్ ఎంటర్‌టైనర్‌గా అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాతల్లో ఒకరైన సురేశ్ కొత్తింటి చెప్పారు. 'ఫెస్టివ్ మూడ్‌కు సెట్ అయ్యే సినిమా ఇదని అందరూ అంటున్నారు. చిన్న చిత్రానికి ఉండాల్సిన కష్టాలు అన్నీ ఈ సినిమాకు ఉన్నాయి' అన్నారు నిర్మాత రమ్య. కంటెంట్‌ను నమ్మి చిత్రాన్ని నిర్మించామనీ, తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందనీ నిర్మాతలు విజయ్‌శేఖర్ అన్నే, సంపత్ మాక, నాని బండ్రెడ్డి చెప్పారు. ప్రణీవ్ ప్రత్తిపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

హారర్ థ్రిల్లర్స్‌లో కొత్తగా ఉంటుంది

● వంశీ నందిపాటి, బన్నీ వాసు



'లిటిల్‌హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి సూపర్ హిట్స్ అందించిన బన్నీ వాసు, వంశీ నందిపాటి ఇప్పుడు 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంలో నటించిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రంలో హెబ్బా పటేల్ కథానాయిక. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 25న విడుదలవుతున్న నేపథ్యంలో నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీ వాసు మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- సినిమా బాగుంది. మొదటి పది నిముషాల్లోనే ఈ సినిమా మేం ఎందుకు తీసుకున్నామో అందరికీ అర్థమవుతుంది. ఎంతో ఆసక్తిగా, భయపెడుతూ సినిమా ఉంటుంది. ముగింపు చాలా కొత్తగా ఉంటుంది. కంటెంట్ నచ్చి ఈ సినిమా చేస్తున్నాం. నచ్చకపోతే ఆ విషయాన్ని ముందే చెప్పేస్తాం. మేమిద్దరం కలసి చేసిన ఏ సినిమా కూడా ఫెయిల్ కాదనే నమ్మకం ఉంది.
- మాదొక కొత్త ట్రెండ్. ఓ స్ట్రాటజీ ఫాలో అవుతూ వర్క్ చేస్తున్నాం. ఈషా ఎవరినీ నిరాశ పరచదు. కొత్త సంవత్సరంలో మూడు సినిమాలను ఫిబ్రవరిలో ప్రకటించనున్నట్లు బన్నీ వాసు చెప్పారు. గీతా ఆర్ట్స్‌లో ఒక సినిమా, బన్నీ వాస్ వర్క్స్‌లో రెండు సినిమాలు ఉంటాయని ఆయన తెలిపారు. పోలిమేర 3 ఫిబ్రవరిలో కానీ మార్చిలో కానీ ఉంటుందని వంశీ నందిపాటి చెప్పారు.

నాడియా వచ్చేసింది!



కొత్త సంవత్సరంలో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో యశ్ నటిస్తున్న 'టాక్సిక్' ఒకటి. ఈ చిత్రంలో నాడియాగా కథానాయిక కియారా అడ్వాణీ నటిస్తున్నారు. ఆమె లుక్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. నాడియా పాత్ర గురించి డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ మాట్లాడుతూ 'కొన్ని పాత్రల్లో నటించినప్పుడు అవి సినిమాకే పరిమితం కావు. ఆర్టిస్ట్‌కు కూడా సరికొత్త గుర్తింపు తీసుకువస్తాయి. అలాగే నాడియా పాత్రలో కియారా నటన డిఫరెంట్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపిస్తుంది. ఆమె పెర్ఫార్మెన్స్ చూసి గర్వంగా ఫీల్ అవుతున్నాను' అని చెప్పారు. 'కేజీఎఫ్ 2' తో బాక్సాఫీసు దగ్గర చరిత్ర సృష్టించిన యశ్ నాలుగేళ్ల అనంతరం 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. యశ్, గీతూ మోహన్‌దాస్ కలసి ఈ చిత్రకథను తయారు చేశారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషలతో పాటు మరికొన్ని భాషల్లో డబ్బింగ్ చేసి వచ్చే ఏడాది మార్చి 19న విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ కె నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

బిజినెస్

గుంటూరు ● సోమవారం 22 డిసెంబరు 2025

చెన్నైలో కిమ్స్ హాస్పిటల్

రూ.300 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చెయిన్ కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్).. తమిళనాడుకు కార్యకలాపాలు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా చెన్నైలో రూ.300 కోట్ల పెట్టుబడితో 300 పడకల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయనుంది. చెన్నైలోని రాజా అన్నామలైపురంలోని డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రోడ్డులోని ఆంధ్ర మహిళా సభకు చెందిన 1.168 ఎకరాల భూమిలో ఈ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించిన భూమి లీజు ఒప్పందంపై సంతకాలు చేసినట్టు తెలిపింది. మూడేళ్లలో ఈ హాస్పిటల్ నిర్మాణం పూర్తవుతుందని కిమ్స్ పేర్కొంది.

ఐపీఓ మార్కెట్లో రికార్డుల హోరు

ఈ ఏడాది ఇప్పటి వరకు 355 ఐపీఓలు ● రూ.1.85 లక్షల కోట్లకు చేరిన సమీకరణ



న్యూఢిల్లీ: ప్రస్తుత సంవత్సరం (2025) పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్లో రికార్డుల మీద రికార్డులు నమోదవుతున్నాయి. ఈ నెల 15వ తేదీ నాటికి 101 పెద్ద కంపెనీలు, 254 చిన్న, మధ్య తరహా కంపెనీలు (ఎస్ఎంఈ) ఐపీఓల జారీ ద్వారా రికార్డు స్థాయిలో రూ.1.85 లక్షల కోట్లు సమీకరించాయి. గత ఏడాది (2024) అన్ని కంపెనీలు ఐపీఓల ద్వారా సమీకరించిన రూ.1.6 లక్షల కోట్లతో పోలిస్తే ఇది రూ.24,000 కోట్లు ఎక్కువ. ఈ ఏడాది ఐపీఓల ద్వారా కంపెనీలు సమీకరించిన రూ.1.85 లక్షల కోట్లలో పెద్ద కంపెనీలు వాటానే అత్యధికంగా రూ.1.74 లక్షల కోట్ల వరకు ఉంది. భారత ప్రైమరీ మార్కెట్ చరిత్రలో ఈ సంవత్సరం అత్యంత ప్రధాన మైలురాయిగా నిలిచిందని ప్రైమ్ డేటాబేస్ (గ్రూప్ ఎండీ ప్రణవ్ హల్దియా తెలిపారు.

ఆగని జోరు: సెకండరీ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నా ప్రైమరీ మార్కెట్ గత ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా రేసు గుర్రంలా పరిగెత్తింది. ఐపీఓలకు వచ్చిన పెద్ద కంపెనీల సంఖ్యా వంద దాటింది. దీన్ని మన ప్రైమరీ మార్కెట్లో చోటు చేసుకున్న పెద్ద సంస్థాగత మార్పుగా పరిశీలకులు భావిస్తున్నారు. అంతర్జాతీయంగా అనేక ఆటుపోట్లు చోటు చేసుకుంటున్నా, ఐపీఓ మార్కెట్ ఇలా శివాలెత్తడం విశేషం. ఈ సంవత్సరం ఐపీఓకు వచ్చిన కంపెనీల్లో టాటా క్యాపిటల్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్, గ్రో, ఎన్ఎస్‌డీఎల్, ఫైన్ ల్యాబ్స్, మీషో, ఫిజిక్స్‌వాలా, కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రధానమైనవి.

గుణపాఠాలు: ఈ సంవత్సరం ప్రైమరీ మార్కెట్ మదుపరులకు కొన్ని గుణపాఠాలు కూడా నేర్పింది. అవేంటంటే, ఒక కంపెనీ ఐపీఓ టైటిల్ విభాగం అద్భుతంగా సబ్‌స్క్రైబ్ అయినంత మాత్రాన ఆ ఇష్యూ లాభాలిస్తుందని చెప్పలేం. దాదాపు 29 కంపెనీల ఐపీఓలు నిరూపించాయి. జేఎస్ డబ్ల్యూ సిమెంట్, డాక్టర్ అగర్వాల్ హెల్త్‌కేర్, ఏథర్ ఎనర్జీ, వియ్‌వర్క్ ఇండియా, ఓర్కలా ఇండియా, ఫ్యుజియమా పవర్ సిస్టమ్స్ ఐపీఓలే ఇందుకు ఉదాహరణ. లిస్టింగ్ తర్వాత కొద్ది రోజుల పాటు మురిపించినా కొన్ని కంపెనీల షేర్లు మదుపరులను నిండా ముంచాయి. ప్రమోటర్లతో కుమ్మక్కై మర్చంట్ బ్యాంకర్లు అధిక ధరలు నిర్ణయించడం ఇందుకు ప్రధాన కారణం.

ఓఎఫ్ఎస్‌లే ఎక్కువ: ఈ ఏడాది ప్రైమరీ మార్కెట్ ద్వారా మదుపరుల కంటే కంపెనీల ప్రమోటర్లు, ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలే ఎక్కువగా లాభపడ్డాయి. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా తమ పెట్టుబడులను మంచి లాభాలకు ఇన్వెస్టర్లకు అంటగట్టి చక్కగా సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కంపెనీలు జారీ చేసిన ఐపీఓల ద్వారా సమీకరించిన మొత్తంలో 60 శాతానికిపైగా వీరి జేబుల్లోకే పోయిందంటే ఈ దందా ఎంత తీవ్ర స్థాయిలో నడిచిందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఓ జారీకి ముందే కొన్ని కంపెనీలు గ్రే మార్కెట్లో భారీ ప్రీమియంలతో మదుపరులను ఆకట్టుకుని మరీ వారిని ఆకర్షించే ప్రయత్నం చేశారు.

26,300 పైన బుల్లిష్

(డిసెంబరు 22-26 తేదీల మధ్య వారానికి)

అవుట్‌లుక్

గత వారం నిఫ్టీ : 25,966 (-81)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 26,056-25,727 పాయింట్ల మధ్యన కదలాడి 81 పాయింట్ల నష్టంతో 25,966 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,999, 25,818, 25,327, 24,784 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,600

నిరోధ స్థాయిలు: 26,175, 26,275, 26,375 (26,075 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,750, 25,650, 25,550 (25,850 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	670	విజయవాడ	715
వరంగల్	672	గోదావరి	690
చిత్తూరు	703	విశాఖపట్నం	702
		డజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర — వెంకాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	137	విజయవాడ	133
వరంగల్	137	గుంటూరు	138
కరీంనగర్	137	ఒంగోలు	138
మహబూబ్‌నగర్	137	చిత్తూరు	131
కర్నూలు	137	నెల్లూరు	136
విశాఖపట్నం	116		
గోదావరి	133	అనంతపురం	136

అపర కుబేరుడు ఎలాన్ మస్క్

● ప్రస్తుత సంపద విలువ రూ.67.41 లక్షల కోట్లు



న్యూయార్క్: టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సంపద రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. గత వారం ఒక్క రోజే ఈ అపర కుబేరుడి సంపద ఒక్కసారిగా 13,900 కోట్ల డాలర్లు (సుమారు రూ.12.51 లక్షల కోట్లు) పెరిగిపోయింది. దీంతో ప్రస్తుతం మస్క్ సంపద విలువ 74,900 కోట్ల డాలర్లకు (సుమారు రూ.67.41 లక్షల కోట్లు) చేరింది. ప్రపంచ చరిత్రలో ఇప్పటి వరకు మరే వ్యక్తి ఇంత భారీ సంపదను కూడబెట్టలేదు. ఎక్కడో దక్షిణాఫ్రికాలో పుట్టి పెరిగి హెచ్-1బీ వీసాపై అమెరికాలో అడుగు పెట్టి మస్క్ ఇంత భారీ సంపదను కూడబెట్టడం విశేషం.

ఎలాగంటే: టెస్లా కంపెనీ తన ఈక్విటీలో 5,600 కోట్ల డాలర్ల విలువైన షేర్లను మస్క్‌కు 2018లో స్టాక్ ఆప్షన్స్ కింద ప్రకటించింది. ఇది అన్యాయమని కొందరు డెలావర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గత ఏడాది కోర్టు దీనిపై తీర్పు ఇస్తూ, ఈ కేటాయింపు చెల్లదని తీర్పు చెప్పింది. దాంతో మస్క్.. తీర్పుపై అప్పీల్‌కు వెళ్లారు. కేసును విచారించిన డెలావర్ సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ఈ కేటాయింపు సబబే అంటూ గత శుక్రవారం తీర్పు వెలువరించింది. దీంతో ఎలాన్ మస్క్ సంపద ఒక్క రోజులోనే 13,900 కోట్ల డాలర్లు పెరిగి అతడిని అపర కుబేరుడిగా మార్చేసాయి. మరోవైపు మస్క్ నిర్వహణలోని స్పేస్‌ఎక్స్ వచ్చే ఏడాది ఐపీఓకు రానుంది. ఈ కంపెనీ ఈక్విటీలోనూ మస్క్‌కు 42 శాతం వాటా ఉంది. అప్పుడు మస్క్ సంపద మరో ఆల్‌టైమ్ రికార్డుకు చేరనుంది.

నేటి నుంచి దాచేపల్లి పబ్లిషర్స్ ఐపీఓ

ఇష్యూ ధర రూ.100-102

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న దాచేపల్లి పబ్లిషర్స్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) సోమవారం ప్రారంభం కానుంది. కంపెనీ ఈ ఐపీఓ ద్వారా రూ.40.39 కోట్లు సమీకరించనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఐదుగురు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.11.48 కోట్లు సమీకరించింది. ఇందుకోసం వీరికి 11.25 లక్షల ఈక్విటీ షేర్లను ఒక్కోటి రూ.102 చొప్పున కేటాయించినట్టు తెలిపింది. ఒక్కో షేరును రూ.100-102 శ్రేణిలో జారీ చేసే ఈ షేర్లను బీఎస్ఈ ఎంఎస్ఈ విభాగంలో కంపెనీ లిస్ట్ చేయనుంది. ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఈ నెల 24న ముగుస్తుంది. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.25 కోట్లు మూలధన అవసరాలు, రూ.6 కోట్లు రుణాల చెల్లింపు, ఇతరత్రా అవసరాలకు వినియోగించనున్నట్లు తెలిపింది. దాచేపల్లి పబ్లిషర్స్.. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ బోర్డుల పాఠ్య పుస్తకాల ముద్రణా రంగంలో ఉంది.

ఈ వారం కూడా ఆటుపోట్లలోనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రేంజ్ బౌండ్‌లోనే చలించే అవకాశం ఉంది. గ్లోబల్ మార్కెట్ల నుంచి స్పష్టమైన సంకేతాలేమీ రావటం లేదు. అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. దీంతో నిఫ్టీ ప్రస్తుత రేంజ్‌లోనే కదలాడే వీలుంది. ప్రస్తుతం రియల్టీ, మీడియా, ఎనర్జీ, చమురు రంగాల షేర్లు మెరుగ్గా ట్రేడవుతున్నాయి. ఇన్వెస్టర్లు ఎంపిక చేసిన స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

బీఈఎల్: స్వల్పకాలిక డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేరు ప్రస్తుతం నిలదొక్కుకుంటోంది. రిలేటివ్ స్ట్రెంత్ పర్వాలేదు. మూమెంటమ్ వస్తే మరింత పెరిగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.392.85 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.390 శ్రేణిలో ప్రవేశించి రూ.430 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.382 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీవీఎస్ మోటార్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేటెడ్ అవుతోంది. నిఫ్టీతో పోలిస్తే జోరును ప్రదర్శిస్తోంది. మంచి రిలేటివ్ స్ట్రెంత్‌తో దూసుకు వెళుతోంది. కప్ అండ్ సాసర్ ప్యాటర్న్ కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.3,666 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,600 శ్రేణిలో ప్రవేశించి రూ.3,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.3,550 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

దీపక్ నైట్రేట్: ఏడాదిన్నర కాలంగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో చలిస్తోంది. గరిష్ఠ స్థాయి నుంచి 52 శాతం మేర పతనమైంది. రిలేటివ్ స్ట్రెంత్ ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. టర్న్ అరౌండ్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,667 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌ల మదుపరులు రూ.1,660 స్థాయిలో ఎంటరై రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.1600 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గుజరాత్ గ్యాస్ : గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేరు 45 శాతం మేర పతనమైంది. దీర్ఘకాలిక డౌన్‌ట్రెండ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయికి చేరుకుంది. గత శుక్రవారం రూ.395.15 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.390 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.440 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.385 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కళ్యాణ్ జువెలర్స్: ఏడాది కాలంగా 45 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం కీలకమైన రూ.480 మద్దతు స్థాయికి చేరుకుంది. ఒడుదొడుకలు తగ్గాయి. గత శుక్రవారం రూ.484.85 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.480 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.530 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.470 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

తదుపరి నిరోధం 26,200

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ తొలి నాలుగు సెషన్లలో డౌన్‌ట్రెండ్‌లోనే ట్రేడయినప్పటికీ శుక్రవారం బలమైన పునరుజ్జీవంతో మానసిక అవధి 26,000 సమీపంలో ముగిసింది. ముందు వారంతో పోల్చితే 80 పాయింట్ల మేరకు నష్టపోయినా వారం గరిష్ఠ స్థాయిల్లో ముగియడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. అలాగే గత మూడు వారాలుగా పలు కరెక్షన్లకు లోనైనప్పటికీ కనిష్ఠ స్థాయి 25,800 వద్ద రికవరీ సాధించడం కూడా ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. గత కొద్ది వారాలుగా మార్కెట్ 26,000 స్థాయిలో పరిమిత పరిధిలో కదలాడుతూ సైడ్‌వేస్‌లో నడుస్తోంది. గత వారం మిడ్‌క్యాప్-100, స్మాల్ క్యాప్-100 సూచీలు సైతం బలమైన పునరుజ్జీవం సాధించాయి. ఈ వారంలో నిఫ్టీ సానుకూల ధోరణిలోనే ప్రారంభమై నిరోధ స్థాయి 26,200 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: ట్రెండ్‌లో సానుకూలత కోసం నిఫ్టీ నిరోధ స్థాయి 26,200 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ఇదే గత వారం ఏర్పడిన గరిష్ఠ స్థాయి. ఆ పైన నిరోధ స్థాయిలు 26,350/26,550.

బేరిష్ స్థాయిలు: మానసిక అవధి 26,000 వద్ద విఫలమైతే మరింత బలహీనత ముప్పు ఎదుర్కొంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,700. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేక పోతే స్వల్పకాలిక బలహీనతగా భావించి స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయి 25,450.

బ్యాంక్ నిఫ్టీ: సానుకూల ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే ఈ సూచీ మైనర్ నిరోధం 59,400 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 60,100. ఇదే జీవితకాల గరిష్ఠ స్థాయి. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. రియాక్షన్‌లో పడి మద్దతు స్థాయి 58,700 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: గత కొద్ది రోజులుగా మార్కెట్ పాజిటివ్ కన్సాలిడేషన్ సాధించింది. వీక్లీ చార్టుల్లో 25,800 వద్ద పలు బాటమ్‌లు ఏర్పడ్డాయి. మరింత అప్‌ట్రెండ్ కోసం 26,200 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ఇక్కడ ఏర్పడి డబుల్ బాటమ్ పాటర్న్‌ను కూడా బ్రేక్ చేయాలి. 25,700 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్ లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతగా భావించాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,155, 26,200
మద్దతు	26,000, 25,940

స్పోర్ట్స్

మన కుర్రాళ్ల ఫ్లాప్ షో


నిరాశలో భారత కెప్టెన్ ఆయుష్



● వైభవ్ విఫలం
● అండర్-19 ఆసియా కప్ విజేత పాకిస్థాన్
● సమీర్ అదిరే శతకం

దుబాయ్: ఓటమనేదే లేకుండా ఫైనల్ చేరిన యువ భారత్.. కీలక పోరులో ఘోరంగా విఫలమైంది. ఆదివారం ఏకపక్షంగా జరిగిన అండర్-19 ఆసియా కప్ టైటిల్ ఫైట్‌లో 191 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ చేతిలో చిత్తయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 347 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్ (113 బంతుల్లో 172) శతకంతో విరుచుకుపడడంతో భారత బౌలర్లకు దిక్కుతోచలేదు. అహ్మద్ హుస్సేన్ (56) హాఫ్ సెంచరీ చేశాడు. దీపేష్ దేవేంద్రన్ మూడు వికెట్లు పడగొట్టగా.. హనిల్, ఖిలన్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. అనంతరం ఛేదనలో భారత్ 26.2 ఓవర్లలో 156 పరుగులకు కుప్పకూలింది. దీపేష్ (36) టాప్ స్కోరర్. భారీ ఛేదనలో భారత్ టపటపా వికెట్లు చేజార్చుకొంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (2), వైభవ్ సూర్యవంశీ (26)ని అలీ రెజా పెవిలియన్ చేర్చడంతో.. భారత్ ఏ దశలోనూ ఛేదించే విధంగా కనిపించలేదు. పాక్ పేసర్ల షార్ట్ పిచ్ బంతులకు మనోళ్ల వద్ద సమాధానమే లేకపోయింది. అలీ రెజా నాలుగు వికెట్లు పడగొట్టగా.. సుభాన్, ఎహ్‌సాన్, సయ్యమ్ తలో రెండు వికెట్లు సొంతం చేసుకొన్నారు. పాక్ ఆటగాళ్లతో 'నో హ్యాండ్ షేక్' పాలసీని మన క్రికెటర్లు ఈ మ్యాచ్‌లో కూడా పాటించారు.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 50 ఓవర్లలో 347/8 (సమీర్ మిన్హాస్ 172, అహ్మద్ హుస్సేన్ 56; దీపేష్ 3/83, ఖిలన్ పటేల్ 2/44).

భారత్: 26.2 ఓవర్లలో 156 ఆలౌట్ (దీపేష్ 36, వైభవ్ సూర్యవంశి 26; అలీ రెజా 4/42, ఎహ్‌సాన్ 2/12).

కాలి దుమ్ముతో సమానం



ధాటిగా ఆడే క్రమంలో వైభవ్ వికెట్ పారేసుకొన్నాడు. అతడు అవుటై తిరిగి వెళ్తున్న సమయంలో పాక్ బౌలర్ అలీ రెజా సంబరాలు సూర్యవంశీకి ఆగ్రహం తెప్పించాయి. దీంతో వెనక్కితిరిగి నోటికి పనిచెప్పిన వైభవ్.. నువ్వు నా బూటుకు అంటిన దుమ్ముతో సమానం అన్నట్టుగా వేలు చూపిస్తూ సంజ్ఞ చేశాడు. అంతకుముందు భారత కెప్టెన్ ఆయుష్ అవుటై వెళ్తున్నప్పుడు కూడా అలీ రెజా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించాడు. దీంతో డగౌట్‌కు వెళ్తున్న ఆయుష్ ఆగ్రహంతో వెనక్కి వచ్చి ఏదో అన్నాడు.

ట్రోఫీని బహూకరించిన నఖ్వీ

ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్, పాకిస్థాన్ మంత్రి అయిన మొహిసిన్ నఖ్వీ విజేతలకు పతకాలు, ట్రోఫీని ప్రదానం చేశారు. అయితే, భారత్‌కు చెందిన ప్రతినిధులు ఎవరూ ఈ కార్యక్రమంలో కనిపించలేదు. రన్నరప్ చెక్‌ను అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మిర్వాసి అష్రఫ్ చేతుల మీదుగా భారత కెప్టెన్ ఆయుష్ అందుకొన్నాడు. కాగా, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. నఖ్వీ నుంచి భారత సీనియర్ జట్టు ఆసియా కప్‌ను అందుకొనేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే.

జెమీమా జోరు

భారత్ శుభారంభం

తొలి టీ20లో శ్రీలంకపై ఘనవిజయం


జెమీమా (69 నాటౌట్)


మంధాన (25)

విశాఖపట్నం: వన్డే వరల్డ్‌కప్ గెలిచాక తొలిసారి బరిలోకి దిగిన భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. శ్రీలంకతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో బౌలర్లు విశేషంగా రాణించగా, జెమీమా రోడ్రిగ్స్ (44 బంతుల్లో 10 ఫోర్లతో 69 నాటౌట్) తన ఫామ్‌ను కొనసాగించింది. దీంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో నెగ్గి, సిరీస్‌లో 1-0తో బోణీ చేసింది. రెండో టీ20 కూడా మంగళవారం విశాఖలోనే జరుగుతుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్లకు 121 పరుగులు చేసింది. ఓపెనర్ విష్మి గుణరత్నె (39), హర్షిత (21), హాసిని (20) మాత్రమే రాణించారు. భారత బౌలర్లు ఆరంభం నుంచే లంక బ్యాటర్లను కట్టడి చేయడమే కాకుండా వరుస విరామాల్లో వికెట్లను తీయగలిగారు. దీంతో అతికష్టమ్మీద లంక వంద పరుగులు దాటగలిగింది. అయితే భారత ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లు వదిలేసి నిరాశపర్చారు. మూడో వికెట్‌కు విష్మి-హర్షిత మధ్య అత్యధికంగా 38 పరుగులు జత చేరాయి. స్పిన్నర్లు దీప్తి, శ్రీచరణి పేసర్ క్రాంతిలకు ఒక్కో వికెట్ దక్కింది. ఆ తర్వాత ఛేదనలో భారత్ 14.4 ఓవర్లలో 122/2 స్కోరుతో ఘనవిజయం సాధించింది. స్మృతి మంధాన (25), హర్మన్‌ప్రీత్ (15 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జెమీమా నిలువగా, భారత్‌కు చెందిన 20 ఏళ్ల ఆల్‌రౌండర్ వైష్ణవి శర్మ ఈ మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేసింది.

సునాయాసంగా..

స్వల్ప ఛేదనలో భారత మహిళలు ఏ దశలోనూ ఇబ్బందిపడలేదు. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ షఫాలీ (9) వెనుదిరిగినా.. మరో ఓపెనర్ స్మృతి మంధాన-జెమీమా జోడీ వేగం కనబర్చింది. ఆరో ఓవర్‌లో జెమీమా రెండు, మంధాన ఓ ఫోర్‌తో 16 రన్స్ రాగా పవర్‌ప్లేలో జట్టు 55/1 స్కోరుతో నిలిచింది. అయితే బంతికో పరుగు చొప్పున సాధించిన మంధాన తొమ్మిదో ఓవర్‌లో వెనుదిరగడం రెండో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు రోడ్రిగ్స్ మాత్రం జోరును కొనసాగిస్తూ 12వ ఓవర్‌లో నాలుగు ఫోర్లతో 34 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. ఈ ధాటితో మూడో వికెట్‌కు హర్మన్‌తో కలిసి అజేయంగా 55 పరుగులు సమకూర్చి, మరో 32 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 121/6 (విష్మి గుణరత్నె 39, హర్షిత 21, హాసిని 20; దీప్తి శర్మ 1/20, క్రాంతి 1/23, శ్రీచరణి 1/30).

భారత్: 14.4 ఓవర్లలో 122/2 (జెమీమా 69 నాటౌట్, మంధాన 25, హర్మన్ 15 నాటౌట్; ఇనోక 1/17, కావ్య 1/20).

2 మహిళల టీ20ల్లో 4వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా స్మృతి మంధాన. న్యూజిలాండ్ క్రికెటర్ సుజీ బేట్స్ (4716) టాప్‌లో ఉంది.


వెండీస్ లక్ష్యం 462

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ 306/2 డిక్లేర్

మౌంట్ మాంగనుయ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ విజయంపై కన్నేసింది. కెప్టెన్ లేథమ్ (101), కాన్వే (100) మరోసారి శతక జోరుతో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 306/2 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దీంతో విండీస్ ముందు 461 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఓపెనర్లు కాన్వే డబుల్, లేథమ్ సెంచరీ చేయడం విశేషం. అలాగే తొలి వికెట్‌కు ఈ జోడీ 192 పరుగులు అందించింది. అటు నాలుగో రోజు ఆట ముగిసే సరికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 43/0 స్కోరుతో ఉంది. క్రీజులో కింగ్ (37), కాంప్‌బెల్ (2) ఉన్నారు. ఆటకు సోమవారం ఆఖరి రోజు కావడంతో విండీస్ విజయానికి 419 రన్స్ దూరంలో ఉంది. అంతకుముందు విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 420 రన్స్‌కు ఆలౌటైంది. దీంతో కివీస్‌కు 155 పరుగుల ఆధిక్యం లభించింది. హాడ్జ్ (123 నాటౌట్) అజేయ శతకం సాధించగా.. డఫీకి 4, ఎజాజ్‌కు 3, మైకేల్‌కు 2 వికెట్లు దక్కాయి.

అన్.. అదిరెన్!

● కొరియా షట్లర్‌దే వరల్డ్ టూర్ ఫైనల్స్ ట్రోఫీ
● సీజన్‌లో 11వ టైటిల్ కైవసం
● ఈ ఏడాది అత్యధిక ప్రైజ్‌మనీతో చరిత్ర



హాంగ్జౌ (చైనా): ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల నెంబర్‌వన్, దక్షిణ కొరియాకు చెందిన అన్ సే యంగ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం ఇక్కడ జరిగిన తుదిపోరులో అన్ 21-13, 18-21, 21-10తో వాంగ్ జి యి (చైనా)ని ఓడించింది. అన్‌కిది ఈ సీజన్‌లో రికార్డుస్థాయిలో 11వ టైటిల్. ఈ టోర్నీకి ముందు ఈ ఏడాది పది టైటిళ్లతో 7,63,175 యూఎస్ డాలర్ల ప్రైజ్‌మనీ గెలిచిన అన్.. వరల్డ్ టూర్ ఫైనల్స్ ట్రోఫీతో మరో 2,40,000 యూఎస్ డాలర్లను అందుకుంది. దీంతో ఒక్క ఏడాదిలో ఓవరాల్‌గా మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీని ఖాతాలో వేసుకున్న తొలి బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించింది. ఇక పురుషుల సింగిల్స్ టైటిల్‌ను క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) నెగ్గాడు.

ఫైనల్ రౌండ్‌కు తమిళనాడు

ఎట్టకేలకు ఏపీ జట్టు గెలుపు

సంతోష్ ట్రోఫీ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తమిళనాడు జట్టు ఫైనల్ రౌండ్‌కి అర్హత సాధించింది. ఇక్కడి ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ గ్రూపు దశ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 1-0తో అండమాన్ నికోబార్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో తమిళనాడు 3-0తో పుదుచ్చేరిని ఓడించింది. దీంతో 9 పాయింట్లతో తమిళనాడు గ్రూప్ టాపర్‌గా నిలిచింది. 35 జట్లు గ్రూపులుగా విడిపోయి తలపడుతున్న ఈ టోర్నీలో గ్రూపు టాపర్‌గా నిలిచిన 9 జట్లు తుది రౌండ్ చేరాయి. ఈ జట్లతోపాటు ఆతిథ్య అసోం, గతేడాది విజేత పశ్చిమ బెంగాల్, రన్నరప్ కేరళ సహా మొత్తం 12 జట్లు ఆఖరి రౌండ్‌తో తలపడతాయి.

ఆసీస్‌దే యాషెస్

మూడో టెస్టులోనూ విజయం

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 352



అడిలైడ్: ఇంగ్లండ్‌తో మరో రెండు టెస్టులు మిగిలి ఉండగానే ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు యాషెస్ సిరీస్‌ను నిలబెట్టుకొంది. ఆదివారం ముగిసిన మూడో టెస్టులో కంగారూలు 82 పరుగుల తేడాతో నెగ్గారు. దీంతో 3-0తో సిరీస్ వశం చేసుకున్నారు. 435 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగిన స్టోక్స్ సేన తమ రెండో ఇన్నింగ్స్‌లో 352 పరుగులకు ఆలౌటైంది. అయితే జేమీ స్మిత్ (60), విల్ జాక్స్ (47) ఏడో వికెట్‌కు 91 పరుగులు, కార్స్ (39 నాటౌట్)తో కలిసి జాక్స్ ఎనిమిదో వికెట్‌కు 52 పరుగులు జత చేసి ఆసీస్ గెలుపును కాస్త ఆలస్యం చేశారు. కమిన్స్, స్టార్క్, లియాన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 371, ఇంగ్లండ్ 286 పరుగులు చేయగా.. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 349 పరుగులకు ఆలౌటైంది.

భారత్‌ను అనుసరిస్తున్నా: అకిబ్ జావేద్

దుబాయ్: దేశంలో క్రికెట్ అభివృద్ధి కోసం భారత్ అనుసరిస్తున్న విధానాలను అమలు చేస్తున్నానని పాకిస్థాన్ సీనియర్ సెలెక్టర్, జాతీయ క్రికెట్ అకాడమీ చీఫ్ అకిబ్ జావేద్ చెప్పాడు. 'నాణ్యమైన ప్రతిభపైనే జట్టు విజయాలు ఆధారపడి ఉంటాయి. తగిన మౌలిక సదుపాయాలతోపాటు బలమైన బెంచ్‌ను తయారు చేసుకోవాల'ని జావేద్ చెప్పాడు.



చిన్నారుల భవితకు దిక్సూచి



స్కూలు ఫీజు కట్టలేక అవమానాలు పడ్డారు. పట్టుదలతో చదివి ఆర్కిటెక్ట్ అయ్యారు. జీవితానికి అర్థం వెతుకుతూ దేశమంతా తిరిగారు. 'తోటివారికి సాయం చెయ్యడమే జీవిత పరమార్థం' అని తెలుసుకున్నారు. ఇప్పుడు వేలాదిమంది పిల్లల భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తున్నారు. ఒడిశాకు చెందిన శ్వేతా అగర్వాల్ ప్రయాణం ఇది.

"అప్పుడు నేను ఏడో తరగతి చదువుతున్నాను. మా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. నా స్కూలు ఫీజు కట్టకపోవడంతో తరగతిలోకి రానివ్వలేదు. తోటి పిల్లల నుంచి అవమానం, ఎగతాళి ఎదుర్కొన్నాను. 'ఆర్థిక సమస్యల వల్ల పిల్లల భవిష్యత్తు నాశనం కాకూడదు' అనే నా నిశ్చయానికి బీజం అప్పుడే పడింది" అంటారు శ్వేతా అగర్వాల్. ఆర్కిటెక్ట్ కావాలన్నది ఆమె చిన్ననాటి కల. ఇంట్లో పరిస్థితులు ఎలా ఉన్నా... చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చెయ్యలేదు. ఎన్నో ఇబ్బందులు పడినా... పట్టుదలతో చదివారు, అనుకున్నది సాధించారు. అగ్రశ్రేణి కంపెనీల్లో పని చేశారు. పెద్ద ఆసుపత్రులను డిజైన్ చేశారు. "ఆసుపత్రుల్లో రోగుల్ని చూసినప్పుడు 'ఇంత మంది ఎందుకు అనారోగ్యం పాలవుతున్నారు? సైన్స్ ఇంత పురోగతి సాధించినా రోగాలు ఇంతగా ఎందుకు పెరుగుతున్నాయి?'... ఇలాంటి ప్రశ్నలు నన్ను వేధించేవి. మరోవైపు నాలో ఏదో వెలితి. వృత్తిపరమైన విజయాన్ని ఆస్వాదించలేకపోతున్నానని గ్రహించాను" అని గుర్తు చేసుకున్నారు శ్వేత.



జీవిత పాఠాలెన్నో నేర్చుకున్నా...

ఆ తరువాత ఆమె ఉద్యోగాన్ని వదిలేసి... వివిధ ప్రాంతాల్ని సందర్శించడం ప్రారంభించారు. "మన దేశంలో ఎన్నో ప్రదేశాలు చూశాను. నేపాల్ కూడా వెళ్ళాను. ట్రక్కుల్లో ప్రయాణం, రైతుల ఇళ్ళలో బస... ఇలా గొప్ప అనుభూతులు అనేకం ఉన్నాయి. అప్పుడే ఫొటోగ్రాఫర్‌గా మారాను. ఆ సంచారం నాకు జీవిత పాఠాలు ఎన్నో నేర్పింది. రకరకాల మనుషులను చూసిన తరువాత... పేదరికం, వ్యాధులు, హింస, పర్యావరణ సంక్షోభం... ఈ సమస్యలన్నిటికీ మూలకారణాలు... ఆరోగ్యవంతమైన, నాణ్యమైన విద్య లేకపోవడమేనని గ్రహించాను" అని చెప్పారు శ్వేత. తన యాత్రను ముగించుకొని భువనేశ్వర్‌కు తిరిగి వచ్చిన ఆమె... 'టీచ్ ఫర్ ఇండియా'లో భాగమైన 'టీఎఫ్ఐఎక్స్' కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడే తను పయనించాల్సిన మార్గం ఆమెకు స్పష్టమయింది. పిల్లల కోసం అంకితభావంతో పని చేస్తున్న యువతను చూశాక... సమాజంలో మార్పు వస్తుందనే నమ్మకం కలిగింది. 2017లో 'ఉన్ముక్త్ ఫౌండేషన్' అనే సంస్థ ఏర్పాటుకు ప్రేరణ ఇచ్చింది.

చేయాల్సింది చాలా ఉంది...

సామాజిక సేవపై ఆసక్తి ఉన్న యువత ఆ సంస్థలో వాలంటీర్లుగా చేరారు. పేద, గ్రామీణ పిల్లల కోసం 'ఫ్రీడమ్ ఫెలోషిప్' పేరిట రెండేళ్ళ కార్యక్రమానికి శ్వేత రూపకల్పన చేశారు. దీనిలో భాగంగా వాలంటీర్లు పాఠశాలలకు, సామాజిక కేంద్రాలకు వెళ్తారు. పిల్లల్లో శారీరకంగా, మానసికంగా, విద్యాపరంగా ఎదుగుదలకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారిలో సృజనాత్మకత, పర్యావరణ స్పృహ, నాయకత్వ లక్షణాలు పెరగడానికి దోహదం చేస్తారు. "విద్య అనేది కేవలం మెదడుకు సంబంధించినది కాదు, అది శరీరానికి, ఆత్మకు కూడా సంబంధించింది. అందుకే కళలు, సామాజిక విలువలు, సహానుభూతి లాంటి అంశాలను కూడా పిల్లలకు నేర్పిస్తున్నాం. ఇప్పటివరకూ కొన్ని వేలమంది 'ఉన్ముక్త్' ద్వారా ప్రయోజనం పొందారు. ఈ కృషికి గుర్తింపుగా అవార్డులు కూడా అందుకున్నాను. అయితే చేసినదానితో సంతృప్తి పడడం లేదు. చేయాల్సింది ఇంకా చాలా ఉంది" అని చెబుతున్నారు శ్వేత.

మట్టిలో మాణిక్యాలు

ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే... పరిమితులు ఎన్ని ఉన్నా అద్భుతాలు చేయవచ్చని నిరూపించారు ఎం.యశస్విని, ఎస్.సింధు.

చిత్తూరు జిల్లాకు చెందిన ఈ తొమ్మిదో తరగతి విద్యార్థినులు... మహిళల భద్రత కోసం ఒక పరికరాన్ని రూపొందించారు.

అదే 'ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్ బైక్స్'. వారి ఆవిష్కరణ ఇటీవల జాతీయ స్థాయిలో ప్రత్యేక బహుమతి గెలుచుకోవడంతో పాటు సర్వత్రా అభినందనలు అందుకుంటోంది.

ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ, చున్నీలు, చీరలు వెనుక చక్రంలో చుట్టుకుపోవడం వల్ల మహిళలు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనల గురించి వింటూనే ఉంటాం. ఈ ప్రమాదాలు తీవ్రంగా గాయపడడానికి, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడానికి దారి తీస్తాయి. ఇలాంటి సంఘటనల నుంచి మహిళలకు భద్రత కల్పించే పరికరం.. ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్ బైక్స్. దీన్ని తయారు చేసింది నిష్ణాతులైన ఆవిష్కర్తలు కాదు. ఒక సాధారణమైన పల్లెటూరుకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం.యశస్విని, ఎస్.సింధు. మట్టిలో మాణిక్యాల్లాంటి వీరిద్దరూ చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం రెడ్లపల్లె గ్రామానికి చెందినవారు. ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న ఈ బాలికలవి వ్యవసాయం జీవనాధారమైన కుటుంబాలు. మొన్నటివరకూ సాధారణమైన విద్యార్థినులైన యశస్విని, సింధుల ఆవిష్కరణ ఇప్పుడు ప్రశంసలు అందుకోవడంతోపాటు ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

వెయ్యికి పైగా ఆవిష్కరణలతో పోటీపడి...

ఈ ఏడాది జూన్ నెలలో రెడ్లపల్లె జెడ్పి హైస్కూల్‌కు ఎం.జి.శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. గతంలో పనిచేసిన పాఠశాలల్లో... విద్యార్థులతో సైన్స్ ప్రాజెక్టులు తయారు చేయించి, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయాలు సాధించడానికి దోహదపడిన అనుభవం ఆయనకు ఉంది. యశస్విని, సింధులలో నిగూఢంగా దాగిఉన్న ప్రతిభను ఆయన గుర్తించారు. అదే సమయంలో... అన్ని రాష్ట్రాల నుంచి సైన్స్ ప్రాజెక్టులను ఆహ్వానిస్తూ... జాతీయస్థాయి 'గీతా యంగ్ సైంటిస్ట్ ఆవిష్కార్ అవార్డ్స్' (జివైఎస్ ఆవిష్కార్) ప్రకటన వెలువడింది. ఆ అవార్డుల గురించి యశస్వినికి, సింధుకు శ్రీనివాస్ వివరించి, వారిని ప్రోత్సహించారు. ఆ బాలికలు కూడా ఉత్సాహంగా ముందుకువచ్చారు. దాని ఫలితమే... 'ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్ బైక్స్'. హెచ్ఎం శ్రీనివాస్ పర్యవేక్షణలో వారు తయారు చేసిన ఆ పరికరం... చిత్తూరు జిల్లా స్థాయి పోటీ నుంచి... జివైఎస్ ఆవిష్కార్ అవార్డుల కోసం జాతీయ స్థాయికి ఎంపికయింది. ఈ ఏడాది అక్టోబర్ 29న ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు ఆ బాలికలకు ఆహ్వానం అందింది. దానిలో 26 రాష్ట్రాలకు చెందిన 1,000కి పైగా ఆవిష్కరణలను ప్రదర్శించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతోపాటు... 25 మంది ఆవిష్కరణలను ప్రత్యేకంగా ఎంపిక చేసి, మెరిట్ సర్టిఫికెట్లను, ట్రోఫీలను, రూ.1.30 లక్షల నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. యశస్విని, సింధుల ఆవిష్కరణకు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందిస్తున్నారు. పల్లె ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో సృజనాత్మకను ప్రోత్సహిస్తే... తోటి విద్యార్థుల్లో, ప్రధానంగా బాలికలలో ప్రేరణకు, చైతన్యానికి దోహదపడుతుందనడంలో సందేహం లేదు.

• చిట్టత్తూరు మునిగోపాల్, కుప్పం



ఎలా పని చేస్తుందంటే...

'ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్' సెన్సర్ ఆధారంగా పని చేస్తుంది. ఈ పరికరాన్ని ద్విచక్ర వాహనం సీటుకింద... ఎడమ భాగంలో అమర్చుకోవాలి. అది వాహనం హ్యాండిల్‌కు ఏర్పాటు చేసిన బల్బుకు అనుసంధానమై ఉంటుంది. చున్నీ లేదా చీరకొంగు వాహనం చక్రంలో ఇరుక్కోగానే... ఆ పరికరం నుంచి సైరన్ మోత వినిపిస్తుంది. అలాగే హ్యాండిల్‌కు అమర్చిన బల్బు వెలుగుతుంది. ఆ సంకేతాలను గమనించగానే... వాహనాన్ని నడుపుతున్న, దానిపై ప్రయాణిస్తున్న మహిళలు అప్రమత్తమై, వాహనాన్ని ఆపి, ప్రమాదం నుంచి బయట పడవచ్చు.



రంపచోడవరంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న భువనేశ్వరి



కాకినాడలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి పోలియో చుక్కలు వేస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

» పోలియో సమూల నిర్మూలనే ధ్యేయం: సత్యకుమార్

కాకినాడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కాకినాడ రామారావుపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. పోలియో మహమ్మారిని సమూలంగా నిర్మూలించడమే ధ్యేయమని స్పష్టంచేశారు. ఈనెల 23, 24 తేదీల్లో సంచార జాతులు నివసించే ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలు, ఇతర వలస ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేసేందుకు 1,854 మొబైల్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అరాచక శక్తులు, వినాశనం కోరుకున్న వారు, విధ్వంసం సృష్టించిన వారికి యోగి ఆదిత్యనాథ్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను సత్యకుమార్ సమర్థించారు. ఆయన చెప్పినట్టు ఏపీలో కొందరికి ఆ ట్రీట్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

40 లక్షల మందికి పోలియో చుక్కలు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 40 లక్షల మంది ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 54.07 లక్షల మంది చిన్నారులకు చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. అందులో తొలిరోజు ఆదివారం 40 లక్షల మంది (74 శాతం) టార్గెట్ పూర్తయింది. సోమవారం, మంగళవారాల్లో మొబైల్ బృందాలు ఇంటింటికీ వెళ్లి మిగిలిన వారికి పోలియో చుక్కలు వేయనున్నారు.

విద్యుత్ హ్యాకథాన్ విజేతలకు పైలట్ ప్రాజెక్టులు

» ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన 'ఎలక్ట్రాన్ ఫైబ్-హ్యాక్‌ఏపీ హ్యాకథాన్' ఫలితాలను ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ ప్రకటించారు. విజేతలుగా నిలిచిన తొమ్మిది స్టార్టప్‌లకు ఏపీ ట్రాన్స్‌కోలో పైలట్ ప్రాజెక్టులు కేటాయించినట్టు చెప్పారు. స్టార్టప్‌లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో హ్యాకథాన్-2025 కోసం ఈ ఏడాది అక్టోబరులో దరఖాస్తులు ఆహ్వానించగా 45 ఔత్సాహిక స్టార్టప్‌లు పాల్గొన్నాయన్నారు. వాటిలో తుది జాబితాకు ఎంపికైన 9 స్టార్టప్‌లు తమ పరిష్కారాలను విద్యుత్ రంగ నిపుణుల జ్యూరీ సమక్షంలో ప్రదర్శించాయని తెలిపారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

26లోపు 'జీ రామ్ జీ'పై ప్రత్యేక గ్రామసభలు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం స్థానంలో తెచ్చిన వికసిత్ భారత్- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) పథకంపై అవగాహన కల్పిస్తూ గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేయాలని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శితో పాటు అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లేఖలు రాసింది. ఈ నెల 26లోపు గ్రామ సభలు నిర్వహించి జీ రామ్ జీ పథకంపై సంపూర్ణ అవగాహన కల్పించాలని కోరింది.

జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం

» వైసీపీ అధినేత పుట్టినరోజున జంతుబలి!

» అనంతలో ఆ పార్టీ కార్యకర్తల అరాచకం

» ప్రకాశం జిల్లాలో రప్పా రప్పా ఫ్లెక్సీ





అనంతపురం జిల్లా బొమ్మగానిపల్లిలో మూగజీవాల రక్తంతో జగన్ ఫ్లెక్సీకి అభిషేకం చేసిన వైసీపీ కార్యకర్తలు, శ్రీసత్యసాయి జిల్లా భానుకోటలో జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేస్తున్న వైసీపీ నేత (ఇన్‌సెట్)

విడపనకల్లు/బ్రహ్మసముద్ర/కనగానపల్లి/వెలిగండ్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'రప్పా.. రప్పా..', 'గంగమ్మ జాతర' అంటూ రచ్చ చేస్తున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు.. విపక్షంలో ఉండగానే అరాచకం సృష్టిస్తున్నారు. తమ పార్టీ అధినేత పుట్టిన రోజు నాడు మూగజీవాలను బలి ఇచ్చి వాటి రక్తంతో జగన్ ఫ్లెక్సీలకు అభిషేకాలు చేశారు. రోడ్లపై కేకలు వేస్తూ, నృత్యాలు చేశారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా '2029లో రప్పా, రప్పా' అంటూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆదివారం పలుచోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లిలో వైసీపీ మద్దతు సర్పంచ్ ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఐదు గొర్రెలను నరికి, వాటి రక్తంతో జగన్ ఫ్లెక్సీని అభిషేకించారు. విడపనకల్లు మండల కేంద్రంలోనూ అదే తంతు కొనసాగింది. ఇక శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోట గ్రామంలో వైసీపీ మద్దతు సర్పంచ్ బాలరాజు, నాయకులు కలసి మూగజీవాల తలలు నరికి, ఆ రక్తంతో జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేశారు. ఈ ఘటనతో ఫ్యాక్షన్ గ్రామమైన భానుకోటలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు జగన్ పుట్టినరోజు సందర్భంగా ప్రకాశం జిల్లా పందువ నాగులారం పంచాయతీ పరిధిలోని గుమ్మలకర్ర జంక్షన్‌లో వైసీపీ అభిమాని ఒకరు వివాదాస్పద రాతలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. '2029లో రప్పరప్ప.. 88 మ్యాజిక్ ఫిగర్ దాటినప్పటి నుంచి గంగమ్మ జాతరే' అని ముద్రించారు. గుమ్మలకర్ర గ్రామానికి చెందిన మన్నెపల్లి దినేష్ ఈ వివాదాస్పద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిపై టీడీపీ శ్రేణులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ ఫ్లెక్సీని తొలగించి దినేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.



జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు

జగన్‌కు బాబు, పవన్, షర్మిల శుభాకాంక్షలు

» థాంక్యూ అమ్మా.. షర్మిలకు జగన్ రీపోస్ట్

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జగన్ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కూడా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జగన్‌కు సంపూర్ణ ఆరోగ్యం, సుఖ సంతోషాలు అందించాలని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్'లో పవన్, లోకేశ్ పేర్కొన్నారు. 'భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని షర్మిల పేర్కొనగా.. 'థాంక్యూ ఫర్ ద విషెస్ అమ్మా' అంటూ జగన్ రిప్లై ఇచ్చారు. చంద్రబాబు, పవన్, లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా న్యాయవ్యవస్థ అత్యంత కీలకం

» న్యాయం కోసం అందరూ మొదట అక్కడికే వెళ్తారు

» సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



సదస్సులో ప్రసంగిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో జిల్లా జ్యుడీషియరీ వ్యవస్థ మూల స్థంభం అని, ప్రతి వ్యక్తి మొదటగా జిల్లా న్యాయ వ్యవస్థ వద్దకే వస్తారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని జ్యుడీషియల్ అకాడమీలో నిర్వహించిన 'రాజ్యాంగ దృక్కోణం-జిల్లా న్యాయ వ్యవస్థ పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కీలక ఉపన్యాసం చేశారు. రాజ్యాంగంలో జిల్లా న్యాయ వ్యవస్థకు ఉత్తమ స్థానం కల్పించారని పేర్కొన్నారు. ఉత్తమ న్యాయం అందించడమే న్యాయవ్యవస్థ ప్రధాన విధిగా గుర్తించాలని సూచించారు. కోర్టుల్లో జరిగే విచారణ సామాన్యుడికి సైతం అర్థం కావాలని, అప్పుడే న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం, నమ్మకం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. తీర్పులు ఇవ్వడం ఒక్కటే న్యాయ వ్యవస్థ ప్రక్రియ కాదని, ఆ తీర్పులో నిబద్ధత ఉండాలని అన్నారు. న్యాయం అనేది మానవతా దృక్పథంపై ఆధారపడి ఉంటుందన్నారు.

రాజీలేని న్యాయ వ్యవస్థను నిర్వహించాలి: జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ పాట్రన్ ఆఫ్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జీవించే హక్కు కలిగి ఉండడం అంటే.. వ్యక్తి జీవించడం ఒక్కటే కాదని, మంచి జీవనాన్ని గడిపే హక్కు కలిగి ఉండటమని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ పనితీరులో ఏమాత్రం అశ్రద్ధ ఉన్నా ఆర్టికల్ 14, 15 ప్రకారం న్యాయాన్ని సక్రమంగా వెలువరించడం సాధ్యం కాదని చెప్పారు. రాజీలేని న్యాయ వ్యవస్థను నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు.

పౌర హక్కులకు రక్షణ కల్పించాలి: జస్టిస్ రవినాథ్ తిల్హారి

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జ్యుడీషియల్ అకాడమీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు జస్టిస్ రవినాథ్ తిల్హారి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి వ్యక్తికి పౌర హక్కులు ఇచ్చిందని, వీటికి జిల్లా న్యాయవ్యవస్థ పటిష్ట రక్షణ కల్పించాలన్నారు. మహిళలు, చిన్నారులపై వచ్చే వివాదాలు చాలావరకు సున్నితమైనవని, వాటిని సరైన ప్రక్రియ ద్వారా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తులు, వివిధ జిల్లాల న్యాయాధికారులు పాల్గొన్నారు.

నేడు జనసేన 'పదవి-బాధ్యత' కార్యక్రమం

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో జనసేన పక్షాన నామినేటెడ్ పదవులు పొందిన వారితో 'పదవి-బాధ్యత' కార్యక్రమంలో భాగంగా పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం భేటీ కానున్నారు. మంగళగిరిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం గురించి మంత్రి మనోహర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లకు వివరించారు. దాదాపు 3వేల మందితో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో నామినేటెడ్ పదవులు పొందిన వారందరికీ పవన్ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

కోడిగుడ్డు కొత్త రికార్డు.. అనపర్తి, తణుకులో హోల్‌సేల్ ధర 7.15

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధర రికార్డు స్థాయిలో మరింత పెరిగింది. సోమవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో హోల్‌సేల్‌గా ఒక గుడ్డు ధరను అత్యధికంగా రూ.7.15గా నిర్ణయించారు. అదే విశాఖ మార్కెట్‌లో రూ.7.02, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రూ.7.06గా నిర్ణయించారు. రాష్ట్రంలో మిగిలిన మార్కెట్లు చూస్తే.. ధర విజయవాడలో రూ.6.90, చిత్తూరులో రూ.6.93కి చేరింది. ఇది పౌల్ట్రీ పరిశ్రమలో సరికొత్త రికార్డుగా చెబుతున్నారు. ఆదివారం విశాఖలో రిటైల్‌గా ఒక గుడ్డును రూ.ఏడున్నర నుంచి రూ.8 వరకు విక్రయించారు.

దేవదేవుడి కోర్టు నుంచి తప్పించుకోలేరు: లోకేశ్

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'పరకామణిలో చోరీపై జగన్ స్పందన.. ఆయన దోపిడీ స్థాయిని వెల్లడిస్తోంది. జనం సొమ్ము లక్షల కోట్లు దోచుకున్న జగన్‌కు పరకామణి చోరీ చిన్నదే కావొచ్చు. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ఈ చోరీ మహాపాపం' అని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. సాక్ష్యాధారాల్లేకుండా చేసి తప్పించుకోడానికి ఇది బాబాయి కేసో.. కోడి కత్తి కేసో కాదని, కలియుగ ప్రత్యక్ష దైవం వెంకన్నకు చేసిన మహా అపచారమని, ఆ దేవదేవుడి కోర్టు నుంచి తప్పించుకోవడం అసాధ్యమని ట్వీట్ చేశారు.

బ్రాహ్మణికి లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు

కష్టనష్టాల్లో వెన్నంటి నిలిచిన తన సతీమణి బ్రాహ్మణికి మంత్రి లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'దేవాంశ్‌కు తల్లిగా.. రాక్‌స్టార్ సీఈవోగా నీవు నాతో కలిసి నడిచిన ప్రతి అడుగూ ఓ అద్భుతం' అని లోకేశ్ పేర్కొన్నారు.



మంగళగిరి ప్రీమియర్ లీగ్-4 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నారా బ్రాహ్మణి

కోడికి రాజ యోగం..!



(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలి. రోగాలు దరిచేరకుండా మందులు, షాంపూలతో స్నానాలు, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక విధంగా చెప్పాలంటే ఈ పందెం కోళ్లకు ఏడాదిపాటు రాజయోగమే..! అయితే ఇవన్నీ సంక్రాంతి ముందురోజు వరకే. బరిలోకి దిగే రోజు వచ్చేసరికి ఎంతటి రాజభోగం అనుభవించిన కోడైనా సరే కాలుకు కత్తి కట్టాల్సిందే. బరిలోకి దిగి తాడో పేడో తేల్చుకోవాల్సిందే. ప్రత్యర్థి కోడిని పడగొట్టాల్సిందే. తన యజమానిని గెలుపు సిహాసనంపై కూర్చోబెట్టాల్సిందే..! ఒక్క క్షణం ఏమరుపాటుగా ఉన్నా ప్రత్యర్థి కోడి చేతిలో మరణం తప్పదు..!

కఠిన శిక్షణ.. ఖరీదైన ఆహారం..

పందెం కోసం పెంచే కోడి పుంజులను పెట్టలతో కలవకుండా ప్రత్యేకంగా కట్టి మేపుతారు. ఆహారం ఇచ్చేందుకు సమయ పాలన పాటిస్తారు. స్విమ్మింగ్‌తోపాటు వ్యాయామాలు చేయించి వాటి శరీరాన్ని దృఢంగా తయారు చేస్తారు. కోడి సరిగా కూయకపోయినా, పెట్టిన ఆహారం తినకపోయినా, రెట్ట సరిగా వేయక పోయినా, పడుకున్న కోడి లేవకపోయినా అనారోగ్యానికి గురైందని భావించి వైద్యులను సంప్రదిస్తారు. అది కుదుటపడే వరకు వీరు కునుకుతీయరు..! బరిలో పుంజులు విజయం సాధించాలంటే శరీరం బలంగా ఉండాలి. దీనికోసం జీడి పప్పు, బాదంపప్పు, చోళ్లు, గంట్లు, కోడి గుడ్లు, విజిటెబుల్స్ ముక్కలు.. ఇలా అనేక ఆహార పదార్థాలను అందజేస్తుంటారు. సంక్రాంతికి 60 రోజుల ముందు నుంచి బాదం, జీడిపప్పు, కర్బూరం, అంజీర, పిస్తా, నువ్వులు, తాటిబెల్లం వంటి 45 రకాల పౌష్టికాహార పదార్థాలను ఒక లడ్డుగా చుట్టి రోజూ ఉదయం అందిస్తారు. కోడిని బట్టి రోజూ ఉదయం 20 నుంచి 60 గ్రాముల లడ్డూ తయారు చేసి ఆహారంగా అందిస్తారు. ఒక్కో లడ్డూ తయారీకి రూ.50 నుంచి రూ.75 వరకు ఖర్చవుతుంది. ప్రతి రోజూ వేటమాంసం కైమా ఇస్తారు. కోడిపుంజు శరీర దృఢత్వం పెరగడానికి, ఒళ్లు నొప్పులు తగ్గడానికి డిసెంబరు నుంచి జామాయిల్, మద్యం ఇతర ఔషధాలతో తయారు చేసిన ఆయిల్‌తో కాపడం పెడుతుంటారు. ఇలా పందేలకు సిద్ధం చేసిన కోడి పుంజులు మార్కెట్‌లో రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలకు పైగా పలుకుతాయి. తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రాలోని ఇతర జిల్లాల నుంచి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి వచ్చి కోడి పుంజులను కొనుగోలు చేస్తుంటారు.

పందెం కోళ్లలో రకాలు

కోడిపందేల్లో పాల్గొనే పుంజుల జాతుల రంగులపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. గోదావరి జిల్లాల్లో అత్యధికంగా సీతువు, నెమలి డేగ, నెమలి, కోడిపచ్చకాకి, అబ్రస్, పండు డేగ, కోడి కాకి, కోడి రసంగి పుంజులపై అత్యధికంగా పందేలు కాస్తుంటారు. ఇవి అత్యంత బలంగా ప్రత్యర్థిపై దాడిగి దిగుతుంటాయి. ఎదుటి కోడి పుంజు దాడి నుంచి తప్పించుకుని గాల్లోనే క్షణాల్లో ప్రత్యర్థులపై దాడికి దిగుతాయి. గాయమైనా చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతుంటాయి. దీని కారణంగానే ఎదుటి వ్యక్తి ఒక పుంజును బరిలో దింపితే దానికి తగ్గట్టుగానే అదే స్థాయి ఉన్న పుంజును ప్రత్యర్థులు కొట్లాటకు దింపుతారు.

బరి మాది.. పుంజు మీది..

» గోదావరి గ్రామాల్లో కొత్త ట్రెండ్

(మొగల్తూరు-ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతికి కోడి పందేల కోసం మేం వేస్తున్న బరికి మీ పుంజుతో వచ్చి.. పందెంలో తప్పనిసరిగా పాల్గొనాలండీ'.. ఇదేదో పిలుపులా ఉందేంటి అనుకుంటున్నారా.? అవును నిజమే. ఇది పశ్చిమ గోదావరి జిల్లాలో బరుల నిర్వాహకులు తెచ్చిన కొత్తట్రెండ్. సంక్రాంతికి కోడి పందెం బరులు వేస్తున్నామని చెప్పడానికి, తమ బరిలో పందెం వేయాలని కోరడానికి పందెం రాయుళ్లతో పాటు, గ్రామాల్లోని పెద్దలు, ప్రభావిత వ్యక్తులకు ప్రత్యేకంగా మాంసాహారంతో విందు ఏర్పాటు చేసి మరీ పిలుస్తున్నారు. పండుగ మూడు రోజులు తమ బరులకు జనం బాగా రావడానికి, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పందేల్లో పాల్గొనడానికి వచ్చేవారిని తమ బరికి ఆకర్షించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవుడికీ దొరకరు!

(మొదటి పేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ కంపెనీనే ప్రారంభించారు. దీని వ్యవహారాలన్నీ ఈ ఆలయం ఈవోయే చూస్తున్నారు. ఆలయంలో కంటే విశాఖలోనే ఎక్కువగా ఉంటారు. శాఖ కీలక అధికారి కూడా భాగస్వామి కావడం, ఉన్నతాధికారి అండదండలు ఉండడంతో ఈయన ఆడిందే ఆట. ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి ప్రతి శనివారం భక్తులు పోటెత్తుతారు. సదరు ఈవో ఆ రోజు మాత్రం వస్తారు. మిగతా రోజుల్లో పత్తా ఉండరు. అలాగే కృష్ణాజిల్లాలో ఇంకో కీలక ఆలయం ఈవో లెక్కే వేరు. మంత్రులు గుడికి వచ్చినా ఆయన లెక్క చేయరు. ఈయన భార్య విజయవాడలోని ఓ ప్రముఖ కాలేజీలో లెక్చరర్ కావడంతో ఈయనా అక్కడే నివాసం ఉంటారు. వారానికి ఒక్కసారి కూడా గుడికి వెళ్లరు.

ఎమ్మెల్యే కావడమే లక్ష్యం..: ఎన్టీఆర్ జిల్లాకు చెందిన అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి రాజమండ్రిలో దేవదాయ శాఖ పరిధిలో ఈవోగా పని చేస్తున్నారు. ఎమ్మెల్యే కావడమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారు. అనేక ఆరోపణలున్న సదరు అధికారిని కలవాలంటే ఎవరైనా విజయవాడ రావలసిందే. ఆయనకు నచ్చినప్పుడు, బుద్ధి పుట్టినప్పుడు రాజమండ్రి వెళ్లి కాసేపు అందరికీ హాయ్ చెప్పి మళ్లీ విజయవాడ వచ్చేస్తారు. వ్యక్తిగత వ్యాపారాలు చేసుకుంటూ సొంతూర్లోనే ఎక్కువగా గడుపుతుంటారు. ఇదే జిల్లాలోని ప్రముఖ ఆలయం ఈవో.. గుడిలో కంటే దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలోనే ఎక్కువగా ఉంటారు. రెండు, మూడ్రోజులకోసారి కమిషనరేట్‌కు వచ్చి పేషీలో కాలక్షేపం చేయడమే పనిగా పెట్టుకున్నారు. కమిషనరేట్‌లోని కీలక అధికారికి శిష్యుడిగా ముద్ర వేసుకున్న సదరు ఈవో ఆలయ నిర్వహణను గాలికొదిలేశారు. విజయవాడలో ఒక మహిళా ఈవో నెలల తరబడి ఆలయం ముఖం చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. గ్రేడ్-1 ఈవోగా ఉన్న ఆమె ఏ ఆలయంలో పోస్టింగ్ తీసుకున్నా.. రోజువారీ విధులు నిర్వహించరు.

కాలేజీల్లో లెక్చరర్‌గా..: గుంటూరు జిల్లాలో ఓ పురాతన దేవాలయానికి ఇన్‌చార్జి ఈవోగా ఉన్న అధికారి ఎక్కువగా ప్రైవేటు కాలేజీల్లో ఉంటుంటారు. అక్కడ లెక్చరర్‌గా పని చేస్తూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. చిలకలూరిపేట సమీపంలోని ఇంకో ప్రముఖ ఆలయం ఈవో భార్య మార్కాపురంలో ప్రభుత్వ టీచరుగా ఉన్నారు. ఈయన ఆ ఊరు వదిలి రానేరారు. ఏవైనా ఫైళ్లుంటే రెండు వారాలకోసారి వచ్చి సంతకాలు పెట్టి చెక్కేస్తుంటారు. ప్రకాశం జిల్లాలోని ప్రముఖ ఆలయం ఈవో కూడా ఇంతే. మంత్రి మనిషినని చెప్పుకొంటూ తనకు నచ్చినప్పుడు గుడిని సందర్శిస్తుంటారు. ఇంకో ఈవో తాను ఎమ్మెల్యే బావమరిదినని చెప్పుకొంటూ.. ఎండోమెంట్ అధికారులను బెదిరిస్తూ రెండ్రోజులకోసారి ఆలయానికి వెళ్తుంటారు. ఇలా దాదాపు 70శాతం మంది ఈవోలు రోజువారీగా ఆలయాలకు వెళ్లని పరిస్థితి. వీరిపై దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం, జిల్లా అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. ప్రతి ఉద్యోగి ఎఫ్ఆర్ఎస్ వేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. అది వేస్తేనే జీతాలివ్వాలన్న నిబంధన ఉంది. ఇవేవీ ఆలయాల ఈవోలకు వర్తించడం లేదు. వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఈవోలు ఆలయాలకు డుమ్మా కొడుతున్నారని తెలిసినా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టడం లేదు. కొరడా ఝుళిపించి వారిని దారిలో పెట్టేవరకు.. సీఎం ఎంత అసహనం వ్యక్తం చేసినా.. ఎన్ని ఆర్టీజీఎస్ సర్వేలు చేసినా పెద్దగా ఉపయోగం ఏమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కుటుంబాన్ని వదిలేసి.. ఏపీకి వచ్చేసి!

» అబుధాబిలో పశ్చిమగోదావరి యువతితో కేరళకు చెందిన షాహనద్‌కు పరిచయం

» యువతితో వచ్చేసి.. అజ్ఞాతంగా కాపురం!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



గల్ఫ్ దేశాలకు వచ్చిన భారతీయులు కొందరు తప్పిపోవడం లేదా కుటుంబాలతో సంబంధాలు తెంపుకొని ఉండడం సహజం. కానీ అనూహ్యంగా గల్ఫ్ నుండి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయి, ఓ యువతితో అజ్ఞాతంలో కలిసి ఉంటున్న తమ కుమారుడిని వెతికిపెట్టమని కేరళకు చెందిన బాధిత కుటుంబం కోరుతోంది. తన భర్త ఆచూకీ కోసం ముగ్గురు చిన్నారులతో భార్య ఎదురుచూస్తోంది. వివరాల ప్రకారం.. కేరళలోని మణప్పురం జిల్లాకు చెందిన పాలకుందన్ షాహనద్ అనే 30 ఏళ్ల యువకుడు యూఏఈలోని అబుధాబిలో పనిచేసేవాడు. ఆయనకు భార్య జంషీరా, ముగ్గురు పిల్లలు ఉన్నారు. షాహనద్ పని చేస్తున్న కంపెనీ సమీపంలో పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన ఒక యువతి కూడా పని చేసేది. వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు, ఆపై వివాహేతర సంబంధానికి దారితీసింది. ఉద్యోగాన్ని, కుటుంబాన్ని వదిలేసిన సదరు యువకుడు.. ఆ యువతి వెంట పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చి, అక్కడ అమెతో కాపురం చేస్తున్నట్లుగా కేరళలోని అతడి కుటుంబం ఆరోపిస్తుంది. సదరు యువతి మాయమాటలతో మభ్యపెట్టి షాహనద్‌తో చర్చిలో పెళ్లి కూడా చేసుకుందనే సమాచారం తమకు ఉన్నట్లుగా చెబుతోంది.

ఖజానా ఖాళీ చేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చింది. పంచాయతీలకు బకాయిలన్నీ చెల్లించేసింది. తాజాగా మరో రూ.1000 కోట్లు దాకా పంచాయతీలకు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులను అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన సర్పంచ్‌లు తమ పదవీకాలం ముగిసేలోపు ఏదో ఒక రకంగా ఖర్చు చేసినట్లు చూపించి జేబులో వేసుకోవాలని చూస్తున్నారు. పంచాయతీల్లో ఒక్క పైసా కూడా లేకుండా ఖజానా ఖాళీ చేయాలన్న ప్రయత్నాల్లో ఉన్నారు. కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులే సర్పంచ్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఎలా కాజేయాలో సలహాలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు.. నిధులు స్వాహా చేయడానికి అవసరమైన మార్గాలను సర్పంచ్‌లకు సూచిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

యథేచ్ఛగా దోచేస్తున్నారు

పలువురు వైసీపీ సర్పంచ్‌లతో పాటు వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న రిజర్వుడ్ పంచాయతీల్లో యథేచ్ఛగా నిధులను స్వాహా చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మోటార్ల మైనర్ రిపేర్లకూ భారీగా ఎస్టిమేట్ వేసి పంచాయతీ నిధులను పంచుకుంటున్నారు. లైట్లు, మోటార్ ఉపకరణాలు, పంచాయతీలకు అవసరమైన ఇతర కొనుగోళ్లలో కూడా సర్పంచ్‌లు అందినంత దోచుకుంటున్నారు. పంచాయతీ తరఫున షాపుల్లో 50 శాతం వస్తువులు కొనుగోలు చేసి, 18 శాతం జీఎస్టీ పోను మిగిలిన మొత్తానికి కొనుగోళ్లు లేకుండానే బిల్లులు పెడుతున్నారు. పంచాయతీల్లో ఏ పనులు చేపట్టాలన్నా వర్క్ కమిటీలు వేయాలి. ఆ సంప్రదాయాన్ని గత ఐదేళ్లూ తుంగలో తొక్కారు. ఇప్పుడూ అదే పంథా అవలంబిస్తున్నారు. పంచాయతీల్లో రూ.50 వేలకు పైబడి కొనుగోళ్లకు టెండర్లు పిలవాలి. కానీ ఎక్కడా టెండర్లు జరిగిన దాఖలాల్లేవు. ఇష్టమొచ్చినట్లు షాపుల్లో బిల్లులు తెచ్చి పెడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈలు అధిక శాతం పర్సంటేజీలు తీసుకుని ఎంబుక్ రికార్డు చేసి ఇస్తున్నారు. దీంతో పంచాయతీల్లో పనులు చేయకుండానే నిధులు ఖాళీ అవుతున్నాయి.

ఆడిట్ తీరూ అంతే..

వార్షిక ఆడిట్‌లో పంచాయతీ ఆడిట్ అధికారులు సాధారణంగా అక్రమాలను పట్టించుకునే పరిస్థితి లేదు. ఆడిటర్లకు పర్సంటేజీలు ఇస్తే ఏదైనా ఓకే చేసే పరిస్థితి గ్రామ పంచాయతీల్లో ఉంది. పెద్ద పంచాయతీల్లో ఆడిట్ చేసినందుకు ఆడిటర్‌కు లంచంగా రూ.లక్ష నుంచి లక్షన్నర దాకా చెల్లిస్తున్నారు. లేని పనిని ఉన్నట్టుగా చూపి బిల్లులు పెట్టి పంచాయతీల నిధులు డ్రా చేస్తున్నారు.

సీఎఫ్ఎంఎస్‌లో బిల్లుల తనిఖీ ఏదీ?

గతంలో ట్రెజరీ ద్వారా బిల్లులు సమర్పించేవారు. ట్రెజరీ అధికారులు సరిచూసుకుని బిల్లులు విడుదల చేసేవారు. ఇప్పుడు కేంద్రం ఆదేశాలతో ట్రెజరీల నుంచి తప్పించి సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. కొన్ని మేజర్ పంచాయతీల్లో ఏవేవో బిల్లులు పెట్టి డ్రా చేస్తున్నారు. కొన్నిసార్లు విడ్డూరంగా వైట్‌పేపర్ పెట్టి మరీ సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని తనిఖీ చేసే పరిస్థితి లేకపోవడంతో పంచాయతీల్లో ఇష్టారీతిగా డబ్బులు డ్రా చేస్తున్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. ఎక్కడైనా పంచాయతీల్లో ఫిర్యాదులు వస్తేనే సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులను పరిశీలిస్తున్నారు. లేకపోతే ఆ బిల్లుల గురించి పరిశీలించే వ్యవస్థ గ్రామ పంచాయతీల్లో లేదు. మున్సిపాలిటీల్లో డబ్బులు డ్రా చేయాలంటే ముందు ప్రీ ఆడిట్ చేస్తారు. గ్రామ పంచాయతీల్లో అలాంటి విధానం లేదు. పంచాయతీల్లో స్టాక్ రిజిస్టర్లు పెట్టకుండానే, కొనుగోలు చేయకున్నా కొనుగోలు చేసినట్లు డబ్బులు డ్రా చేస్తున్నారు.

నిధులు అడ్డగోలు డ్రాకు చెక్

గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధుల స్వాహాకు సర్పంచ్‌లు తెరదీయడంతో పంచాయతీరాజ్ కమిషనరేట్ అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని పంచాయతీలకు ఇప్పటికే పలు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేస్తే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులు చేయకుండానే బిల్లులు పెట్టినా చర్యలు తప్పవన్నారు. పనులు చేయకుండానే ఎంబుక్‌లు రికార్డు చేస్తే ఏఈలపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ నిధుల వినియోగానికి సంబంధించి కూడా పంచాయతీరాజ్ కమిషనరేట్ పర్యవేక్షిస్తోంది. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల సెల్ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో అవకతవకలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా జిల్లాల డీపీఓలను హెచ్చరిస్తున్నారు. పంచాయతీల్లో నిధుల వినియోగానికి సంబంధించి డీపీఓలు, డీఎల్పీఓలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని సూచించారు. అడ్డగోలుగా డ్రా చేసిన పంచాయతీల పట్ల అప్రమత్తంగా ఉండి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలిచ్చారు.

లక్ష మంది టీచర్లపై టెట్ ఎఫెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

వారిలోనూ పదోన్నతికి సమీపంలో ఉన్నవారికి టెట్ అవసరం వచ్చింది. ఇక 1,04,595 మంది తప్పనిసరిగా టెట్ అర్హత సాధించాల్సి ఉంది. వారిలో 30,938 మంది మినహాయింపు లభించినా, లభించకపోయినా ఇబ్బంది రాకూడదనే ఉద్దేశంతో ప్రస్తుతం టెట్ రాశారు. మరో 74 వేలమంది మినహాయింపుపై ఆశతో టెట్ జోలికి వెళ్లలేదు. టీచర్లందరికీ టెట్ తప్పనిసరి అని ఈ ఏడాది సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి రెండేళ్లలోపు టెట్ లేని టీచర్లంతా అర్హత సాధించాలని స్పష్టం చేసింది. వచ్చే జనవరిలో డీఎస్సీ నిర్వహిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం తాజాగా టెట్ నిర్వహించింది. ఇప్పుడు టెట్ రాయనివారు మళ్లీ నోటిఫికేషన్ వరకు ఆగాలి. మినహాయింపు లభించకపోతే రెండోసారి అయినా టీచర్లు టెట్ రాయాల్సి వస్తుంది. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న వారికి మినహాయింపు ఇవ్వడంతో 23,207మంది టీచర్లు మాత్రం కాస్త ప్రశాంతంగా ఉన్నారు. ఇన్‌సర్వీసు టీచర్లకు టెట్ మినహాయింపు కోరుతూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై సమీక్ష కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు పిటిషన్లు దాఖలు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేసింది. ఈ ప్రయత్నాలు ఫలించి మినహాయింపు లభిస్తే దేశవ్యాప్తంగా లక్షల మంది టీచర్లు ఊపిరి పీల్చుకుంటారు.

ఈ వయసులో ఎలా రాయగలం?

2012కు ముందు టీచర్ ఉద్యోగాలు పొందినవారంటే.. వారి కనీస సర్వీసు 15 ఏళ్లు. ఇరవై ఏళ్లకు పైగా టీచర్లుగా కొనసాగుతున్నవారు చాలామంది ఉన్నారు. వారిలో చాలా మంది వయసు 50 ఏళ్లు దాటింది. ఈ వయసులో కొత్తగా టెట్ రాయడం ఎలా సాధ్యమని వారు ప్రశ్నిస్తున్నారు. గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌కు ఒకే పేపరుతో టెట్ జరుగుతుంది. కానీ ఈ సబ్జెక్టులకు టీచర్లు వేర్వేరుగా ఉంటారు. వారి సంబంధిత సబ్జెక్టు నుంచి 20 మార్కులకే ప్రశ్నలు వస్తాయి. టెట్ అర్హత సాధించాలంటే 150 మార్కులకు ఓసీలకు 90, బీసీలకు 75, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 60 మార్కులు రావాలి. వృత్తిపరంగా ఇన్నేళ్ల అనుభవం ఉన్న టీచర్లు టెట్ ఎందుకు ఉత్తీర్ణత సాధించలేరని కొందరు ప్రశ్నిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా ఇదే అభిప్రాయంతో ఇన్‌సర్వీసు టీచర్లు టెట్ అర్హత సాధించాలని తీర్పులో పేర్కొంది.

టెట్‌కు 2.48 లక్షల మంది హాజరు

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ఆదివారం ముగిశాయని టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. టీచర్లు, బీఈడీ, డీఈడీ అభ్యర్థులు మొత్తం 2,71,698 మంది దరఖాస్తు చేసుకోగా, 2,48,427(91.43శాతం) మంది పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని పేపర్ల ప్రాథమిక కీ విడుదల చేశామని, మిగిలిన పేపర్ల కీని 26వ తేదీన విడుదల చేస్తామని వివరించారు. అభ్యర్థులు ప్రాథమిక కీపై అభ్యంతరాలుంటే టెట్ వెబ్‌సైట్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. వ్యక్తిగతంగా, లేఖల రూపంలో వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు.

విధేయతకు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసేవారికి, సీనియర్లకు ఈసారి పదవుల్లో పెద్ద పీట వేశారు. ప్రస్తుత జాబితా ప్రకారం 11మంది ఓసీలకు 8 మంది బీసీలకు, నలుగురు ఎస్సీలకు, ఒక ఎస్టీకి, ఒక మైనార్టీకి అవకాశం కల్పించారు. ఓసీల్లో కాపులు, రెడ్లు, కమ్మవర్గానికి మూడేసి చొప్పున, క్షత్రియులు, బలిజలకు చెరొకటి దక్కింది. కొద్దిరోజుల క్రితం ఖరారైన వారిలో కొందరిపై పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తంచేయడం.. మరికొందరు అధ్యక్ష బాధ్యతలను తీసుకునేందుకు సుముఖత చూపకపోవడం, సామాజిక సమీకరణలు కారణాలుగా ఐదుగురిని మార్చి తుది జాబితాను ఖరారు చేశారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష పదవుల్లో సీనియర్లతోపాటు పదవులతో సంబంధం లేకుండా తొలి నుంచీ పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న వారికీ అవకాశమిచ్చారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో గట్టిగా పోరాడిన వారికీ ప్రాధాన్యమిచ్చారు. కీలక పార్లమెంటు నియోజకవర్గాల బాధ్యతలను సీనియర్లకు అప్పగించారు. గోదావరి జిల్లాల్లో సామాజిక సమీకరణల ఆధారంగా పదవులు కేటాయించారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న వారిలో నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, ఆరుగురు నామినేటెడ్ చైర్మన్లు ఉన్నారు.

మార్పుచేర్పులు ఇలా..

అనకాపల్లికి తొలి జాబితాలో పరిశీలనలో ఉన్న బాలాజీపై స్థానికంగా పెద్ద సానుకూలత రాకపోవడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం అనకాపల్లి పార్లమెంటు అధ్యక్షుడిగా ఉన్న బత్తుల తాతయ్యబాబునే కొనసాగించాలని నిర్ణయించారు. కర్నూలుకు పరిశీలనలో ఉన్న వహీద్ హుస్సేన్ విషయంలోనూ అదే పరిస్థితి రావడంతో ఆయన స్థానంలో గుడిశె కృష్ణమ్మకు అవకాశం కల్పించారు. కర్నూలులో వహీద్‌ను మార్చడంతో నరసరావుపేటలో కొమ్మాలపాటి శ్రీధర్ స్థానంలో షేక్ జానే సైదాకు అవకాశం ఇచ్చారు. అనంతపురంలో కాల్వ శ్రీనివాసులు విముఖత చూపడంతో పూల నాగరాజును నియమించారు. నంద్యాలలో ధర్మవరం సుబ్బారెడ్డి విషయంలో స్థానిక ఎమ్మెల్యేలు, నాయకుల నుంచి సానుకూలత లేకపోవడంతో గౌరు చరితారెడ్డిని నియమించారు.

టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు వీరే..

పార్లమెంటు	అధ్యక్షుడు	ప్రధాన కార్యదర్శి
1. శ్రీకాకుళం	మోదవలస రమేశ్	పీరికట్ల విఠల్‌రావు
2. విజయనగరం	కిమిడి నాగార్జున	ప్రసాదుల వరప్రసాద్
3. అరకు	మోజోరు తేజోవతి	దత్తి లక్ష్మణరావు
4. విశాఖపట్నం	చోడే వెంకట పట్టాభిరామ్	లొడగల కృష్ణ
5. అనకాపల్లి	బత్తుల తాతయ్యబాబు	లాలం కాశినాయుడు
6. కాకినాడ	జ్యోతుల నవీన్	పెంకే శ్రీనివాస్‌బాబా
7. రాజమండ్రి	బొడ్డు వెంకటరమణచౌదరి	కాసి నవీన్
8. అమలాపురం	గుత్తల సాయి	పాలం రాజు
9. ఏలూరు	బడేటి రాధాకృష్ణ(చంటి)	ముత్తారెడ్డి జగ్గవరపు
10. నర్సాపురం	మంతెన రామరాజు	పితాని మోహనరావు
11. విజయవాడ	గద్దె అనురాధ	చెన్నుబోయిన చిట్టిబాబు
12. మచిలీపట్నం	వీరంకి గురుమూర్తి	గోవు సత్యనారాయణ
13. నర్సరావుపేట	షేక్ జానే సైదా	నల్లపాటి రామచంద్ర ప్రసాద్
14. గుంటూరు	పిల్లి మాణిక్యరావు	పోతినేని శ్రీనివాసరావు
15. బాపట్ల	సలగల రాజశేఖర్‌బాబు	నక్కల రాఘవ
16. ఒంగోలు	ముక్కు ఉగ్రనరసింహారెడ్డి	కొఠారి నాగేశ్వరరావు
17. నెల్లూరు	బీద రవిచంద్ర	చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి
18. కర్నూలు	గుడిశె కృష్ణమ్మ	పూల నాగరాజు యాదవ్
19. నంద్యాల	గౌరు చరితారెడ్డి	ఎన్ఎండీ ఫిరోజ్
20. రాజంపేట	సుగవాసి ప్రసాద్‌బాబు	పఠాన్ ఖాదర్‌ఖాన్
21. హిందూపురం	ఎంఎస్ రాజు	హనుమప్ప
22. అనంతపురం	పూల నాగరాజు	జి.శ్రీధర్ చౌదరి
23. కడప	చదిపిరాళ్ల భూపేశ్ సుబ్బరామిరెడ్డి	వైఎస్ జబీవుల్లా
24. తిరుపతి	పనబాక లక్ష్మి	డాలర్ దివాకరరెడ్డి
25. చిత్తూరు	షణ్ముగ రెడ్డి	వై.సునీల్‌కుమార్ చౌదరి



రంపచోడవరంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్ భువనేశ్వరి

సేవే పరమావధిగా ఎన్టీఆర్ ట్రస్టు

» ట్రస్టీ నారా భువనేశ్వరి వెల్లడి.. రంపచోడవరంలో మెగా వైద్య శిబిరం

రంపచోడవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా నిరుపేద కుటుంబాలకు, వైద్య, విద్య, మహిళలకు స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ఆదివారం అల్లూరి జిల్లా రంపచోడవరంలో జీఎస్ఎల్, జీఎస్ఆర్ హాస్పిటల్స్ సహకారంతో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. తొలుత సీతపల్లి బాపనమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రంపచోడవరం వైటీసీ ఆవరణలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరానికి చేరుకున్న భువనేశ్వరికి వేదమంత్రాలతో పాటు ఆదివాసీలు సంప్రదాయ కొమ్ము నృత్యాలతో ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో 16,365 మెడికల్ క్యాంపులు నిర్వహించి 22.64 లక్షల మందికి వైద్య సేవలు అందించామన్నారు. రూ.22.97కోట్ల విలువైన మందులను ప్రజలకు పంపిణీ చేశామని చెప్పారు. సంజీవని ద్వారా 2,183 మొబైల్ క్యాంపులు నిర్వహించి 4.50 లక్షల మందికి వైద్య సేవలందించామన్నారు.

అశోక్ గజపతిరాజు రాజకీయాలకే ఆదర్శం

» సీపీఐ నారాయణ, రామకృష్ణ ప్రశంసలు

అమరావతి/హైదరాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏవియేషన్ ఎడ్యుసిటీకి రూ.1,000 కోట్ల విలువైన 136.63 ఎకరాల సొంత భూమిని దానం చేసేందుకు ముందుకొచ్చిన గోవా గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ జగపతిరాజుకు సీపీఐ సీనియర్ నేతలు కె.నారాయణ, కె.రామకృష్ణ అభినందనలు తెలిపారు. తన సొంత ఆస్తిని ప్రభుత్వానికి ఉచితంగా ఇవ్వడం ద్వారా రాజకీయాలకే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

'సహకార' ఎన్నికలు నిర్వహించండి: సీపీఐ

సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆదివారం లేఖ రాశారు. ఎన్నికలు నిర్వహించకుండా పాలక మండళ్ల గడువు పొడిగించడం సరికాదని పేర్కొన్నారు.

మరికొన్ని రోజులు గజగజ

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల ప్రభావంతో రెండు వారాలకుపైగా చలితీవ్రత కొనసాగుతోంది. ఆదివారం కోస్తా, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఏజెన్సీలో అనేకచోట్ల 10 డిగ్రీల కంటే తక్కువకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టులో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనేక ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉత్తర, మధ్యభారతంలో నెలకొన్న వాతావరణం ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత మరికొన్ని రోజులు కొనసాగుతుందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. రానున్న 3-4 రోజుల్లో చలి తీవ్రత పెరుగుతుందన్నారు.

అమరావతికి 2024 నుంచి చట్టబద్ధత!

» అమిత్‌షా హామీ.. అటార్నీ జనరల్‌తో చర్చ

» రాజధానికి త్వరలో ప్రత్యేక పిన్‌కోడ్

» ఎస్టీడీ, ఐఎస్‌డీ కోడ్‌లు కూడా: పెమ్మసాని



గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో రాజధాని అమరావతిని ఎవరూ తరలించడానికి వీల్లేకుండా చట్టబద్ధత కల్పించేందుకు కేంద్రం అంగీకరించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. 2024 నుంచి ఈ చట్టబద్ధతను అమల్లోకి తెస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని తెలిపారు. దీనికి సంబంధించి అటార్నీ జనరల్‌తో కూడా చర్చించినట్లు వెల్లడించారు. ఆదివారం తాడేపల్లిలోని తన నివాస సముదాయంలో పెమ్మసాని మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాజధానికి త్వరలోనే ప్రత్యేకంగా పిన్‌కోడ్, ఎస్టీడీ, ఐఎస్‌డీ కోడ్‌లను మంజూరు చేయబోతున్నామన్నారు. విభజన చట్టంలో మంజూరై అమరావతికి కేటాయించిన అన్ని కేంద్ర సంస్థలతో చర్చలు జరిపి వాటి ఆఫీసుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాను పర్యవేక్షించే తపాలా శాఖ హెడ్ ఆఫీసు పనులు మరో మూడు నెలల్లో రాజధానిలో ప్రారంభమవుతాయన్నారు. రాజధాని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వాళ్లలో సంతృప్తి నెలకొల్పుతున్నామని చెప్పారు. 'రాజధాని నగరంలో జనసాంద్రత పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపడతాం. ప్రధానంగా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షిస్తాం. కొన్ని ఐటీ కంపెనీలను అమరావతిలో ఏర్పాటు చేసే విషయంపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తా. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ కాంప్లెక్సులు, హైకోర్టు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏఐఎస్ అధికారులు, సిబ్బంది నివాస సముదాయాలను రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇవి పూర్తయితే ప్రజలు ఇక్కడకు వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు అనువైన వాతావరణం కలుగుతుంది. ఈలోపు రాజధానికి అవసరమైన రైలు, రోడ్డు మార్గాల కనెక్టివిటీని పెంచేందుకు అవసరమైన పనులు చేపడతాం. ఎల్‌పీఎస్ లేఅవుట్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. అవి పూర్తయితే భవన నిర్మాణాలకు అనుమతులు వస్తాయి. ప్లాట్ల సైజులను తగ్గిస్తే హైదరాబాద్‌లోని మరో పాతబస్తీలా మారుతుంది. అలా కాకుండా ప్రపంచ స్థాయి నగరాన్ని ఇక్కడ ఏర్పాటు చేసేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారు. ఇందుకు అందరూ సహకరించాలి' అని కోరారు. గుంటూరు నగరంలో రైల్వే వంతెనలపై ఎక్కువగా దృష్టి పెట్టామన్నారు. శంకర్‌విలాస్ ఆర్వోబీ.. టైం షెడ్యూల్ ప్రకారం నిర్మాణం జరుగుతోందని.. వచ్చే ఏడాది ఆఖరుకు పూర్తి చేస్తామని చెప్పారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.*